ప్రభాత
వెలుగు
21.01.2019
www.v6velugu.com
సోమవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 335 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL

రైతు రుణమాఫీకి 24 వేల కోట్లు

హామీలన్నీ వందకు వందశాతం అమలు చేస్తం

- మూడేండ్లలో కోటి 25 లక్షల ఎకరాలకు నీళ్లు
- మా ఫస్ట్ ప్రయారిటీ ఇరిగేషన్
- మార్చి 30 నాటికి భగీరథ పూర్తి
- వచ్చే బడ్జెట్ నుంచి పింఛన్ల పెంపు అమలు
- నిరుద్యోగ భృతికి ఐదారునెలల టైం
- క్రాప్‌లోన్లు కూడా 'ధరణి' చూసే ఇస్తరు
- అందరి హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తం
- త్వరలోనే ఈఎన్‌టీ, డెంటల్ పరీక్షలు
- లాటరీ పద్ధతిలో ఇండ్ల కేటాయింపు
- అన్ని తండాలకు బీటీ రోడ్లు
- రోడ్ల మీద చెత్త వేస్తె రూ.500 జరిమానా
- ఆయుష్మాన్ భారత్ కంటే ఆరోగ్యశ్రీ బెటర్

– అసెంబ్లీలో సీఎం కేసీఆర్

"ఇచ్చిన హామీ ప్రకారం చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ప్రతి రైతుకు రూ. లక్ష వరకు రుణాలు మాఫీ చేస్తం. బ్యాంకుల నుంచి ఇబ్బందులు రాకుండా చూస్తం. గత ప్రభుత్వంలో రూ. 17 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినం. అది ఈసారి రూ. 24 వేల కోట్లుగా ఉంటది. వందకు వందశాతం మాఫీ చేసి తీరుతం.

దేశంలో ఆక్సిజన్ క్లబ్‌లు కూడా వస్తున్నయి. డబ్బులు పెట్టి ఆక్సిజన్ కొనుగోలు చేసే పరిస్థితులు ఏర్పడుతున్నయి. అలాంటి పరిస్థితి భావితరాలకు రాకుండా చూడాలి. ఏది కొందామన్నా కల్తీ చేస్తున్నరు. కారం, పసుపు, నూనె ఆఖరికి పసిపిల్లలు తాగే పాలను కూడా కల్తీ చేస్తున్నరు. కల్తీ నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నం.



02

ఎర్రవల్లికి యాగ శోభ



సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో సీఎం కేసీఆర్ సోమవారం నుంచి తలపెట్టిన మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగానికి సిద్ధమైన యాగశాల, (ఇన్‌సెట్లో) హోమగుండాలు. ఐదు రోజుల పాటు ఈ యాగం సాగుతుంది.

02

మల్లన్నకు 'పట్నం' వైభోగం

పట్నం వారం సందర్భంగా
లక్ష మందికిపైగా భక్తుల రాక
బోనాలు తీసి,
ఒడి బియ్యం పోసి మొక్కులు



06

కొమురవెల్లి మల్లన్న క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారాన్ని పట్నం వారంగా వ్యవహరిస్తారు. వారం వారం మూడు నెలల పాటు సాగే జాతర తొలివారం కావడంతో లక్ష మందికిపైగా భక్తులు కొమురవెల్లికి వచ్చారు. మల్లన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానికి దాదాపు ఐదు గంటల సమయం పట్టింది. హైదరాబాద్‌తోపాటు సమీప జిల్లాల నుంచి శనివారమే పెద్ద సంఖ్యలో భక్తులు కొమురవెల్లికి వచ్చి.. సంప్రదాయం ప్రకారం ధూళి దర్శనం చేసుకున్నారు. ఆదివారం పుణ్య స్నానాలు చేసి, మల్లన్నకు బోనాలను, ఒడి బియ్యాన్ని సమర్పించారు. ఆలయ ఆవరణలో పట్నాలు వేసి, గంగరేణి చెట్టుకు ముడుపులు సమర్పించుకున్నారు. తర్వాత సమీపంలోని గుట్టపై ఉన్న ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తుల రాకతోపాటు శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాలతో కొమురవెల్లి కోలాహలంగా కనిపించింది.

– సిద్దిపేట, వెలుగు

రిసార్టులో ఎమ్మెల్యేల ఫైటింగ్!

కర్ణాటక రాజకీయాల్లో మరో ట్విస్ట్ . బెంగళూరు శివార్లలోని ఈగల్టన్ రిసార్ట్స్‌లో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొట్టుకున్నారు. ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్ తలపై మరో ఎమ్మెల్యే జేఎన్ గణేశ్ బాటిల్‌తో కొట్టారని, దీంతో ఆనంద్ ఆస్పత్రిలో చేరారని వార్తలు వచ్చాయి. అయితే ఎటువంటి ఘర్షణా జరగలేదని, ఛాతీ నొప్పితోనే ఆయన ఆస్పత్రిలో చేరారని కాంగ్రెస్ నేతలు చెపుతున్నారు.

05

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
77.00	77.00	77.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
78.00	77.00	76.00

ఇయ్యాల్నే తొలి 'పంచాయతీ'

ఏర్పాట్లు పూర్తి ● ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్
2 గంటల నుంచి కౌంటింగ్ ● వెంటనే ఫలితాలు, ఉప సర్పంచ్ ఎన్నిక

తొలిదశ పంచాయతీ ఎలక్షన్ల వివరాలు

ఎన్నిక జరుగుతున్న పంచాయతీలు 4,479	ఏకగ్రీవమైనవి 769
పోలింగ్ జరుగుతున్నవి 3,710	పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులు 12,202
ఎన్నిక జరుగుతున్న వార్డులు 39,822	ఏకగ్రీవమైనవి 10,654
పోలింగ్ జరుగుతున్నవి 28,976	పోటీలో ఉన్న అభ్యర్థులు 70,094



హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో తొలిదశ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 197 మండలాల పరిధిలోని 3,710 పంచాయతీలు, 28,976 వార్డులకు సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్నాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుంది. 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. లెక్కింపు పూర్తయిన వెంటనే రిటర్నింగ్ అధికారి ఫలితాలను ప్రకటిస్తారు. ఆ వెంటనే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. గెలిచిన వార్డు మెంబర్లు తమలో ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకుంటారు. ఈ ఎన్నికకు నిర్దిష్ట ప్రక్రియ ఏదీ లేకపోవటంతో వార్డు మెంబర్లు చేతులెత్తి తమ అంగీకారం తెలిపే విధానాన్ని అనుసరించనున్నారు. రిటర్నింగ్ అధికారులు విజేతల వివరాలను జిల్లా కలెక్టర్‌కు పంపుతారు. కలెక్టర్లు జిల్లా పరిధిలోని మొత్తం సమాచారాన్ని క్రోడీకరించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందజేస్తారు. ఎన్నిక ప్రక్రియను అంతా వీడియో రికార్డింగ్ చేయనున్నారు. సమస్యాత్మక పంచాయతీల్లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలిదశ పంచాయతీ ఎన్నికలు జరిగిన చోట్ల కోడ్ ముగిసినట్లుగా ఒకటి రెండు రోజుల్లో అధికారులు ప్రకటించనున్నారు.

బ్యాలెట్ పేపర్‌లో కేవలం గుర్తులే

పంచాయతీ ఎన్నికల బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థుల గుర్తులు మాత్రమే ఉంటాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లాగా

మిగతా 3లో

నీటి పడగలు



నెమలి పురివిప్పినట్లుగా ఉన్న ఈ నీటి పడగలు నాగర్ కర్నూల్ జిల్లా మేడిపూర్ వద్ద ఆదివారం కనిపించాయి. మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ పగిలిపోయి ఈ ఫౌంటెన్ ఏర్పడింది. గుడిపల్లిగట్టు రిజర్వాయర్ నుంచి కృష్ణాజలాలను కల్వకుర్తి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించేందుకు వేసిన పైప్ లైన్ ఇది. 30 అడుగుల ఎత్తున ఎగిసిపడిన నీటితో నాగర్ కర్నూల్-కల్వకుర్తి ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. రిపేర్ కోసం గుడిపల్లిగట్టు రిజర్వాయర్ వద్ద నీటి సరఫరాను నిలిపివేశారు. అయినా పైప్ లైన్ నుంచి నీరు పూర్తిగా వెళ్లిపోతే కానీ రిపేర్ చేయడం సాధ్యం కాదని అధికారులు చెప్పారు.

- నాగర్‌కర్నూల్, వెలుగు

రైతు రుణమాఫీకి రూ.24 వేల కోట్లు

హామీలన్నీ వందకు వందశాతం అమలు చేస్తం • అసెంబ్లీలో సీఎం కేసీఆర్ స్పష్టీకరణ


ఆదివారం సభలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, వెలుగు: "టీఆర్ఎస్ ప్రభుత్వం ఆచరించిన, అనుసరించిన, అవలంబించిన విధానాలతోనే ప్రజలు మరోసారి అఖండ విజయంతో గెలిపించిన్రు. తెలంగాణ ప్రభుత్వం రైతు ప్రభుత్వం. సమైక్యపాలనలో రైతాంగం నలిగిపోయింది.. రైతులు అవస్థలు పడ్డరు. మేనిఫెస్టో అమలుకు ఐదేండ్ల సమయముంది. గతంలో మాదిరిగానే ఇచ్చిన హామీలను వందకు వందశాతం అమలు చేస్తం' అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. పెంచిన రైతు బంధు సాయం, పింఛన్లు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఇస్తామని, నిరుద్యోగ భృతి అమలుకు ఐదారు నెలల సమయం పట్టే అవకాశముందని చెప్పారు. ఇచ్చిన హామీ ప్రకారం చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ప్రతి రైతుకు రూ. లక్ష వరకు రుణాలు మాఫీ చేస్తామన్నారు. బ్యాంకుల నుంచి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. గతంలో రూ. 17 వేల కోట్ల రైతు రుణమాఫీ చేశామని, అది ఈసారి రూ. 24 వేల కోట్లుగా ఉందని, వందకు వందశాతం రుణ మాఫీ చేసి తీరుతామని సీఎం స్పష్టం చేశారు. ఈసారి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో రెవెన్యూ రికార్డులు సరిగా లేకపోవడానికి కాంగ్రెస్సే కారణమన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆదివారం అసెంబ్లీలో చర్చ జరిగింది. ముందుగా తీర్మానాన్ని ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ ప్రతిపాదించగా, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బలపరిచారు. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే బలాల, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడారు. సభ్యులు లేవనెత్తిన పలు అంశాలపై చివరిలో సీఎం వివరణ ఇస్తూ మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం పబ్లిక్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగం లాగా ఉందని కొంతమంది అంటున్నారని, వారి రాజకీయ పరిజ్ఞానానికి జాలిపడటం తప్ప చేయగలిగింది ఏమి లేదన్నారు. 'ఏ పార్టీ ప్రభుత్వాన్ని గెలిపించారో, ఆ పార్టీ మేనిఫెస్టో, అదే పాలసీ గవర్నర్ ప్రసంగంలో ఉంటది. గవర్నర్ అంటే పార్ట్ ఆఫ్ ది గవర్నమెంట్. కేబినెట్‌లో చెప్పిందే గవర్నర్ చదువుతరు. గవర్నర్ ప్రసంగం రైట్‌లైన్లోనే ఉన్నది' అని స్పష్టం చేశారు. సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

ఏం డౌట్ వద్దు

"నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు? పెంచిన పింఛన్లు, రైతుబంధు ఎప్పుడు ఇస్తారు అని కాంగ్రెస్ సభ్యులు వెంకటరమణారెడ్డి అడిగారు. మీకు ఏం డౌట్ వద్దు, ఇచ్చిన హామీలు వందశాతం అమలు చేస్తం. గతంలో మేనిఫెస్టోలో కూడా చెప్పని 76 స్కీములను అమలు చేసినం. రైతుబంధు, రైతుబీమా, కంటి వెలుగు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు మేనిఫెస్టోలో చెప్పలేదు. రైతు రుణమాఫీ చేస్తమని కాంగ్రెస్ చెప్పి పంజాబ్, రాజస్థాన్, కర్నాటకలో అధికారంలోకి వచ్చింది. పంజాబ్‌లో ఇవ్వలేదు. మిగిలిన రాష్ట్రాల్లో కమిటీలు వేసింది. తెలంగాణలో రెండు లక్షలు ఒకేసారి మాఫీ చేస్తమని కాంగ్రెస్ చెప్పినా ప్రజలు నమ్మలేదు. ఇచ్చిన హామీ ప్రకారం గతంలో రూ. 17 వేల కోట్ల రుణాలను మాఫీ చేసినం. ఈసారి కూడా రూ. 24 వేల కోట్లు మాఫీ చేస్తం. దీనికి సంబంధించి విధివిధానాల రూపొందుతున్నయి.

పోడు భూముల సమస్యకు స్వస్తి

రాష్ట్రంలో పోడు భూముల సమస్యకు స్వస్తి పలకాలి. గతంలో నిజామాబాద్‌లో ఫారెస్ట్ భూములకు అసైన్‌మెంట్ పట్టాలిచ్చిండ్రు. ఇలాంటివి చాలా చోట్ల ఉన్నయి. అటవీ చట్టాలన్నీ కఠినంగా ఉంటయి.. అవన్నీ కేంద్రం పరిధిలవే. అడవులు ధ్వంసమైనయి. వాటిని పరిరక్షించే బాధ్యత మనపై ఉన్నది. దేశంలో ఆక్సిజన్ క్లబ్‌లు కూడా వస్తున్నయి. డబ్బులు పెట్టి ఆక్సిజన్ కొనుగోలు చేసే పరిస్థితులు ఏర్పడుతున్నయి. అలాటి పరిస్థితి భావితరాలకు రాకుండా చూడాలి. కలప దొంగల భరతం పడుతం. స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపుతం. అటవీ భూముల ఓనర్‌షిప్ ఎట్టి పరిస్థితుల్లోనూ మారదు. అటవీ భూములపై ఆధారపడి బతుకుతున్న గిరిజనులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నం. త్వరలోనే గిరిజన ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి.. సలహాలు, సూచనలు తీసుకుంటం.

రోడ్లపై చెత్త వేస్తే రూ.500 జరిమానా

రాష్ట్రంలో చాలా చోట్ల సర్పంచులు, వార్డుమెంబర్లు, కార్యదర్శులు సరిగా పనిచేస్తలేరు. దీంతో కొత్తగా పంచాయతీరాజ్ చట్టం తీసుకొచ్చినం. జీపీల పర్యవేక్షణకు 9 వేల మంది కార్యదర్శులను నియమిస్తున్నం. వాళ్లు సరిగా పనిచేస్తేనే రెగ్యులర్ చేస్తమని చెప్పి, మూడేండ్లపాటు ప్రొబెషనరీ పీరియడ్ పెట్టినం. రోడ్లపై చెత్తాచెదారం వేస్తే రూ. 500 జరిమానా అని చట్టంలో చెప్పినం. లోక్‌సభ ఎన్నికల తర్వాత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తం. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నం. అవసరమైతే ఆ శాఖ నాదగ్గరే పెట్టుకుని చట్టాన్ని అమలు చేయిస్త.

ఆయుష్మాన్ భారత్ కంటే ఆరోగ్యశ్రీ బెటర్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌లో మనం చేరలేదు. ఈ పథకం ద్వారా మంచికంటే కీడే ఎక్కువుంది. దానికంటే వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ మంచిగుంది. ఇదే విషయాన్ని ప్రధాని మోడీకి కూడా చెప్పినం. కేసీఆర్ కిట్లలో కేంద్ర ప్రభుత్వం వాటా ఏకాణా కూడా లేదు. అచ్చంగా మన రాష్ట్ర ప్రభుత్వ సొమ్మే. హక్కు ప్రకారం కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధులు రావాలె. పన్నుల రూపంలో మనం కట్టే పైసల్లో వాటా అది. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నం. జీఎస్టీ వసూళ్లలోనూ తెలంగాణనే నెంబర్ 1గా ఉంది. కంటి వెలుగు ద్వారా ఇప్పటికి కోటి 30లక్షల మందికి పరీక్షలు నిర్వహించినం. ఇంకా ఆపరేషన్లను ప్రారంభించలేదు. ఈఎన్‌టీ, డెంటల్ డాక్టర్ల టీములు రెడీ అవుతున్నయి. ప్రజలతో పాటు మండల, జిల్లా, రాష్ట్ర హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తున్నం.

నియోజకవర్గాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

పంటలకు గిట్టుబాటు ధర మనకు మనమే ఏర్పాటు చేయలేం. అది కేంద్రం చేతిలో ఉంటది. ఇటీవల కొంత పెంచినా అది సంతృప్తికరంగా లేదు. ఇదే విషయాన్ని మోడీకి కూడా చెప్పిన. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఐకేపీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం ద్వారా 45 వేలకు పైగా ఉన్న మహిళా సంఘాలను దీనిలో పాత్రధారులుగా చేస్తం. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసి, వాటి నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగిస్తం. ఏది కొందామన్నా కల్తీ చేస్తున్నరు. కారం, పసుపు, నూనె ఆఖరికి పసిపిల్లలు తాగే పాలను కూడా కల్తీ చేస్తున్నరు. కల్తీ నిరోధానికి చర్యలు తీసుకుంటున్నం. పంటకాలనీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్‌పై అధ్యయనం జరుగుతున్నది.

ఇరిగేషనే ఫస్ట్ ప్రయారిటీ

రాష్ట్ర ప్రభుత్వం ఫస్ట్ ప్రయారిటీ ఇరిగేషనే. రాబోయే మూడేండ్లలో కోటీ 25 లక్షల ఎకరాలకు నీళ్లు రాబోతున్నయి. ప్రాజెక్టుల మీద ఇప్పటిదాకా రూ. 99 వేల కోట్లు ఖర్చు పెట్టినం. రెండు, మూడు నెలల్లో మరో రూ. 8 కోట్ల దాకా ఖర్చవుతది. ఆన్ గోయింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ. లక్షా 17 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నం. మొత్తంగా రెండు లక్షల 25వేల కోట్లతో కోటీ 25 లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తం. కృష్ణా, గోదావరి నదుల నుంచి తెలంగాణకు కేటాయించిన 1300 టీఎంసీల నీటిలోని ప్రతిబొట్టును సద్వినియోగం చేసుకుంటం. రాష్ట్రంలో 23,968 ఆవాసాలతోపాటు 142 మున్సిపాలిటీల్లోకి మిషన్ భగీరథ నీళ్లు చేరినయి. 18,612 ఊళ్లలో నల్లాలు బిగించి, ఇంటింటికి వాటర్ సరఫరా చేస్తున్నం. మిగిలిన అన్ని ఊళ్లకు త్వరలోనే నీళ్లందించి, మార్చి30 నాటికి మిషన్ భగీరథ స్కీమ్‌ను కంప్లీట్ చేస్తం.

ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ

రాష్ట్రంలో రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టడం కొన్ని టీచర్స్ యూనియన్లకు ఇష్టం లేదు. తమనూ ఇన్వాల్వ్ చెయ్యాలని ప్రైవేటు విద్యాసంస్థలు కోరుతున్నయి. చర్చించి నిర్ణయం తీసుకుంటం. వైద్యసేవల్లో మూడో స్థానంలో రాష్ట్రం నిలిచిందని నీతి అయోగ్ ప్రకటించింది. రాష్ట్రంలో ఐదారు చోట్ల మెడికల్ కాలేజీలను మంజూరు చేస్తం. ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నం. ఎమ్మెల్యే జగ్గారెడ్డి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని సంగారెడ్డికి ప్రాధాన్యం ఇస్తం.

ఐదేండ్లలో పది లక్షల కోట్ల సంపాదన, ఖర్చు

తెలంగాణలో ఐదేండ్లలో రూ. పది లక్షల కోట్ల సంపాదన, ఖర్చు ఉంటది. కేంద్రంలో అనుకూల ప్రభుత్వమున్నది. రానున్న ప్రభుత్వం అనుకూలమైనదైతే మరో రూ. లక్షన్నర కోట్లు ఎక్కువ నిధులు వస్తయి. రిప్లేస్‌మెంట్ చార్జ్‌డ్ అకౌంట్స్ కింద రూ. 2.4 లక్షల కోట్లు అప్పులుగా పోతయి. మళ్లా రూ.1.30లక్షల కోట్లు అప్పు తీసుకునే అవకాశముంటది. ఈ లెక్కన రూ. 8.90 లక్షల కోట్లు ఉంటయి. దీంతో జీతాలు, ఇతర ఖర్చులు పోను మిగిలే నాలుగైదు లక్షల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. కాంగ్రెస్ హయాంలో పదేండ్లలో ఇసుక మీద రూ. 9.56 కోట్ల ఆదాయం వస్తే.. తెలంగాణ వచ్చిన నాలుగేండ్ల పది నెలల కాలంలో రూ. 240 కోట్ల ఆదాయం వచ్చింది. కేంద్రానికి 500 వరకు వినతిపత్రాలు ఇచ్చినా.. పైసా ఎక్కువ విడుదల చేయలేదు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ కార్యక్రమాలు బాగున్నయని, రూ.24 వేల కోట్లు అదనంగా తెలంగాణకు ఇవ్వాలని నీతి ఆయోగ్ రెకమండ్ చేసినా పైసా ఇవ్వలేదు."

ఇంటికాడికే రైతు బీమా

రైతులు ఆత్మహత్య చేసుకున్నా, సహజ మరణం పొందినా ఆర్థిక సాయం అందించేందుకు రైతులకు బీమా చేయించినం. ఇప్పటికి 6,062 మంది రైతు కుటుంబాలకు బీమా అందింది. వారికి ఖాతాల్లో రూ.303 కోట్లు పడ్డయి. పది రోజుల్లోనే ఇంటికే బీమా అందేలా చర్యలు తీసుకుంటున్నం. గత ప్రభుత్వాలు రైతులపై నిర్లక్ష్యం వహించినయి. సర్వేయర్లను కూడా నియమించలేదు. కానీ తెలంగాణ ప్రభుత్వం సుమారు 16 వందల మంది రెవెన్యూ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్లను రిక్రూట్ చేసింది. సర్వేయర్ పోస్టుల నియామకాలు కూడా ప్రాసెస్‌లో ఉన్నయి.

భూ రికార్డుల ప్రక్షాళన చేసి తీరుతం

రాష్ట్రంలో రెవెన్యూ రికార్డులు సరిగా లేవంటే దానికి ఎవరు కారణం..? కాంగ్రెస్ కదా?! భూ రికార్డులు ప్రక్షాళన చేసే సమయంలో కేంద్రాన్ని కలిసినం. అప్పటికే మూడు రాష్ట్రాలు చేస్తమని చెప్పి విఫలమైనయని కేంద్ర అధికారులు చెప్పిండ్రు. కానీ ఇప్పుడు మాకు ఓ లెక్క దొరికింది. వందకు వందశాతం టీఆర్ఎస్ సర్కారు రైతు ప్రభుత్వంగానే ఉంటది. ధరణి వెబ్‌సైట్ పెడుతున్నం. ఇది విప్లవాత్మకమైనది. రాష్ట్రంలో ప్రతి ఇంచు భూమి వివరాలు కూడా అందులో ఉంటయి. లంచాలు లేకుండా, రూపాయి మారకుండా భూ రికార్డుల ప్రక్షాళన చేస్తం. ఈ సమయంలో కఠిన నిర్ణయాలు కూడా తీసుకుంటం. ఇప్పటికే 54 లక్షల మందికి పట్టాపాస్ బుక్కులు పంచినం. 58 ఏండ్ల కాలంలో ఏ ప్రభుత్వమూ భూరికార్డుల ప్రక్షాళన గురించి మాట్లాడలే. ఏండ్ల కింద చనిపోయిన వారి భూముల వివరాలు కూడా వేరే పేర్లకు మారలేదు. అందుకే వీటిని సవరించేందుకు నడుం కట్టినం. ఏ మండలంలోని భూములు ఆ మండలంలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. పహాణీ, నకళ్లు కూడా అవసరం లేదు. క్రాప్‌లోన్లు కూడా ధరణి వెబ్‌సైట్ చూసి ఇచ్చేలా చర్యలు తీసుకుంటం. గతంలో బ్యాంకులు ఇల్లీగల్‌గా పాస్‌బుక్కులు వాళ్ల దగ్గర పెట్టుకున్నయి. ఆ విధానాన్ని రద్దు చేసినం. భూప్రక్షాళనలోనూ దేశంలో రికార్డు సృష్టిస్తం.



లాటరీ పద్ధతిలో ఇండ్లిస్తం

గత ప్రభుత్వాల హయాంలో గృహ నిర్మాణ పథకాల్లో ప్రజలకు ఉచితంగా ఇండ్లు ఇవ్వలేదు. కానీ మేము డబుల్ బెడ్ రూం ఇండ్లు ఉచితంగా ఇస్తున్నం. హడావుడిగా మేం డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టబోమని ముందుగల్లనే చెప్పినం. గత ప్రభుత్వాల హయాంలో ఇండ్లు కట్టే విధానంలో అవినీతి జరిగింది. వాళ్లు కట్టిన ఇండ్లు ఎటుపోయినయో అర్థమైతలేదు. అందుకే హౌసింగ్ కార్పొరేషన్‌ను రద్దు చేసినం. మేము రాష్ట్రంలో రెండు లక్షల 70 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మంజూరు చేసినం. చాలా చోట్ల నిర్మాణాలు జరుగుతున్నయి. హైదరాబాద్‌లో దాదాపు 30 వేల ఇండ్లు నిర్మాణాల్లో ఉన్నయి. అవినీతి నిర్మూలనకు ప్రజాప్రతినిధుల పాత్రను తొలగించి, లబ్ధిదారుల ఎంపికను అధికారులకే అప్పగించినం. ఇండ్లను కూడా లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తున్నం. రాష్ట్రంలో పేదల కోసం కట్టాల్సిన ఇండ్ల సంఖ్య ఎంత అనేది లెక్క తేల్చే పనిలో ఉన్నం.

కౌలు రైతులకు రైతు బంధు లేదు

కౌలు రైతులకు రైతుబంధు ఇవ్వడం లేదు. కౌలు రైతుల సంక్షేమాన్ని చూసే బాధ్యత భూయజమానులే తీసుకోవాలి. రాష్ట్రంలో 27 వేల కిలోమీటర్ల రోడ్లున్నయ్. కొత్తగా ఏర్పడిన తండా గ్రామ పంచాయతీలకు బీటీ రోడ్ల కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటం. ఏడాది పాటు కొత్త రోడ్ల నిర్మాణాల మంజూరుకు అనుమతులు ఇవ్వబోం. పాత రోడ్లను బాగుచేస్తం. ప్రాంతీయ రింగురోడ్లను నిర్మిస్తం. దేశంలో శాంతి భద్రతల విషయంలో తెలంగాణ ముందంజలో ఉన్నది.

అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రసంగాలు

కేసీఆర్ ప్రధాని కావాలి

దేశానికి కేసీఆర్ ప్రధాని కావాల్సిన అవసరం ఉంది. సంపదను సృష్టించడమే కేసీఆర్ లక్ష్యం. ఆ సంపదను ప్రజలకు చేరవేస్తున్నారు. రైతు బంధు, కంటి వెలుగు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అమలు చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించే మహిళలకు రూ.13 వేలు, కేసీఆర్ కిట్ అందజేస్తున్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలు కేసీఆర్‌తోనే సాధ్యం.

- వేముల ప్రశాంత్‌రెడ్డి, టీఆర్ఎస్ ఎమ్మెల్యే

హామీల అమలు ఎప్పటి నుంచి?

రుణమాఫీ ఎప్పుడు చేస్తారు, ఫుడ్ ప్రాసెసింగ్‌కు బడ్జెట్‌లో ఎన్ని నిధులు కేటాయిస్తారు, పెరిగిన పింఛన్లు ఎప్పటి నుంచి ఇస్తారు, నిరుద్యోగ భృతి విధివిధానాలు ఏంటి, ఎప్పట్నుంచి ఇస్తారో సీఎం చెప్పాలి. ముందస్తు ఎన్నికలకు వెళ్లడంతో ఆపద్ధర్మ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడింది. పంచాయతీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎలక్షన్లతో కోడ్‌తో ఎలాంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదు. ప్రభుత్వం ఏర్పాటై ఇన్ని రోజులైనా పూర్తి స్థాయి కేబినెట్‌ను ఏర్పాటు చేయలేకపోయారు.

- గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే

కేసీఆర్ వర్సెస్ గండ్ర

శాసన సభలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. 'మీ గవర్నర్ చెప్పారు.. మీ గవర్నర్ ప్రకటించారు'అని గండ్ర పదే పదే ప్రస్తావించడంపై కేసీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'గండ్ర వెంటకరమణారెడ్డి సీనియర్ సభ్యులు.. 'మీ గవర్నర్'అని పదేపదే అనడం సరికాదు. గవర్నర్ అందరికీ గవర్నరే.. టీఆర్ఎస్‌కో గవర్నర్.. కాంగ్రెస్‌కో గవర్నర్ ఉండరు. దీన్ని మీరు సరిదిద్దుకోవాలి..'అని సూచించారు. దీంతో స్పందించిన గండ్ర.. 'సీఎం సూచనను స్వీకరిస్తున్నా.. నిన్న గవర్నర్ ప్రసంగం ప్రతుల్లో కూడా రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం పోరాటం చేస్తుందని రాయాల్సి ఉండగా, టీఆర్ఎస్ ప్రభుత్వం పోరాటం చేస్తుందని రాశారు. దాన్ని కూడా సవరించాలి"అని వ్యాఖ్యానించారు. దీంతో కేసీఆర్ కల్పించుకుంటూ.. 'ఇక్కడుంది ఏ ప్రభుత్వం.. టీఆర్ఎస్ ప్రభుత్వమే కదా.. దానికంత అబ్జెక్షన్ ఎందుకు.. అంత ఆత్మ వంచన ఎందుకు.. ఏ పార్టీ గెలిచి ఉంటే ఆ పార్టీ గవర్నమెంటే ఉంటది కదండి. పార్టీల నుంచే గవర్నమెంట్లు వస్తయి.. అంత అసహనం ఎందుకు? డెఫినెట్‌గా ఉన్నది టీఆర్ఎస్ ప్రభుత్వమే. పోరాటం చేసేది కూడా టీఆర్ఎస్ ప్రభుత్వమే. ఏం తప్పులేదు. అట్లనే రాస్తం.. ముందుకు కూడా రాస్తం. అలా రాయకపోతేనే తప్పు'అని చెప్పారు. దీంతో అధికారపక్ష సభ్యులంతా బల్లలు చరిచారు.

డ్రగ్స్ కేసు ఏమైంది?

రాష్ట్రంలో శాంతిభద్రతలు చాలా బాగున్నాయి. కానీ డ్రగ్స్ కేసు ఎంత వరకు వచ్చింది? పూర్తి వివరాలు చెప్పాలి. క్రికెట్ బెట్టింగ్‌ను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? నాలుగేళ్లలో కేవలం పదివేల డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టారు. మిగతావి ఎప్పటికి కడతారు? సీఎం హామీతో ధూల్‌పేటలో సారా తయారీని ఆపేశారు. కానీ వారికి పునరావాసం కల్పించడంలో సర్కారు విఫలమైంది.

- రాజాసింగ్, బీజేపీ ఎమ్మెల్యే

కేంద్రంలో టీఆర్ఎస్ కీ రోల్

లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ 16 సీట్లు గెలిచి, కేంద్రంలో కీలకపాత్ర పోషిస్తుంది. భవిష్యత్‌లో ఫెడరల్ ఫ్రంట్ అధికారంలోకి వస్తుంది. దేశాన్ని కాంగ్రెస్, బీజేపీ ముక్త్ భారత్ చేయాల్సి అవసరం ఉంది. సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రజలు బుద్ధి చెప్పారు. పదేళ్లైనా పీసీసీ చీఫ్ ఉత్తమ్ గడ్డం అలానే ఉంటుంది. తెలంగాణ పాలిట విలన్ చంద్రబాబును ఏపీ జనం కూడా తరిమికొడతారు.

- అబ్దుల్ బలాలా, ఎంఐఎం ఎమ్మెల్యే

జైల్లో శశికళకు.. వీఐపీ సౌకర్యాలు

ఆర్‌టీఐ నివేదిక ద్వారా బహిర్గతం

బెంగళూరు: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళకు జైల్లో రాజభోగాలు అందుతున్నాయి. ఆమె జైలు జీవితాన్ని ఆహ్లాదకరంగా గడుపుతున్నారని ఆర్‌టీఐ నివేదిక ద్వారా బహిర్గతమైంది. పరప్పన్అగ్రహారం జైల్లో శిక్ష అనుభవిస్తున్న శశికళ కోసం అధికారులు ఐదు సెల్స్‌ను కేటాయించారని రిపోర్ట్‌లో ఉంది. " శశికళ కోసం ఒక రూమ్‌ను మాత్రమే అలాట్‌చేశారు. కానీ ఆమెకు అదనంగా నాలుగు సెల్స్‌ను ఇచ్చారు. 2017 ఫిబ్రవరి 14 ఉదయం వరకు నాలుగు సెల్స్‌లో ఖైదీలు ఉన్నారు. కానీ ఆమె జైలుకు వచ్చిన సాయంత్రం వారిని ఖాళీ చేయించి వేరే చోటకు తరలించారు. అంతే కాకుండా ఆమెకు ఒక ఖైదీ స్పెషల్‌గా వంట చేస్తుంది." అని ఆర్‌టీఐ కార్యకర్త నరసింహ మూర్తి చెప్పారు. పరిపాలనా విభాగంలోని మొదటి అంతస్తులో ఆమెను కలవడానికి వచ్చే వారితో ఆమె సమావేశం అవుతుందని చెప్పారు. శశికళకు జైల్లో 'ఏ' క్లాస్‌ట్రీట్‌మెంట్ ఇస్తున్నారని ఆరోపిస్తూ జైళ్ల శాఖ డీఐజీ రూప తనిఖీల్లో వెల్లడైంది.

మోడీ లేకుంటే అరాచకమే: జవదేకర్

పూణే: ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యామ్నాయం లేదని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. మోడీని కాదనుకుంటే దేశంలో అరాచకం నెలకొంటుందని హెచ్చరించారు. ప్రజలు బలమైన ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారా లేక బలహీనమైన సర్కార్‌ను కోరుకుంటున్నారా అనేది లోక్ సభ ఎన్నికల్లో కీలకాంశం అవుతుందని ఆదివారం అన్నారు. "మోడీని అధికారం నుంచి దించేయడమే అన్ని పార్టీలకు ఏకైక లక్ష్యంగా మారింది. మోడీ దిగిపోతే ఆయనకు ప్రత్యామ్నాయం ఎవరు? ఆ ప్రత్యామ్నాయాన్ని ప్రతిపక్ష నాయకులు చూపించలేకపోయారు" అని అన్నారు. గతంలో బలహీనమైన సంకీర్ణ ప్రభుత్వాల హయాంలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు.


ఆదివారం రాత్రి విద్యుద్దీపాల వెలుగుల్లో ఎర్రవల్లిలోని యాగశాల

సహస్ర చండీ మహాయాగం

ఎర్రవల్లిలో నేటి నుంచి ఐదురోజులపాటు నిర్వహణ

- సతీసమేతంగా పాల్గొననున్న సీఎం కేసీఆర్
- 300 మంది రుత్వికుల ఆధ్వర్యంలో మహత్తర ఘట్టం
- టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

హైదరాబాద్/సిద్దిపేట, వెలుగు: సీఎం కేసీఆర్ తలపెట్టిన 'చతుర్వేద పురస్సర మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగాని'కి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఈ మహత్తర ఘట్టం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఐదురోజులపాటు అంటే.. ఈ నెల 25 వరకు యాగం కొనసాగనుంది. ఇందుకోసం యాగశాలలతోపాటు హోమ గుండాలను తీర్చిదిద్దారు. ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం సీఎం కేసీఆర్ పరిశీలించారు. ఈ యాగానికి కుటుంబ సమేతంగా రావాలంటూ టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్మన్లకు ఆహ్వానాలు వెళ్లాయి. వేద పండితులు మాడుగుల మాణిక్య సోమయాజులు, నరేంద్రకాపే, ఫణిశశాంక శర్మ, భద్రకాళి వేణు ఆధ్వర్యంలో 300 మంది రుత్వికులు యాగ నిర్వహణలో పాల్గొంటారు. మన రాష్ట్రంతోపాటు కర్నాటక, మహారాష్ట్ర, ఏపీ నుంచి కూడా రుత్వికులు ఆదివారమే యాగశాలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు యగ క్రతువును చేపడుతారు. ఉదయం 11 గంటలకు గోపూజ చేసిన అనంతరం యాగం ప్రారంభమవుతుంది. ఐదురోజులపాటు యాగంలో సీఎం కేసీఆర్, శోభ దంపతులు పాల్గొంటారు.

భారీ బందోబస్తు

యాగం పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్, అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో 150 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. ఫాంహౌస్ పరిసరాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వీఐపీల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మూడేళ్ల క్రితం ఆయుత చండీయాగం

2015 డిసెంబర్ 23 నుంచి 27 వరకు ఆయుత శత చండీయాగం నిర్వహించిన సీఎం కేసీఆర్ మొన్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజశ్యామల యాగం నిర్వహించారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అనంతరం విశాఖ శారద పీఠంలోని రాజశ్యామల ఆలయాన్ని సందర్శించారు. శారదా పీఠం ఆధ్వర్యంలోనే సహస్ర చండీయాగాన్ని నిర్వహిస్తున్నారు. సీఎం కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ప్రజాప్రతినిధులను మాత్రమే యాగానికి ఆహ్వానించారు.

సహస్ర చండీ మహాయాగం ఇలా..

ఐదు రోజులపాటు సాగే చతుర్వేద పురస్సర మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగంలో ప్రతిరోజు పారాయణలు ఉంటాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పది హోమగుండాల్లో ఒక్కో హోమ గుండం వద్ద పది మంది రుత్వికులు హోమం నిర్వహిస్తారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. ఆ తర్వాత సాయంత్రం 4 నుంచి 7.30 వరకు వేద పారాయణలు కొనసాగుతాయి. చండీ యాగంతో పాటు మహా రుద్రం, రాజశ్యామల, పీతాంబరి దేవి అనుష్టానం, సూర్య యాగం, నవగ్రహ యాగం, సూర్య అనుష్టాలు, వాస్తు, గణపతి వంటి అనుబంధ యాగాలు ఉంటాయి. చివరి రోజు చండీ మాతను ప్రసన్నం చేసుకుంటారు. మిగిలిన నాలుగు రోజులు పారాయణంతో మాత్రమే చేస్తారు. ఈ హోమానికి సుమారు వేయి కిలోల పాయస ద్రవ్యం తయారు చేస్తున్నారు. బియ్యం, బెల్లం, కాజూ, కిస్మిస్, ఇలాచి ఇలాంటి సుగంధ ద్రవ్యాలతో ఈ వంటకాన్ని రూపొందిస్తున్నారు. ఈ మొత్తాన్ని చివరి రోజు యజ్ఞగుండంలో వేస్తూ అమ్మవారిని ప్రసన్నం చేసుకుంటారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఎం కేసీఆర్

4 రోజులు.. 9.28 గంటలు

ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాలు, గవర్నర్ ప్రసంగం..

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర రెండో శాసనసభ తొలి సమావేశాలు నాలుగు రోజులు సాగాయి. మొత్తంగా 9.28 గంటల పాటు సమావేశాలు జరిగాయి. 17వ తేదీన ఉదయం 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన సభ ప్రారంభమైంది. ఆ రోజున సీఎం కేసీఆర్ సహా 115 మంది ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. అదేరోజున శాసనసభ స్పీకర్ పదవికి టీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. 18న ఉదయం పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రొటెం స్పీకర్ ప్రకటించారు. తర్వాత పోచారం స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కూకట్‌పల్లిలో గెలిచిన మాధవరం కృష్ణారావు 18న, గోషామహల్‌లో గెలిచిన రాజాసింగ్ 19న ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. శనివారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రసంగించారు. ఆదివారం ఉదయం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టి చర్చించారు. సీఎం ప్రసంగం అనంతరం దానిని ఆమోదించాక స్పీకర్ శాసనసభను నిరవధికంగా వాయిదా వేశారు. ఎంఐఎం ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, జాఫర్ హుస్సేన్‌లు ప్రమాణ స్వీకారం చేయలేదు. అక్బరుద్దీన్ అనారోగ్యంతో లండన్‌లో చికిత్స పొందుతుండగా, జాఫర్ హుస్సేన్ మక్కా యాత్రకు వెళ్లినట్టు సమాచారం.



- ధన్యవాద తీర్మానంతో ముగిసిన అసెంబ్లీ
- నిరవధికంగా వాయిదా వేసిన స్పీకర్

మండలి 4.54 గంటలు

నూతన శాసన సభ ఏర్పాటు నేపథ్యంలో శాసన మండలి కూడా ఒక రోజు సమావేశమైంది. ఆదివారం ఒక్కరోజు సాగిన ఈ సభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం చేశారు. 4.54 గంటల పాటు సభ సాగింది. 18 మంది సభ్యులు ప్రసంగించారు. ఉదయం 10.30 గంటలకు మండలి సమావేశం మొదలుకాగా.. పల్లా రాజేశ్వర్‌రెడ్డి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ తీర్మానాన్ని బలపరుస్తూ టీఆర్ఎస్ సభ్యుడు బోడకుంటి వెంకటేశ్వర్లు ప్రసంగించారు. రాష్ట్రంలో కులవృత్తులకు ప్రోత్సాహం అందించింది. టీఆర్ఎస్ సర్కారే అని చెప్పారు. అనంతరం కాంగ్రెస్ సభ్యుడు షబ్బీర్‌అలీ మాట్లాడారు. సీఎం బహిరంగసభలో మాట్లాడిన అంశాలే కాపీ పేస్ట్ చేసిన విధంగా గవర్నర్ ప్రసంగం ఉందని విమర్శించారు. తెలంగాణ అమరుల త్యాగాలను ప్రస్తావించ లేదేమని ప్రశ్నించారు. పెంచిన పెన్షన్లు, నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలు, గురుకులాల్లో ఫ్యాకల్టీ కొరత ఉందని, వెంటనే భర్తీ ప్రక్రియ చేపట్టాలని బీజేపీ సభ్యుడు రాంచందర్‌రావు కోరారు. వీరితోపాటు ఎంఐఎం సభ్యుడు జాఫ్రీ, కాటేపల్లి జనార్దన్‌రెడ్డి కూడా మాట్లాడారు. అనంతరం చర్చకు హోంమంత్రి మహమూద్ అలీ సమాధానమిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పాలన సాగుతోందన్నారు. ఏ రాష్ట్రం చేయని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. ఈ తీర్మానాన్ని ఆమోదించాక చైర్మన్ మండలిని నిరవధికంగా వాయిదా వేశారు. కాగా.. ఉభయ సభల్లో పంచాయతీరాజ్ చట్టం2018 సవరణ ఆర్డినెన్స్ బిల్లును ప్రవేశపెట్టారు. త్వరలో నిర్వహించే బడ్జెట్ సమావేశాల్లో దానిపై చర్చించి ఆమోదించనున్నారు.

ఏపీలో టీడీపీ ఓటమి ఖాయం: తలసాని

హైదరాబాద్, వెలుగు: ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. ఏపీలో ఒకే కులం ఆధిపత్యం నడుస్తోందని, దీనిపై అక్కడి ప్రజలు గుర్రుగా ఉన్నారని చెప్పారు. తెలంగాణలో మాదిరిగా ఏపీ ప్రజల్లో సెంటిమెంట్ ఉందదని, అక్కడి ప్రజలు ఇప్పటికే ఎవరికి ఓటేయాలో డిసైడ్ అయిపోయారని అన్నారు. సంక్రాంతికి ఏపీకి వెళ్తే అక్కడి బీసీ నాయకులు తనకు ఘనస్వాగతం పలికారని గుర్తు చేశారు. గద్దల్లా వాలుతున్నారని ఏపీ సీఎం చంద్రబాబు మాట్లాడటం ఆయనలోని భయానికి నిదర్శనమన్నారు. ఏపీకి ఇంతవరకు వెళ్లింది తానొక్కడినేనని, అదే సీఎం కేసీఆర్ వెళ్తే అక్కడి ప్రజలు పోటెత్తడం ఖాయమని చెప్పారు. చంద్రబాబుతో కలిసి పోటీ చేస్తే పవన్ కళ్యాణ్‌కే రాజకీయంగా ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ఫెడరల్ ఫ్రంట్ తరఫున ఏపీలో ప్రచారం చేస్తానని ఆయన అన్నారు.

అసెంబ్లీలో రాజకీయాలొద్దు

పేదలు, రైతుల బాగు కోసం చర్చిద్దాం: స్పీకర్ పోచారం

హైదరాబాద్, వెలుగు: రాజకీయాలను శాసనసభ బయటే చేసుకుందామని.. సభలో రాష్ట్ర ప్రగతి, పేదల ఆకాంక్షలు, రైతుల బాగు కోసం చర్చిద్దామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారు. కొత్తగా ఎన్నికైన వారితో పాటు ఆరేడు సార్లు గెలిచినవారు కూడా ఉన్నారని, అందరూ సభ గౌరవాన్ని పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. ఆదివారం అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం అనతికాలంలోనే దేశంలో నంబర్‌వన్‌గా నిలిచిందని చెప్పారు. తాను సీఎం కేసీఆర్ మార్గనిర్దేశంలో వ్యవసాయ మంత్రిగా ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచాయని పేర్కొన్నారు.

జనం నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

ఇవి ప్రజలు నమ్మకంతో ఇచ్చిన పదవులని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఎమ్మెల్యేపై ఉందని స్పీకర్ పోచారం అన్నారు. 1977లో గ్రామస్థాయి సొసైటీ అధ్యక్షుడిగా రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టిన తాను ఇప్పుడు శాసనసభాపతిగా అత్యున్నత స్థాయికి చేరుకున్నానన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేలుగా అహంభావం పెంచుకోవద్దని, ఈ పదవిని పెద్ద బాధ్యతగా గుర్తించాలని కోరారు. శాసనసభ సమయం ఎంతో విలువైనదని, దానిని అనవసరమైన విమర్శలతో వృథా చేయవద్దని సూచించారు. రాష్ట్ర శాసనసభను దేశంలోనే గౌరవప్రదమైన సభగా తీర్చిదిద్దుదామన్నారు. కొత్తగా సభకు ఎన్నికైన వాళ్లు ఏవైనా చిన్నపాటి పొరపాట్లు చేస్తే పెద్దది చేయవద్దని మీడియాను కోరారు.

అందరికీ అవకాశమిస్తం

సభలో గవర్నర్ అద్భుతమైన ప్రసంగం చేశారని, దానిపై సాగిన చర్చకు సీఎం మంచి సమాధానం ఇచ్చారని స్పీకర్ చెప్పారు. శాసనసభను సజావుగా నిర్వహించేలా అన్ని పార్టీలు కలిసిరావాలని కోరారు. రాజకీయాలు సభ బయటే చేసుకోవాలన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు పార్లమెంటరీ నియమ నిబంధనలు, ప్రశ్నలు, కాగ్ రిపోర్ట్ ఇతర సభా వ్యవహారాలపై వర్క్‌షాప్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రజా సమస్యలు ప్రస్తావించే ప్రతి సభ్యుడికి సభలో మాట్లాడే అవకాశమిస్తానని, గాడి తప్పితే మైక్ కట్ చేయడం ఖాయమని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపుల అంశాన్ని ప్రస్తావించగా.. ఏ పార్టీ ఏ సభ్యుడినీ బలవంతపెట్టి చేర్చుకోబోదని, చాలా మంది స్వచ్ఛందంగానే పార్టీలు మారుతున్నారని స్పీకర్ వ్యాఖ్యానించారు. అలాంటి అంశాల్లో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అసెంబ్లీ వెబ్‌సైట్‌ను ఆధునీకరిస్తామని, అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచుతామని తెలిపారు.



- సభ గౌరవాన్ని కాపాడుకుందాం
- సభ్యులందరికీ మాట్లాడే అవకాశం
- ఫిరాయింపులపై చట్ట ప్రకారం నడుచుకుంటానని వెల్లడి

'కాంగ్రెస్ ఓటమికి ఉత్తమ్ కారణం కాదు'

హైదరాబాద్, వెలుగు: సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్కకు ఇచ్చే ఇంపార్టెన్స్ పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డికి సీఎం కేసీఆర్ ఇవ్వకపోవచ్చని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కారణం కాదని, ఆయన సమర్థవంతంగా పనిచేసినప్పటికీ పరిస్థితులు అనుకూలించలేదన్నారు. ఉత్తమ్‌ను పీసీసీ చీఫ్‌గా కొనసాగించడమే పార్టీకి మేలన్నారు. ఆదివారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఫిబ్రవరిలో సంగారెడ్డిలో లక్ష మందితో కృతజ్ఞత సభ నిర్వహిస్తానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మెదక్ నుంచి పోటీ చేస్తే బాగుంటుందన్నారు. లాబీ యింగ్, పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలు సీఎల్పీ నేత ఎంపికలో పనిచేశాయని చెప్పారు.

ఏమో..? ఏదైనా జరగొచ్చు..

హైదరాబాద్ , వెలుగు: సర్పంచులతో కలిసి టీఆర్ఎస్‌లో చేరుతున్నారా అన్న మీడియా ప్రశ్నకు 'ఏమో..? ఏదైనా జరగొచ్చు' అంటూ టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సమాధానమిచ్చారు. ఆదివారం ఉదయం శాసనసభ ప్రారంభమైన తర్వాత స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు అసెంబ్లీ ఆవరణలో పలువురు మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. టీఆర్ఎస్‌లో చేరితే అందరితో చెప్పే చేరుతానని.. కార్యకర్తలు, నేతల అభిప్రాయం తీసుకోవాల్సి ఉంటుందని సండ్ర వెంకటవీరయ్య అన్నారు. 'పంచాయతీ ఎన్నికల కారణంగా మూడు రోజులు హైదరాబాద్ రాలేదు. ప్రగతి భవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌ను కలిస్తే మీడియాకు తెల్వకుండ ఉంటుందా' అని వ్యాఖ్యానించారు.

- టీఆర్ఎస్‌లో చేరితే అందరికీ చెప్త కదా: టీడీపీ ఎమ్మెల్యే సండ్ర
- ఎమ్మెల్యేగా ప్రమాణం

మీడియా పాయింట్

ఆధారాల్లేకుండా విమర్శించొద్దు

దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న పథకాలపై ఆధారాల్లేకుండా ఆరోపణలు చేయొద్దు. వీల్లైతే ఇంకేం చేయాలో చెప్పండి. గవర్నర్ ప్రసంగం ప్రభుత్వ పనితీరుకు అద్దంపట్టింది. మిషన్ కాకతీయ, భగీరథ వంటి పథకాలు మంచి ఫలితాలిస్తున్నాయి.

- జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి

చెర్వుగట్టు జాతరకు పిలిచిన..

నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు జాతరకు రావాలని సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించా. తప్పకుండా వస్తానన్నరు. జాతరలో పార్కింగ్, సత్రాల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని కోరిన. నియోజకవర్గంలో నేషనల్ హైవే పనులు, ఉదయ సముద్రం ప్రాజెక్టు, ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి కాల్వలను ఆధునీకరించాలని విన్నవించా.

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

సోమశిల - సిద్ధేశ్వరం వంతెన నిర్మించండి

మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ వద్ద కృష్ణానదిపై తెలంగాణ, రాయలసీమను కలిపే సోమశిల సిద్ధేశ్వరం వంతెన నిర్మించాలని సీఎంను కోరా. కొల్లాపూర్ నుంచి ఏపీలోని కర్నూలు జిల్లాకు వెళ్లాలంటే నాటు పడవలే దిక్కు. గతంలో ఇలా వెళ్తుంటే పడవలు మునిగి జనం చనిపోయారు. బ్రిడ్జి నిర్మిస్తే రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు.

- కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

ఉద్యోగాల ఊసేది?

గవర్నర్‌ప్రసంగంలో కీలక అంశాల ప్రస్తావన లేదు. లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, అందులో సగం కూడా భర్తీ చేయలేదు. వర్సిటీల్లో రెండు వేల అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నా.. ఆ ప్రస్తావన లేదు. కట్టిన ఇండ్ల లెక్క చెప్పకుండా 2.7 లక్షల ఇండ్లు కడుతున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. కాళేశ్వరం మీద దృష్టి పెట్టి మిగతా వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారు.

- బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

ఇయ్యాల్నే తొలి 'పంచాయతీ'

(మొదటి పేజీ తరువాయి..)

అభ్యర్థుల పేర్లు ఉండవు. కేవలం అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు మాత్రమే వరుసగా ఉంటాయి. అభ్యర్థులెవరూ నచ్చకపోతే వేసేందుకు నోటా గుర్తు కూడా ఉంటుందని అధికారులు తెలిపారు.

- గత నెల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసిన వారికి ఎడమ చేతి చూపుడు వేలిపై సిరా గుర్తు పెట్టడంతో.. పంచాయతీ ఎన్నికల్లో ఎడమ చేతి మధ్య వేలికి సిరా గుర్తు పెట్టనున్నారు.
- ఇప్పటికే మొదటి దశ పోలింగ్ జరిగే గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మద్యం అమ్మకాలు బంద్ చేశారు.
- మద్యం, ఇతర మత్తు పదార్థాలు తీసుకుని గానీ, మరణాయుధాలు, చుట్ట, బీడీ, పొగాకు, అగ్గిపెట్టె, లైటర్ వంటి వాటిని తీసుకొనిగానీ పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించకూడదనే నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయి.

బ్యాలెట్ పేపర్‌ను కిందికి మడవొద్దు

బ్యాలెట్ పేపర్ కావడంతో ఓటేసేప్పుడు జాగ్రత్తలు పాటించాలని అధికారులు చెబుతున్నారు. నచ్చిన అభ్యర్థి గుర్తుపై ఓటు ముద్ర వేశాక.. బ్యాలెట్ పేపర్‌ను నేరుగా కిందికి మడవవద్దని, అలాగైతే ఇంకు మరో గుర్తుపై అంటుకుని ఓటు చెల్లకుండా పోతుందని తెలిపారు. బ్యాలెట్ పేపర్‌ను ఎడమ నుంచి కుడివైపునకు మలవాలని సూచించారు. సర్పంచ్, వార్డు మెంబర్లకు వేర్వేరు బాక్సుల్లో బ్యాలెట్ పేపర్‌ను వేయాలని చెప్పారు. వికలాంగ ఓటర్లు తమ వెంట సహాయకులను తీసుకెళ్లే వీలుంది. ఇక అంధ ఓటర్లు అయితే పోలింగ్ సిబ్బంది సహాయంతో ఓటేసే అవకాశముంది.

ప్రాజెక్టులపై రెండు లక్షల కోట్ల ఖర్చా?


దానిపై అసెంబ్లీలో చర్చ చేపట్టాలి: సీఎల్పీ నేత భట్టి

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.2 లక్షల 25 వేల కోట్లు ఖర్చు పెట్టడంపై ప్రభుత్వం అసెంబ్లీలో చర్చ చేపట్టాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పేరు మీద అసలు ఇంత ఖర్చు చేశారా? ఇంత ఖర్చు చేస్తే ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ఆయన ప్రశ్నించారు. పారే నీళ్లలో ఖర్చు కనిపించాలని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సెకండ్ ఒపీనియన్ తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టులను తానే డిజైన్ చేస్తున్నానని సీఎం అంటున్నారని, టెక్నికల్ అంశాల గురించి కేసీఆర్‌కు ఏమైనా తెలుసా అని ప్రశ్నించారు. ప్రాజెక్టుల వ్యయంపై ఎక్స్‌పర్ట్ కమిటీ వేయాలని, లేదంటే టెక్నికల్ టీంతో ప్రాజెక్టుల బాట పడతామని భట్టి ప్రకటించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా భట్టి పేరును ఆదివారం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శాసనసభ నిరవధికంగా వాయిదా పడిన తర్వాత సీఎల్పీ కార్యాలయంలో ప్రతిపక్ష నేత హోదాలో భట్టి మీడియాతో చిట్‌చాట్ చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనైనా ఎక్కువ రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భట్టి కోరారు.

కేంద్రం నిధులు ఇవ్వలేదనడం సరికాదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్

హైదరాబాద్, వెలుగు: శాసనసభలో సీఎం కేసీఆర్ మాట్లాడిన తీరు బాగాలేదని, ప్రజలను తప్పుదారి పట్టించేలా కేంద్రంపై నిందలు వేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చినా ఖర్చు పెట్టలేనటువంటి స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయుష్మాన్ భవ పథకాన్ని రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. అనేక కార్యక్రమాలకు కేంద్రం నిధులిచ్చినా వాటిని ఖర్చుచేయకపోవడంతో వెనక్కి తీసుకున్న విషయం మీడియాలో వచ్చిందని, అయినా కేసీఆర్ స్పందించలేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అడగకపోయినా బీజేపీ నాయకత్వం కేంద్ర ఆరోగ్యశాఖను, ప్రధానమంత్రిని కోరడం ద్వారానే భువనగిరిలో ఎయిమ్స్ ఏర్పాటు చేశారన్నారు. దానికి రూ.1000 కోట్లకు పైగా కేంద్ర కేబినెట్ ఆమోదించిందన్నారు. రాష్ట్రానికి గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు.






మండలికి సీఎం వస్తే బాగుండు: పొంగులేటి

హైదరాబాద్, వెలుగు: గవర్నర్ ప్రసంగంపై చర్చలో తాము లేవనెత్తిన పలు అంశాలకు సమాధానం ఇవ్వకుండా ప్రభుత్వం దాటవేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. శాసనమండలిలో జరిగిన చర్చలో సీఎం కేసీఆర్ పాల్గొని ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం మండలి మీడియా పాయింట్ వద్ద పొంగులేటి మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. 18 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఆ ప్రాంత రైతులను ఆదుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానానికి సంబంధించి నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ అంశంపై అఖిలపక్ష భేటీ ఏర్పాటుచేసి రాష్ట్రానికి అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. రాష్టంలో మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాలపై నిఘా పెట్టాలని పోలీసుశాఖను ఆదేశించాలని సూచించారు.

కాశ్మీర్ అసెంబ్లీకి ఒంటరి పోరు: రాం మాధవ్

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని బీజేపీ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ చెప్పారు. రాష్ట్రంలోని మొత్తం 111 సీట్లకు తాము పోటీ చేస్తామని ఆదివారం మీడియాతో ఆయన చెప్పారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో అతి పెద్ద పార్టీగా బీజేపీ అవతరించడం ఖాయమన్నారు. మేజిక్ నెంబర్ రాకపోతే కొన్ని పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. లోక్ సభ, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరుపుతారా లేక విడివిడిగా నిర్వహిస్తారా అనే అంశం పై ఈసీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.



ముంబైకర్ల పరుగు పందెం

బాంద్రా–వర్లీ సీ లింక్ బ్రిడ్జిపై పరుగులు పెడుతున్న ముంబైకర్లు. టాటా ముంబై మారథాన్ 2019లో భాగంగా 46 వేల మంది రన్నర్లు ఇదిగో ఇలా పరుగులు తీశారు. ఈ మారథాన్‌లో ఇంతమంది పాల్గొనడం ఇదే మొదటిసారి. ఛత్రపతి శివాజీ టెర్మినస్(సీఎస్‌టీ) నుంచి ప్రారంభమైన ఈ మారథాన్‌లో టోటల్ ప్రైజ్ మనీ 4,05,000 అమెరికన్ డాలర్లు. ఆదివారం నాడు జరిగిందీ పరుగుపందెం.

శాంతి దూతలు మీరే

సహనానికి యువత ప్రతీకలుగా ఉండాలి ■ యువజన నాయకత్వ సదస్సులో గవర్నర్ నరసింహన్



గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ కవిత

- మానవ మేధకు టెక్నాలజీ ప్రత్యామ్నాయం కాదు
- మహిళను సౌకర్యవంతంగా ఉంచడమే సాధికారత: గవర్నర్
- హైదరాబాద్‌లో ముగిసిన రెండ్రోజుల సదస్సు

హైదరాబాద్, వెలుగు: "ఈ తరం యువతలో ఓపిక, సహనం తగ్గిపోయి అసహనం పెరుగుతోంది. అసహనంతో ఏమీ సాధించలేరు. శాంతికి, సహనానికి యువత ప్రతీకలుగా ఉండాలి. ప్రపంచ శాంతి దూతలుగా పని చేయాలి" అని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కొనసాగిన 'అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు' ముగింపు కార్యక్రమం ఆదివారం హెచ్ఐసీసీలో జరిగింది. ముఖ్య అతిథిగా గవర్నర్ హాజరై మాట్లాడారు. టెక్నాలజీ ఎన్నటికీ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని, సమాజాన్ని మెరుగైనదిగా మార్చేందుకు, చైతన్యపరిచేందుకే సాంకేతికతను వాడాలని సూచించారు. మనుషుల మధ్య సంబంధాలు 'మానవ స్పర్శ'తోనే పదిలంగా ఉంటాయన్నారు.

వసుధైక కుటుంబం

సదస్సుకు హాజరైన 150 దేశాల ప్రతినిధుల్ని చూస్తుంటే వసుధైక కుటుంబం అంటే ఇదే అనిపిస్తోందని గవర్నర్ అన్నారు. ఇలాంటి వ్యత్యాసాల్లేని వసుధైక కుటుంబాన్నే మహాత్మా గాంధీ కలలుగన్నారని తెలిపారు. నాణ్యమైన విద్య, అందుబాటు ధరల్లో వైద్య సేవలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడుతాయన్నారు. మైనింగ్, అడవుల నరికివేత సుస్థిర అభివృద్ధికి విఘాతాలని, చెట్లను జంతువులను దైవాలుగా భావించే వారసత్వ సంస్కృతి నుంచి దూరంగా జరగడం వల్లే ప్రకృతి ప్రమాదంలో పడిందన్నారు. మహిళల్ని సౌకర్యవంతంగా, నచ్చినట్లుగా ఉంచడమే మహిళా సాధికారత అని అన్నారు.

ఫిజికల్ లిటరసీ కావాలి: గోపీచంద్

ప్రభుత్వాలు క్రీడలకు కేటాయించే నిధుల్ని పెంచాలని, పౌరులకు ఫిజికల్ లిటరసీలో శిక్షణ ఇప్పించాలని పుల్లెల గోపీచంద్ అభిప్రాయపడ్డారు. వ్యక్తికి, ప్రాంతానికి, దేశానికే పేరు తెచ్చే శక్తి ఆటలకు ఉందన్నారు. ఆరోగ్యం, కెరియర్, ప్రఖ్యాతులు ఇలా ఏవి కావాలన్నా ఆటలను అనుసరించవచ్చని సూచించారు.

సున్నితం కాదు: బబిత

తల్లిదండ్రులు ఆడపిల్లల్ని పెంచే తీరే వాళ్లను విజేతల్ని చేస్తుందని కామన్వెల్త్ గోల్డ్ మెడల్ విన్నర్ బబితా కుమారి ఫోగట్ అన్నారు. కరణం మల్లీశ్వరి ఒలింపిక్ పతకం సాధించినప్పుడు ఎంతో స్ఫూర్తిని పొందినట్లు చెప్పారు. తండ్రే (మహావీర్ సింగ్ ఫోగట్) తమ రోల్ మోడల్ అన్నారు. ఏ రంగంలో రాణించాలన్నా క్రమశిక్షణ ఎంతో అవసరమని, ఎందరు వ్యతిరేకించినా సంకల్పం, ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధించవచ్చని చెప్పారు. నిజంగానే అబ్బాయిలతో కలిసి కుస్తీ ప్రాక్టీస్ చేశారా అని ఓ విదేశీ ప్రతినిధి ప్రశ్నించగా అవునన్నారు. చిన్నప్పట్నుంచి తమ తండ్రి అబ్బాయిలతో పోటీ పడటాన్ని అలవాటు చేయడంతో తమ నైపుణ్యం, సామర్థ్యం పెరిగిందన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లల్ని సున్నితంగా పెంచడం మానుకోవాలన్నారు.

ఆటలు జీవితాన్నిస్తాయి: మలావత్ పూర్ణ

"ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆటలు భాగం కావాలి. అవి ఆరోగ్యంతో పాటు జీవితాన్నిస్తాయి. నా విషయంలో అదే జరిగింది" అని పర్వతారోహకురాలు మలావత్ పూర్ణ అన్నారు. సరదాగా నేర్చుకున్న రాక్ క్లైంబింగ్ తన జీవితాన్నే మార్చేసిందన్నారు. సివిల్ సర్వీసెస్లో విజయం సాధించడాన్ని తాను లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

యువతదే బాధ్యత: ఎంపీ కవిత

"2015లోపు సుస్థిర అభివృద్ధి సాధించాలన్న లక్ష్యాన్ని ప్రపంచ దేశాలు సాధించలేకపోయాయి. కనీసం 2030 నాటికైనా సాధించాలి. ఆ లక్ష్యాన్ని సాధించే బాధ్యత యువతదే" అని జాగృతి వ్యవస్థాపకురాలు, ఎంపీ కవిత అన్నారు. ప్రపంచంలోని యువతను సమైక్యపరిచే వేదికగా 'గ్లోబల్ నెట్వర్క్ ఆఫ్ యూత్'ను ముందుకు తీసుకెళ్తామన్నారు. సదస్సుకు వచ్చే మొత్తం ప్రతినిధుల్లో 50 % మంది యువతులు ఉండేలా చూశామన్నారు. తెలంగాణ జాగృతి ద్వారా ఇప్పటిదాకా 19 వేల మందికి శిక్షణ ఇచ్చి, 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. 'వాటర్ మాన్'గా ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత రాజేంద్ర కుమార్ సింగ్కు లైఫ్టైమ్ అచీవ్మెంట్ అవార్డును, తెలంగాణ జాగృతి యూత్ అచీవర్ అవార్డును మలావత్ పూర్ణ, బబితా ఫోగట్‌లకు గవర్నర్ అందజేశారు.

వైఎస్సార్ కాంగ్రెస్‌కు వంగవీటి రాధా గుడ్ బై

టీడీపీలో చేరే అవకాశం

విజయవాడ, వెలుగు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి విజయవాడ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ఆదివారం రాజీనామా చేశారు. విజయవాడ సెంట్రల్ సీటుపై హామీ రాకపోవడంతో ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. రాధాను బుజ్జగించేందుకు బొత్స సత్యనారాయణ చేసిన ప్రయత్నం ఫలించలేదు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రాధా రాజీనామా లేఖ పంపారు. "సీఎం కావాలన్న మీ కోరిక నెరవేరాలంటే మీరు పార్టీలో అందరిపై ఆంక్షలు విధించడంలో తప్పుని సరి కావచ్చు. అయితే ప్రజల ఆకాంక్షలు అనుగుణంగా ఆంక్షలు లేని ప్రజా జీవితం నాకు తప్పనిసరి. అందుకే రాజీనామా చేస్తున్నా" అని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. వంగవీటి రాధాకృష్ణ తమ పార్టీలో చేరితే స్వాగతిస్తామని టీడీపీ విజయవాడ అర్బన్ అధ్యక్షుడు బుద్దా వెంకన్న అన్నారు.

కాళ్లు పట్టించుకున్నాడు..

సస్పెండయ్యాడు

లక్నో: ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటే తన కాళ్లు పట్టుకోవాల ని ఆదేశించిన ఖాకీ చివరకు తన ఉద్యోగాన్నే ఊడగొట్టుకున్నాడు. కేసు నమోదు చేయాలని ఒక వృద్ధురాలు ఇన్స్పెక్టర్ కాళ్లు పట్టుకునే వీడియో నెట్టింట వైరల్‌కావటంతో ఉన్నతాధికారులు ఆ ఖాకీని ఉద్యోగంలో నుంచి తీసేశారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని గుడాంబా పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే. బ్రహ్మదేవి అనే 75 ఏళ్ల వృద్ధురాలు కేసు పెట్టేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. ప్లేవుడ్‌ఫ్యాక్టరీలో పనిచేస్తున్న తన 20 ఏళ్ల మనవడు మెషిన్‌కిందపడి చనిపోయాడని, తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. ఫ్యాక్టరీ యజమానిపై కేసు పెట్టాలని పోలీసులను వేడుకుంది. అయితే ఇన్స్పెక్టర్ తేజ్ ప్రతాప్‌సింగ్ మాత్రం ఆమెను పట్టించుకోలేదు. అంతే కాకుండా ఆమెకు సమాధానం చెప్పకుండా దర్జాగా కుర్చీలో కాలు మీద కాలు వేసుకుని కూర్చున్నాడు. చివరకు ఆమె ఏడుస్తూ కాళ్లపై పడటంతో కనికరించాడు. అయితే ఈ ఘటన మొత్తం ఎవరో వీడియో తీసి సోషల్‌మీడియాలో పెట్టడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు సింగ్‌పై కేసు నమోదు చేసి అతడిని సస్పెండ్‌చేశారు. అంతే కాకుండా ఫ్యాక్టరీ యజమానిపై కూడా కేసు నమోదు చేశారు. మరో విషయం ఏమిటంటే ఇటీవల హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా లక్నోలోనే బెస్ట్‌పోలీస్‌స్టేషన్ లలో గుబుంబా పోలీస్‌స్టేషన్ ఒకటని అవార్డు అందుకోవటం గమనార్హం.



గిన్నిస్ జల్లికట్టు

- 1,354 ఎద్దులతో యువకుల కుస్తీ
- ఇద్దరు మృతి.. 31 మందికి గాయాలు

పుదుకొట్టై (తమిళనాడు): తమిళుల సంప్రదాయ క్రీడ జల్లికట్టు ఆదివారం గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించింది. ఎరీనాలోకి అత్యధికంగా ఎద్దులను పంపిన రికార్డును సొంతం చేసుకుంది. పుదుకొట్టై జిల్లా విరాలీమలైలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని హెల్త్‌మినిస్టర్ విజయభాస్కర్ ప్రారంభించారు. వంద రెండొందలు కాదు ఏకంగా 1354 ఎద్దులను ఎరీనాలోకి తోలి వందలాది యువకులు వాటితో కుస్తీకి దిగారు. గతంలో 647 ఎద్దులతో నమోదైన రికార్డుకు ఇప్పుడు రెట్టింపు సంఖ్యలో పాల్గొనడం విశేషం. అయితే, ఈ రికార్డు మాటున తీవ్ర విషాదం కూడా చోటుచేసుకుంది. ఈ పోటీలో పాల్గొన్న వారిలో ఇద్దరు ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయారు. ఎద్దులను కట్టడిచేసే క్రమంలో 31 మందికి గాయాలయ్యాయి. ఇక 21 ఎద్దులను పట్టుకుని తిరుచ్చికి చెందిన మురుగానందం మొదటిస్థానంలో, పదహారు ఎద్దులను పట్టుకుని కాట్టురుకు చెందిన కార్తీ రెండో స్థానంలో నిలిచారు.

శబరిమల ఆలయం మూసివేత

శబరిమల: ఈ ఏడాది పడిపూజలు ముగియడంతో ఆదివారం శబరిమల అయ్యప్ప ఆలయం మూసివేశారు. పందళమ్ రాజ కుటుంబ సభ్యుడు రాఘవ వర్మ రాజా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత పూజారులు సాయంత్రం 6.15గంటలకు ఆలయ ద్వారాలు మూసివేశారు. నెలవారీ పూజల్లో భాగంగా ఫిబ్రవరి 13న ఆలయాన్ని తెరవనున్నారు. ఈ ఏడాది శబరిమల ఆలయ చరిత్రలోనే మహిళల ఆలయ ప్రవేశం వివాదాస్పదమైన ఘట్టంగా నిలిచింది. కేరళ సీఎం పినరయ్ విజయన్ మాట్లాడుతూ శబరిమలలో ఆందోళనలు చేసిన వారి ప్రయత్నాలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. శబరిమలలో నిషేధ ఉత్తర్వులు ఎత్తివేయాలంటూ 49రోజులుగా సెక్రెటేరియట్ ఎదుట చేస్తున్న నిరాహార దీక్షను బీజేపీ కార్యకర్తలు నేటితో ముగించారు. భక్తుల విశ్వాసాల్ని కాపాడేందుకే తాము ఆందోళనలు నిర్వహించామని బీజేపీ చీఫ్ పీఎస్ శ్రీధరన్ పిళ్లై అన్నారు.

ఆధార్ ఉంటే.. నేపాల్, భూటాన్ వెళ్లిరావొచ్చు

న్యూ ఢిల్లీ: నేపాల్, భూటాన్ దేశాల్లో పర్యటించేందుకు 65ఏళ్లకు పైబడిన వారు, 15ఏళ్ల లోపు పిల్లలకు ఆధార్ కార్డును ట్రావెల్ డాక్యుమెంట్‌గా చూపించవచ్చని హోం శాఖ ప్రకటించింది. ఇప్పటికే ఈ దేశాలకు వీసా లేకుండానే పాస్‌పోర్టు, ఫోటో ఐడీ కార్డు లేదా ఓటర్ ఐడీతో వెళ్లిరావొచ్చు. ఇకపై 65ఏళ్లకు పైబడిన, 15ఏళ్ల లోపున్న ఇండియన్ సిటిజన్లు కేవలం ఆధార్ కార్డు చూపించైనా ఈ రెండు దేశాలకు వెళ్లిరావొచ్చని తెలిపింది. ఇప్పటివరకు ఈ వయసుల వాళ్లు గుర్తింపు కార్డుగా పాన్ కార్డ్, ఓటర్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, హెల్త్ కార్డ్, రేషన్ కార్డ్ చూపించేవారు. తాజాగా ఆధార్ కార్డును కూడా ఈ జాబితాలో చేర్చారు. అయితే 15 దాటి 65 ఏళ్ల లోపు ఉన్న వాళ్లు మాత్రం ఆధార్ కార్డు చూపించి వెళ్లొచ్చే అవకాశం లేదు. 15నుంచి 18ఏళ్ల లోపు విద్యార్థులు కాలేజీ ఇచ్చే సర్టిఫికేట్‌తో వెళ్లిరావచ్చు.

రోడ్డు ప్రమాదంలో మెడికో మృతి



స్రవంతి మృతదేహం

నల్లగొండ, వెలుగు: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెడికల్ విద్యార్థిని చనిపోయింది. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని కామినేని మెడికల్ కాలేజీలో చదువుకుంటున్న రమ్య, నాగజ్యోతి, స్రవంతి కాలేజీ హాస్టల్‌లోనే ఉంటున్నారు. ఆదివారం ఉదయం టిఫిన్ చేసేందుకు స్కూటీపై ఏపీలింగోటం వద్దకు వెళ్లారు. అక్కడ టిఫిన్ చేసి వస్తుండగా, వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇచ్చి, తీవ్ర గాయాలపాలైన ముగ్గురిని కామినేని హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ స్రవంతి అనే విద్యార్థిని మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈమెది ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ గ్రామం. గాయాలైన రమ్య, నాగజ్యోతి హైదరాబాద్‌కు చెందిన వారు. వీరిద్దరిని మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు కామినేని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్‌పల్లి ఎస్ఐ బాజ్యా నాయక్ చెప్పారు. స్రవంతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

23 నుంచి పీజీటీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

హైదరాబాద్, వెలుగు: రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీటీ (సోషల్ స్టడీస్) పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 23 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్టు చైర్మన్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అర్హుల జాబితా బోర్డు వెబ్‌సైట్‌లో ఉంచామని, అభ్యర్థులకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇచ్చామని చెప్పారు.

ఎమ్మెల్యేల పల్లె బాట

అసెంబ్లీ ముగియడంతో 'పంచాయతీ'కి

హైదరాబాద్, వెలుగు : అసెంబ్లీ ముగియడంతో ఎమ్మెల్యేలంతా నియోజకవర్గాలకు తరలివెళ్లారు. అసెంబ్లీ వాయిదా అనంతరం పలువురు ఎమ్మెల్యేలు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. 'ఇప్పటికే ఆలస్యమైంది. తొలిదశ పోలింగ్ సరళి చూసుకోవాలి. రెండు దశల్లో సాధ్యమైనన్ని పంచాయతీలను ఏకగ్రీవం చేశాం. మంగళవారంతో మూడో దశ ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. అందులోనూ ఏకగ్రీవాలు ఎక్కువ ఉండేలా చూసుకోవాలి.' అన్నారు. ఇక పంచాయతీ ఎన్నికలు ముగిసేవరకు నియోజకవర్గాల్లోనే ఉంటామని కొందరు ఎమ్మెల్యేలు చెప్పారు. వీలైనన్ని ఎక్కువ పంచాయతీలను టీఆర్ఎస్ మద్దతుదారులు గెలుచుకునేలా చూడాలని పంచాయతీ ఎన్నికల షెడ్యూలుకు ముందే సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్యేలకు గట్టిన చెప్పిన విషయం తెలిసిందే.

కారు, బైకు వద్దు గురూ..

సైకిల్ రైడే సో బెటరూ..



- సైక్లింగ్‌తో ఆరోగ్యానికి ఆరోగ్యం.. డబ్బుకు డబ్బు ఆదా
- 8 కిలోమీటర్ల కంటే తక్కువ దూరానికి సైకిల్ బెస్ట్
- అందరూ సైక్లింగ్ చేస్తే ఏటా రూ.1.8 లక్షల కోట్లు సేవ్
- టెరీ సంస్థ తాజా రిపోర్ట్‌లో వెల్లడి

న్యూఢిల్లీ: సెకిల్ తొక్కడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది అందరికీ తెలిసిన విషయమే. కానీ దేశం మొత్తం సైక్లింగ్ చేసినట్లయితే ఆరోగ్యానికి ఆరోగ్యం.. డబ్బుకు డబ్బు లాభమేనట. ఆఫీసుకు దగ్గరగా ఉండేవారు సైకిల్ తొక్కుతూ జాబ్‌కు వెళితే దేశానికి ఏటా ఆదా అయ్యే మొత్తం ఎంతో తెలుసా? అక్షరాలా లక్షా 81 వేల కోట్ల రూపాయలు. ఇది మన జీడీపీ (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్షన్)లో 1.6 శాతం. 8 కిలోమీటర్లలోపు ఉద్యోగానికి సంబంధించిన పనులకు భారతీయుల్లోని సగం మంది కార్లు, మోటార్ బైకులు వదిలేసి సైకిల్ వాడినట్లయితే ఎన్నో ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని ఢిల్లీకి చెందిన ద ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ (టెరీ) అనే సంస్థ ఇటీవల విడుదల చేసిన తన రిపోర్ట్‌లో వెల్లడించింది. ప్రస్తుతం అతి తక్కువ దూరం పనులపై వెళ్లడానికి దేశవ్యాప్తంగా జనం నడకనే ఎక్కువగా ప్రిఫర్ చేస్తున్నారని ఈ రిపోర్ట్ పేర్కొంది. గ్రామాల్లో అయితే సైకిళ్లు, నగరాల్లో అయితే బైకులు వాడుతున్నారని తెలిపింది.

ఫస్ట్ లాభం.. ఆరోగ్యమే

పెట్రోల్, డీజిల్ వాహనాలను వదిలేసి సైకిళ్లకు మారడం వల్ల కలిగే అతి పెద్ద ప్రయోజనం వ్యక్తిగత ఆరోగ్యమేనట. "సైకిల్ తొక్కడం వల్ల ఫిజికల్ యాక్టివిటీ పెరగడంతోపాటు ఎయిర్ పొల్యూషన్ తగ్గిపోతుంది. వాహనాల మెయింటెనెన్స్‌కు అయ్యే వ్యయం, డీజిల్, పెట్రోల్ ఖర్చు సేవ్ అవుతుంది" అని టెరీ రిసెర్చ్ అసోసియేట్, ఈ రిపోర్ట్‌కు నేతృత్వం వహించిన ఆకాంక్షా జైన్ పేర్కొన్నారు. తక్కువ దూరం ప్రయాణానికి బైకులు, కార్ల కంటే సైకిల్‌ను ఎంచుకోవడం వల్ల వచ్చే 15 ఏళ్లలో 4,756 అకాల మరణాలకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపింది.

సైకిల్ సవారీ సాధ్యమేనా..

సైక్లింగ్‌కు పాపులారిటీ పెంచడం ఇప్పుడు పెద్ద చాలెంజే. వేసవి, వర్షాకాలాల్లో మన వాతావరణం సైక్లింగ్‌కు ఇబ్బందే. ఎందుకంటే వేసవిలో ఎండలు మండిపోతూ ఉంటాయి. ఇక వర్షాకాలంలో వర్షాలు పడి రోడ్లు పాడవుతాయి. వర్షంలో ప్రయాణించడం కూడా కష్టమే. ఈ నివేదిక ప్రకారం 8 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించడానికి సుమారు 40 నిమిషాల సమయం పడుతుంది. పొల్యూషన్ ట్యాక్స్, కంజెస్టన్ ట్యాక్స్, పార్కింగ్ చార్జీలను పెంచడం ద్వారా కార్లు, బైకుల నుంచి సైకిళ్ల వైపు మారేలా చేయాలి. అయితే సైక్లింగ్ కోసం ప్రత్యేక సైక్లింగ్ ట్రాక్‌ల వంటి వసతులు కల్పించాలని జైన్ చెపుతున్నారు. అలాగే పెద్ద నగరాల్లో ఏదో ఒక ప్రాంతానికి పరిమితం చేయకుండా నగరవ్యాప్తంగా బైక్ షేరింగ్ స్కీములను ప్రవేశపెట్టాలని ఈ రిపోర్ట్ సూచించింది.

ఎస్పీ ర్యాంక్ అధికారికి జీవితఖైదు

ముంబై: 2009లో జరిగిన జిల్లా పరిషత్ మెంబర్ కిడ్నాప్ కేసులో ఎస్పీ ర్యాంక్ పోలీస్ ఆఫీసర్‌తో పాటు మరొకరికి మహారాష్ట్ర కోర్టు జీవితఖైదు విధించింది. ముంబైలో హోంగార్డ్ డిపార్ట్ మెంట్‌లో సీనియర్ అడ్మినిస్టేటర్ ర్యాంక్ ఆఫీసర్ మనోజ్ లోహార్, అతని బంధువు ధీరజ్‌లకు ఈ మేరకు జల్గాం సెషన్స్ జడ్జి పీవై లాడేకర్ శనివారం శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో ఇద్దరికీ చెరో రూ.5వేల జరిమానా విధించారు. లోహార్ 2009లో చహల్గాం జిల్లాకు అడిషనల్ ఎస్పీ హోదాలో ఉన్నారు. అక్కడి జిల్లా కార్యనిర్వహణ అధికారి అయిన ఉత్తమ్ మహాజన్‌ను పిలిపించుకున్న లోహార్ అతని అక్రమాలు బయటపెడతానని బెదిరించి రూ.25లక్షలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మహాజన్‌ను ధీరజ్ ఇంట్లో నిర్బంధించారు. దీనిపై మహాజన్ కుమారుడు జిల్లా ఎస్పీని ఆశ్రయించడంతో కిడ్నాప్‌ను రెండ్రోజుల్లో ఛేదించి కేసును సీఐడీకి అప్పగించారు. 2012లో లోహార్‌ను అరెస్టుచేశారు.



తిరుమలకు పోటెత్తిన భక్తులు

తిరుమల, వెలుగు: తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం భారీగా తరలివచ్చారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్ లోని అన్ని కంపార్టుమెంట్లు నిండి బయట మూడు కిలోమీటర్ల మేర భక్తులు బారులు తీరారు. సర్వదర్శనానికి 20 గంటలు పట్టింది. క్యూలైన్లోనే దాదాపు 10 గంటలపాటు భక్తులు వేచి ఉన్నారు. టైమ్ స్లాట్, ప్రత్యేక ప్రవేశ దర్శనాలకు 7 గంటలకు పైగా సమయం పట్టింది. రద్దీకి తగ్గట్టుగా అధికారులు సరైన సదుపాయాలు కల్పించలేదని భక్తులు వాపోయారు. క్యూలైన్లలో తోపులాటలు జరిగాయని, చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందిపడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అద్దె గదులు లభించలేక అవస్థలు పడ్డారు. రాబోయే మూడురోజులపాటు తిరుమలలో రద్దీ కొనసాగవచ్చని టీటీడీ అధికారులు అంచనా వేశారు.

రేపు వృద్ధులు, దివ్యాంగులకు శ్రీవారి దర్శనం

మంగళవారం 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు టీటీడీ 4 వేల టోకెన్లు జారీ చేయనుంది. ఉదయం 10 గంటల స్లాట్ కు వెయ్యి, మధ్యాహ్నం 2 గంటల స్లాట్ కు 2 వేలు, 3 గంటల స్లాట్ కు వెయ్యి టోకెన్లు ఇవ్వనున్నారు. ఐదేళ్లలోపు చంటిపిల్లలున్న తల్లిదండ్రులకు 23న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నవరకు సుపథ మార్గం ద్వారా దర్శనానికి అనుమతిస్తాని టీటీడీ ప్రకటించింది.

సోమవారం | హైదరాబాద్
21.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu

రిసార్టులో కొట్టుకున్న ఎమ్మెల్యేలు

బెంగళూరు:

కర్ణాటక రాజకీయాల్లో ఇది కొత్త ట్విస్ట్. బెంగళూరు శివార్లలోని ఈగల్టన్ రిసార్ట్స్ లో ఉన్న ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొట్టుకున్నట్లు వార్తలందాయి. ఘర్షణ జరగలేదని కన్నడ కాంగ్రెస్ వర్గాలు బుకాయించినా, ఘర్షణ జరిగిన మాట వాస్తవమేనని మన రాష్ట్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, నిజామాబాద్ మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ నిర్ధారించారు.

అసలేం జరిగింది..?

రిసార్ట్స్ లో ఎమ్మెల్యే ఆనంద్ సింగ్ తలపై మరో ఎమ్మెల్యే జేఎన్ గణేశ్ బాటిల్ తో కొట్టినట్లు తెలిసింది. దీంతో ఆనంద్ సింగ్ ను ట్రీట్మెంట్ కోసం అపోలో ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. అయితే ఈ వార్తలను కాంగ్రెస్ లీడర్లు కొట్టివేశారు. ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ జరగడం అనేది పూర్తిగా అబద్ధమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డీకే శివకుమార్ చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ ఐకమత్యంలో ఉన్నారని ఆయన చెప్పారు. కాగా ఆనంద్ సింగ్ ను పరామర్శించడానికి ఆదివారం ఉదయం చాలా మంది కాంగ్రెస్ నేతలు ఆస్పత్రికి వెళ్లారు. '' రిసార్ట్స్ లో ఏం జరిగిందో నాకు తెలీదు. ఆనంద్ సింగ్ ఆస్పత్రిలో చేరారు. ఆయన శరీరంపై ఎలాంటి గాయాలు లేవు.'' అని మంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేష్ అన్నారు. కాగా రిసార్ట్స్ లో ఘర్షణ జరగలేదని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఆనంద్ సింగ్ కు ఛాతీ నొప్పి రావడంతోనే ఆయన ఆస్పత్రిలో చేరినట్లు కాంగ్రెస్ లీడర్లు చెప్పారు.

అపోలో యాజమాన్యం స్పష్టత ఇవ్వాలి



ఆస్పత్రిలో చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆనంద్ సింగ్

- కర్ణాటక రాజకీయాల్లో కొత్త ట్విస్ట్
- ఛాతీ నొప్పితోనే ఆస్పత్రిలో చేరారన్న కాంగ్రెస్
- ఘర్షణను నిర్ధారించిన మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్

ఎమ్మెల్యే ఆనంద్ సింగ్ కు సంబంధించి అన్నదమ్ములైన శివకుమార్, సురేష్ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని బీజేపీ మండిపడింది. ఆనంద్ కు ఇస్తున్న ట్రీట్మెంట్ కు సంబంధించి అపోలో ఆస్పత్రి ఒక ప్రకటన విడుదల చేయాలని బీజేపీ ఎమ్మెల్యే ఆర్. అశోక్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో పోలీసులు జోక్యం చేసుకోవాలన్నారు. రిసార్ట్స్ లో ఘర్షణ జరిగినట్లు రుజువైతే పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎమ్మెల్యేలు గొడవ పడ్డ ఈగిల్ రిసార్ట్స్ ఇదే

ఏం జరిగిందో నాకు తెలీదు: డిప్యూటీ సీఎం

రిసార్ట్స్ లో ఏం జరిగిందో తెలియదని డిప్యూటీ సీఎం పరమేశ్వర చెప్పారు. 'ఆరోగ్యం బాగాలేక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆస్పత్రిలో చేరారనే తనకు తెలుసు' అన్నారు.

ఘర్షణ నిజమే: మధు యాష్కీ

రిసార్ట్స్ లో ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ జరిగిన విషయం వాస్తవమేనని మధుయాష్కీ గౌడ్ నిర్ధారించారు. అయితే ఈ సంఘటనకు రాజకీయాలతో సంబంధం లేదన్నారు. ఆనంద్ సింగ్, జేఎన్ గణేశ్ ఇద్దరూ బళ్లారి జిల్లావారేనన్నారు. కొంతకాలంగా ఇద్దరూ కలిసి వ్యాపారాలు చేస్తున్నారని చెప్పారు. బిజినెస్ లో తేడాలు వచ్చిన ఫలితంగా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిందని మధు యాష్కీ చెప్పారు. శనివారం రాత్రి డిన్నర్ చేసిన తర్వాత మధ్య ఘర్షణ జరిగినట్లు ఆయన చెప్పారు.

ఘర్షణ పై కంప్లయింట్ అందలేదు: పోలీసులు

ఈగల్టన్ రిసార్ట్స్ లో ఘర్షణ జరిగినట్లు తమకు ఎవరి దగ్గర నుంచి కంప్లయింట్ అందలేదని పోలీసులు చెప్పారు. కాగా అపోలో ఆస్పత్రి దగ్గర పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. బయటివారు ఎవరినీ ఆస్పత్రి లోపలకు అనుమతించడం లేదు.

కాంగ్రెస్ లో గొడవలు ముదిరాయి: బీజేపీ

ఎమ్మెల్యేలు కొట్టుకున్నట్లు వచ్చిన వార్తలపై బీజేపీ స్పందించింది. '' కాంగ్రెస్ పార్టీలో పరిస్థితులు దిగజారిపోయాయి. ఎమ్మెల్యే ఆనంద్ సింగ్ ఆస్పత్రిలో చేరడమే ఇందుకు రుజువు. వేరు రుజువులు అక్కర్లేదు.'' అని బీజేపీ తమ అధికారిక ట్విట్టర్ ఖాతాలో కామెంట్ చేసింది.

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఘర్షణలో గాయపడ్డా ఆ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు బయటకు చెప్పుకోలేక అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడింది. కర్ణాటక తాజా పరిణామాలతో ఎలాంటి సంబంధం లేదని బీజేపీ మరోసారి పేర్కొంది. కాంగ్రెస్ లో అంతర్గత విభేదాలు ముదిరిపోవడంతోనే తాజా పరిణామాలు సంభవించాయని పేర్కొన్నారు. ఈ విషయాలను బయటపెట్టడకుండా ప్రత్యర్థులపై ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ లీడర్లు కాలం గడుపుతున్నారని బీజేపీ దుయ్యబట్టింది.

నియోజకవర్గాలకు తరలండి: యడ్యూరప్ప

రాష్ట్రంలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితితో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ సీఎం యడ్యూరప్ప చెప్పారు.

సిద్ధరామయ్యకు కారు గిఫ్ట్?

కర్ణాటక రాజకీయాల్లో కొనసాగుతున్న హై డ్రామా మరో మలుపు తిరిగింది. మాజీ సీఎం సిద్ధరామయ్యకు 2019 మోడల్ మెర్సిడస్ బెంజికారు ను కాంగ్రెస్ కు చెందిన ఎమ్మెల్యే ఒకరు బహుమతిగా ఇచ్చినట్లు బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది. క్విడ్ ప్రోకో లో భాగంగా హెబ్బళ్ ఎమ్మెల్యే బైరాటి సురేశ్ ఈ కారును సిద్ధరామయ్యకు కానుకగా ఇచ్చినట్లు బీజేపీ ఆరోపించింది. సురేశ్ కు ఈమధ్య ఓ కార్పొరేషన్ చైర్మన్ పదవి వచ్చింది. ఈ పదవి రావడానికి సిద్ధరామయ్యే కారణమనీ, దీనికి ప్రతిఫలంగా కారును బహుమతిగా ఇచ్చారన్నది బీజేపీ ఆరోపణ. బీజేపీ ఆరోపణలను సురేశ్ తోసిపుచ్చారు. వాడుకోవడానికి ఓసారి కారు ఇవ్వాలని సిద్ధరామయ్య అడగడంతో ఇచ్చానన్నారు.




కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు షోకాజ్

శుక్రవారంనాటి కాంగ్రెస్ శాసన సభాపక్షం (సీఎల్పీ) భేటీకి డుమ్మాకొట్టిన ఎమ్మెల్యేలు రమేష్ ఝారికోలి, బి.నాగేంద్ర, ఉమేశ్ యాదవ్, మహేశ్ కుమటహళ్లికి ఆదివారం పార్టీ హైకమాండ్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎందుకు చర్యలు తీసుకోరాదో తెలియచేయాలని కోరింది. అసంతృప్త ఎమ్మెల్యేలను కేబినెట్ లో చేర్చుకునేందుకు పదవులు వదులుకోవడానికి తనతో పాటు కొందరు మంత్రులు ముందుకు వచ్చినట్లు డీకే శివకుమార్ చెప్పారు.

గుడి కడతామంటే మద్దతిస్తాం


కాంగ్రెస్ కు వీహెచ్ పీ బంపర్ ఆఫర్

లక్నో: అయోధ్యలో రామమందిర నిర్మాణం పై జరుగుతున్న జాప్యాన్ని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్ పీ) సీరియస్ గా తీసుకుంది. రాముడి గుడి కడతామని ఎన్నికల మేనిఫెస్టోలో పెడితే కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలుకుతామని స్పష్టంచేసింది. మందిర నిర్మాణంకోసం ఈనెల 31న ధర్మ సంసద్ నిర్వహించాలని హిందూ సంస్థలు నిర్ణయించుకున్న నేపథ్యంలో వీహెచ్ పీ ఉపాధ్యక్షుడు అలోక్ కుమార్ ఈ కామెంట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. 'ధర్మ సంసద్ లో గుడి అంశాన్ని ప్రస్తావిస్తాం. సాధువులు, సంతుల సలహాలు తీసుకుంటాం. ఏంచేయాలన్న దానిపై ఆ తర్వాతే ఒక నిర్ణయానికి వస్తాం' అని అన్నారు. తమ కు రాజకీయాలతో, పార్టీలతో సంబంధం లేదన్నారు. అయోధ్యలో రాముడి గుడి నిర్మించడమే ముఖ్యమన్నారు. ఇందుకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలను కలిసి, మద్దతు అడుగుతున్నట్లు అలోక్ కుమార్ చెప్పారు. 'లోక్ సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో మేనిఫెస్టోల్లో ఈ అంశాన్ని పెట్టాల్సిందిగా అన్ని పార్టీలను కోరతాం' అని కుమార్ అన్నారు. వీహెచ్ పీ ఉపాధ్యక్షుడు అలోక్ కుమార్ కామెంట్స్ నేపథ్యంలో మందిర నిర్మాణానికి తాము కట్టుబడి ఉన్నట్లు బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పత్రా చెప్పారు. కాంగ్రెస్ పార్టీయే తన వైఖరి చెప్పాలన్నారు.



అప్పుడే ఓటమికి సాకులు వెతుక్కుంటున్నారు

న్యూఢిల్లీ: రానున్న లోక్ సభ ఎన్నికల్లో 'మహాకూటమి' కి ఓటమి తప్పదని ప్రధాని నరేంద్ర మోడీ జోస్యం చెప్పారు. ఈ విషయం ప్రతిపక్షాలకు కూడా తెలుసునన్నారు. దీంతో ఇప్పటినుంచే 'మహాకూటమి' నాయకులు ఓటమికి సాకులు వెతుక్కుంటున్నారని ప్రధాని ఎగతాళి చేశారు. ఎలెక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం)పై అప్పుడే కొంతమంది దృష్టి పెట్టారన్నారు. ఈవీఎంల వల్లే ఓడిపోయినట్లు ప్రజలను నమ్మించడానికి కథనాలు రెడీ చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గోవా లోక్ సభ నియోజకవర్గానికి చెందిన బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాల పై మండిపడ్డారు. 'మహాకూటమి' ని 'అవినీతి కూటమి'గా పేర్కొన్నారు. కోల్ కతా బహిరంగ సభను ప్రస్తావిస్తూ అస్థిరతకు, అధికార దాహానికి మారుపేరుగా నిలిచే పార్టీలన్నీ ఒక చోట చేరాయన్నారు. 'వారిది ధనశక్తి, మాది జనశక్తి' అని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఒకదానితో మరొకటి పొత్తు పెట్టుకుంటే, తాము దేశంలోని కోట్లాది మంది ప్రజలతో పొత్తు పెట్టుకుంటున్నామని ప్రధాని మోడీ చెప్పారు.



- వారిది ధనశక్తి, మాది జనశక్తి
- 'మహాకూటమి' నాయకులపై ప్రధాని నరేంద్ర మోడీ విసుర్లు

గనుల సంక్షోభాన్ని పరిష్కరిస్తాం

గోవాలో నెలకొన్న గనుల సంక్షోభాన్ని త్వరలోనే పరిష్కరిస్తామనిమోడీ చెప్పారు. దీనిపై కేంద్రం కసరత్తు చేస్తోందన్నారు. గనులు మూతపడటంవల్ల ఆ ప్రభావం గోవా ఆర్థిక పరిస్థితిపై కూడా పడుతోందన్నారు. కాగా, ఆధునిక గోవా రూపశిల్పి, సీఎం మనోహర్ పారికర్ త్వరగా కోలుకోవాలన్నారు. ఆరోగ్యం బాగా లేనప్పటికీ పనిపట్ల ఆయనకున్న తపన అందరికీ స్ఫూర్తి ఇస్తుందన్నారు.



కోలుకున్న అమిత్ షా

ఎయిమ్స్ నుంచి డిశ్చార్జ్

న్యూఢిల్లీ: స్వైన్ ఫ్లూతో బాధపడుతూ ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ లో చేరిన బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కోలుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యారని ఎయిమ్స్ వర్గాలు చెప్పాయి. ప్రస్తుతం ఆయన పూర్తి ఆ రోగ్యంతో ఉన్నారని డాక్టర్లు చెప్పారు. స్వైన్ ఫ్లూ తొలి దశలో ఉన్నప్పుడే హాస్పిటల్ లో చేరడం వల్ల వ్యాధిని కంట్రోల్ చేయగలిగామని డాక్టర్లు చెప్పారు. '' దేవుడి దయ వల్ల నేను ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను. క్షేమంగా ఇంటికి చేరుకున్నాను. నేను ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్న అందరికీ ధన్యవాదాలు'' అని అమిత్ షా ట్వీట్ చేశారు.

అలా ఎందుకన్నారు?

బీజేపీ ఎమ్మెల్యే పై మహిళా కమిషన్ సీరియస్

లక్నో, న్యూఢిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) చీఫ్ మాయావతిపై బీజేపీ ఎమ్మెల్యే సాధనా సింగ్ చేసిన కామెంట్లు దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యే పై జాతీయ మహిళా కమిషన్ (ఎన్ సీ డబ్ల్యు) మండిపడింది. అలాంటి కామెంట్లు ఎందుకు చేయవలసి వచ్చిందో తెలియచేయాలని ఆమెను ప్రశ్నించినట్లు ఎన్ సీడబ్ల్యు వర్గాలు చెప్పాయి. 1995 లో లక్నోలోని ఓ గెస్ట్ హౌస్ వద్ద సమాజ్ వాది పార్టీ కార్యకర్తలు, మాయావతి మధ్య జరిగిన గొడవను ప్రస్తావిస్తూ ఆమెను 'హిజ్రా' తో పోలుస్తూ సాధనా సింగ్ కామెంట్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా సాధనా సింగ్ కామెంట్స్ పై బీఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ''లోక్ సభ ఎన్నికల కోసం ఎస్పీ, బీఎస్పీ మధ్య పొత్తు కుదరడాన్ని బీజేపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. వీళ్లను మెంటల్ ఆస్పత్రుల్లో చేర్పించాలి'' అని బీఎస్పీ సీనియర్ నేత సతీశ్ చంద్ర మిశ్రా ఆగ్రహం వ్యక్తం చేశారు.



మహిళలందరికీ అవమానం: అఖిలేశ్

సాధనా సింగ్ కామెంట్ల పై సమాజ్ వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. ''సాధన వ్యాఖ్యలు ఒక్క మాయావతినే కాదు, దేశంలోని మహిళలందరినీ అవమానపరచేలా ఉన్నాయి'' అని అన్నారు. బీజేపీ నాయకుల ఆలోచనా స్థాయికి ఈ కామెంట్లు అద్దం పడుతున్నాయన్నారు. సాధన కామెంట్లను కాంగ్రెస్ కూడా తప్పుపట్టింది. కాంగ్రెస్ ప్రతినిధి ప్రియాంక చతుర్వేది ఈ మేరకు ట్వీట్ చేశారు.

జనమే జనం

అలహాబాద్:

కుంభమేళాలో రెండో ముఖ్య ఘట్టం పుష్య పూర్ణిమ సందర్భంగా సోమవారం భక్తుల తాకిడి పెరిగింది. త్రివేణి సంగమంలో పుణ్య స్నానానికి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్ రాజ్ చేరుకుంటున్నారు. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్ లలో రద్దీ బాగా పెరిగింది. దేశం నలుమూలల నుంచి భక్తులు ఆదివారమే చేరుకున్నారు. నగరంలో జనసందోహం పెరగడంతో సెక్యూరిటీ ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేసినట్లు పోలీసులు చెప్పారు. పోలీస్ సిబ్బందితో పాటు పారామిలిటరీ బలగాలను కీలక ప్రాంతాల్లో మోహరించారు. ఈ ఏడాది కుంభమేళా ప్రశాంతంగా జరిగేటట్లు చూడడానికే తమ ప్రాధాన్యమని ఉత్తరప్రదేశ్ ఏడీజీ (లా అండ్ ఆర్డర్) ఆనంద్ కుమార్ చెప్పారు. సోమవారం నదీ స్నానానికి దాదాపు 20 లక్షల మంది హాజరవుతారని ఏడీజీ అన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. అత్యంత శాంతియుతంగా జరిగిన కుంభమేళాగా 2019 కుంభమేళా రికార్డుకెక్కేలా పనిచేస్తున్నట్లు ఆనంద్ కుమార్ చెప్పారు.





- కుంభమేళాకు పుష్య పూర్ణిమ తాకిడి
- రెండో ముఖ్య ఘట్టానికి ఏర్పాట్లు సిద్ధం
- ఆదివారం నుంచే చేరుకుంటున్న భక్తులు

పుష్య పూర్ణిమ..

హిందూ క్యాలెండర్ ప్రకారం.. పుష్య మాసంలో నిండు పున్నమికి విశిష్ట ప్రాముఖ్యత ఉంది. మాసాల్లో అత్యుత్తమమైన పుష్యమాసం తానేనని గీతలో శ్రీకృష్ణుడు కూడా చెప్పారని స్వామి అధోక్షానంద్ అన్నారు. పున్నమి రోజు త్రివేణీ సంగమంలో పుణ్య స్నానం చేయడానికి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుంటారని ఆయన చెప్పారు.

మిగతా ముఖ్య ఘట్టాలు

పుష్య పూర్ణిమ తర్వాత కుంభమేళాలో చోటుచేసుకునే ముఖ్య ఘట్టాలు.. ఫిబ్రవరి 4న మౌని అమవాస్య, ఫిబ్రవరి 10న వసంత పంచమి, ఫిబ్రవరి 19న మాఘ పూర్ణిమ, చివరగా మార్చి 4న మహాశివరాత్రి.

సెక్యూరిటీ ఏర్పాట్లిలా..

3200 హెక్టార్లలో జరుగుతున్న కుంభమేళాను తొమ్మిది జోన్లు, 20 సెక్టార్లుగా విభజించారు. 20 వేల మంది పోలీసులు, 6 వేలమంది హోం గార్డులు విధులు నిర్వహిస్తున్నారు. 40 పోలీస్ స్టేషన్లు, 58 ఔట్ పోస్టులు, 40 ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. 80 కంపెనీలకు చెందిన కేంద్ర బలగాలు, 20 కంపెనీలకు చెందిన పీఏసీ బలగాలను కుంభమేళాలో భద్రత ఏర్పాట్లలో నిమగ్నం చేశామని యూపీ డీజీపీ చెప్పారు.




మార్నింగ్ వాక్ కు వెళ్లాడు పొలాల్లో శవమై తేలాడు

మధ్యప్రదేశ్ లో బీజేపీ నాయకుడి హత్య

బర్వానీ (ఎంపీ): మార్నింగ్ వాక్ కు వెళ్లిన బీజేపీ నాయకుడు ఒకరు పొలాల్లో శవమై కనిపించిన సంఘటన ఇది. మధ్యప్రదేశ్ లోని బర్వానీ జిల్లా వర్లా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. మృతుడిని మనోజ్ ఠాక్రేగా గుర్తించారు. సంఘటన జరిగిన ప్రాంతానికి దగ్గర్లో రక్తంతో తడిసిన ఓ రాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రాయితోనే మనోజ్ ఠాక్రేను గుర్తు తెలియని దుండగులు హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. వారం కిందట మందసౌర్ మునిసిపల్ కార్పొరేషన్ చైర్మన్ ప్రహ్లాద్ భంధ్వారాను గుర్తు తెలియని వ్యక్తుల హత్య చేశారు. వారం రోజుల్లోనే ఇద్దరు బీజేపీ నాయకులు హత్యకు గురి కావడం పై ఆ పార్టీ భగ్గుమంది. కమల్ నాథ్ ప్రభుత్వంలో శాంతి భద్రతల సమస్య తలెత్తుతోందని మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ఆరోపించారు. నేరస్థులు చెలరేగిపోతున్నారని ఆయన మండిపడ్డారు.

మెట్టు దిగిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలో దాదాపు నెల రోజులుగా కొనసాగుతున్న ఆర్థిక స్తంభనను తొలగించేందుకు ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కాస్త దిగివచ్చారు. ఎన్నికల్లో తాను ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చుకోడానికి వేర్వేరు మార్గాలు వెతుకుతానని అంటూ డెమొక్రాటిక్ నేతలతో రాజీ కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. మెక్సికో గోడకు నిధుల కేటాయింపునకు అంగీకారం తెలిపితే, అక్రమ వలసదారులకు ఊరట కలిగించేందుకు సిద్ధమని ప్రకటించారు. చిన్నతనంలోనే అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించి, టెంపరరీ ప్రొటెక్టడ్ స్టేటస్ (టీపీఎస్)తో పనిచేసుకుంటున్న డ్రీమర్లకు మరో మూడేళ్లు రక్షణ కల్పిస్తామని ట్రంప్ చెప్పారు. వారిని వెనక్కి పంపించే విషయాన్ని తాత్కాలికంగా పక్కన పెడతానని అన్నారు. ప్రస్తుతం అమెరికాలో 7 లక్షల మంది డ్రీమర్లకు ప్రభుత్వం పనిచేసుకునేందుకు అనుమతిచ్చింది. పౌరసత్వం పొందేందుకు వీరికి అవకాశంలేదని పేర్కొంది. వీరితోపాటు వివిధ దేశాల నుంచి అమెరికాలోకి అక్రమ మార్గాల్లో అడుగుపెట్టిన మరో 3 లక్షల మందికి కూడా ఈ పాలసీ రక్షణ కల్పిస్తోంది. దీనిని మరో మూడేళ్లు పొడిగిస్తామని ట్రంప్ ప్రకటించారు. ప్రతిగా మెక్సికో బోర్డర్ లో గోడ నిర్మాణానికి ఆమోదం తెలపాలంటూ డెమొక్రాట్లకు ప్రతిపాదించారు. బోర్డర్ ప్రొటెక్షన్ విషయంలో మాత్రం రాజీ పడేదిలేదని ట్రంప్ తేల్చిచెప్పారు. సరిహద్దుల్లో సెక్యూరిటీ పెంచేందుకు, లా ఎన్ఫోర్స్మెంట్ ను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. దేశంలోకి డ్రగ్స్ ను చేరవేసే ముఠాలను నిలువరించేందుకు బోర్డర్ లో తనిఖీలను మరింత పటిష్టం చేయాలని ట్రంప్ చెప్పారు. ఇందుకు అవసరమైన టెక్నాలజీని సమకూర్చేందుకు 805 మిలియన్ డాలర్లను అత్యవసరంగా కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. మానవతా దృక్పథంతో స్పందించి నిధుల కేటాయింపునకు అంగీకారం తెలపాలంటూ డెమొక్రాట్లకు ట్రంప్ పిలుపునిచ్చారు.



- వాల్ కు మద్దతిస్తే.. డ్రీమర్లకు రక్షణ
- వైట్ హౌజ్ నుంచి ప్రకటన
- నమ్మలేమంటున్న డెమొక్రాట్లు

ప్రతిపాదన అమలయ్యేనా..?

ప్రెసిడెంట్ ట్రంప్ ప్రతిపాదనను డెమొక్రాట్లు కొట్టిపారేస్తున్నారు. ట్రంప్ దీనిని అమలుచేస్తారంటే నమ్మలేమని చెబుతున్నారు. గతంలో కూడా ఆయన ఎన్నో ప్రతిపాదనలు చేశారని, తర్వాత వాటి సంగతే మర్చిపోయారని ఆరోపించారు. ఈ విషయంలో ప్రెసిడెంట్ పట్టుదలగా ఉంటే ముందు ప్రభుత్వాన్ని తెరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ట్రంప్ ప్రతిపాదనలేవీ కాంగ్రెస్ ఆమోదం పొందలేవని స్పీకర్ నాన్సీ పెలోసి తేల్చి చెప్పారు. పైపెచ్చు డ్రీమర్ల సమస్యలకు ఇవేవీ శాశ్వత పరిష్కారం కావని ఆమె వివరించారు.



యూనిటీ ర్యాలీలో అంతా అవినీతిపరులేనని విమర్శిస్తూ పాట్నాలో లోక్ జనశక్తి పార్టీ కార్యకర్తల నిరసన

అమెరికాలో సిక్కు యువకుడిపై దాడి

న్యూ యార్క్: అమెరికాలోని ఒరెగాన్ లో సిక్కు యువకుడిపై ఓ అమెరికన్ దాడి చేశాడు. రోలింగ్ పేపర్లు కావాలంటూ స్టోర్ కు వచ్చిన ఆండ్రూ రామ్సే అందులో పనిచేస్తున్న హర్విందర్ సింగ్ పై దాడికి దిగాడు. ఐడీ లేకుండా పేపర్లు ఇవ్వననడంతో కోపానికి గురైన ఆండ్రూ.. సింగ్ గడ్డం లాగి, తల పాగాను తీసే ప్రయత్నం చేశాడు. నేలకేసి కొట్టి , సింగ్ పై షూ విసిరేశాడు. తీవ్రంగా గాయపడిన సింగ్ ను పోలీసులు హాస్పిటల్ కు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, మత విద్వేష దాడి కింద కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.



బుజ్జి పాపాయి...
వెలుగు చూడోయి

నిజామాబాద్ జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ ముందు ఉదయం వేళ సూర్యుడి వెలుగులో పసి పిల్లలతో తల్లులు.
నిజామాబాద్, వెలుగు ఫొటోగ్రాఫర్

"మా ఊరుకు రాజకీయంగా పెద్దపేరుంది. రాజకీయ కక్షలతో ప్రజలు బాగా సఫరయిపోయారు. ఇట్లా ఏండ్ల నుండి సఫరవుతున్నరుకావట్టి పెయిన సారి నుండి ఊరంతా ఛేంజ్ కావాలని అనుకున్నం. మా దండెపల్లి మండలంలోనే మంచి పేరు దెచ్చుకోవాల్నని అనుకున్నం. ఈ పని స్లోగ చేయాల్నని మొదలు వెట్టి అనుకున్నది సాధించుకున్నం."
- సత్తయ్య, కన్నెపల్లి గ్రామస్తుడు.



మొక్కలతో గ్రామస్తులు

"ప్రభుత్వం నుంచి పైసల్ వచ్చేదాకా ఆగకుంట ఊరోళ్లం కల్సి చందాలేస్కోని అరెకరం జాగా కొన్నం. దాంట్ల మహిళా భవనం, ఫంక్షన్ హాల్ గిట్ల కట్టాల్నని అనుకుంటున్నం. ఇంతకు ముందు ఊర్నిండా దోమలే ఉండే. ఇప్పుడు సూతమన్న ఒక్క దోమ కూడా లేదు. ఊళ్ల లొల్లి పంచాయతీలైతే అస్సల్ లేవు. శానా మారింది మా ఊరు."
- వజ్రమ్మ, మాదాపూర్ గ్రామం, గన్నేరువరం మండలం, కరీంనగర్ జిల్లా.

ఊరుమ్మడి విజయం

అంతా కలిసి ఉన్నారు.. అందుకే ఉత్తమ పంచాయతీలయ్యాయి ● ఆదర్శగ్రామాల అభివృద్ధిపై వి6 వెలుగు పరిశీలన

ఊళ్లు మారుతున్నాయి. ఎవరో వచ్చి ఏదో చేస్తారనో, చేయాలనో ఎదురుచూడటం లేదు. ప్రభుత్వ నిధుల కోసం పనులు ఆపుకోవడం లేదు. బాధ్యతలను గుర్తు చేసుకుని భవిష్యత్తుకు భరోసానిస్తున్నాయి. పంతాలు, పట్టింపులు లేకుండా పదిమందిమీ కల్సి ముందుకు సాగుదామంటున్నాయి. వీధి లైట్ల నుండి ఊరుమ్మడి ఆస్తులు పెంచుకోవడం దాకా అందరి బాధ్యత అనుకుంటున్నాయి. ఆదర్శం అంటే ఇదీ అని చాటుకుంటున్నాయి. పంచాయతీ ఎన్నికల సందర్భంగా వి6 వెలుగు బృందం ఆదర్శ గ్రామాలు, మోడల్ పంచాయతీల్లో తిరిగినప్పుడు అనేక ఆసక్తికరమైన విషయాలు తెలిశాయి.

వెలుగు బ్యూరో:

ఇదీ ఉత్తమ గ్రామ పంచాయతీల్లో ప్రజల అభిప్రాయం. మామూలు గ్రామాల కంటే కాస్త మెరుగ్గా ఉండొచ్చు పరిస్థితి అనుకుంటాం. కానీ ఉత్తమంగా పేరు తెచ్చుకోవడం వెనుక చాలా ప్రయత్నమే జరిగింది. దీనికి తొట్ట తొలి అడుగు వారి ఇగోలను విసిరి కొట్టడమే. దాని తర్వాత రాజకీయం కంటే ఊరికే తొలి పీట వేశారు. ఒక్కో గ్రామంలో ఒక్కోరకమైన సాంస్కృతిక మార్పు జరిగింది. సంప్రదాయ రాజకీయాలు కాదని కొత్త తరానికి అవకాశం ఇచ్చిన గ్రామాలు కొన్ని. తమను తాము మార్చుకున్న గ్రామాలు మరి కొన్ని. ఊరుమ్మడి పండగలకు శ్రీకారం చుట్టి ఊరే ఉమ్మడి కుటుంబం అయిన గ్రామాలు ఇంకొన్ని. ఇలాంటి గ్రామాలు తెలంగాణలో డజన్ల కొద్దీ ఉన్నాయి. అందులో కొన్ని గ్రామాల్లో వి6 వెలుగు బృందం పర్యటించింది. ఉత్తమ, ఆదర్శ గ్రామ పంచాయతీల్లో జరిగిన మార్పు, అభివృద్ధి అయిన తీరు తెన్నులను గమనించింది.

కన్నెపల్లి గ్రామం. రెండు వేల జనాభా ఉంటుంది. అంతా వ్యవసాయంపై ఆధారపడిన వారే. ఈ గ్రామం ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో ఉంది. రాజకీయ కక్షలకు పెట్టింది పేరు. 1983ల నుండి 2009 వరకు కోర్టుల చుట్టూ తిరగని గ్రామస్తుడు లేడంటే అతిశయోక్తి కాదు. ప్రతీ ఎన్నికల్లో పార్టీల వారిగా విడిపోయి కొట్టుకునే వారు. కొంత మందిపై రౌడీ షీట్ కూడా తెరిచారని గ్రామానికి చెందిన సాంబయ్య చెప్పారు. ఈ చిన్న గ్రామం నుండి గతంలో ఎంఎల్ఏగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ గా పనిచేసిన వారున్నారు. రాజకీయంగా నాయకులు ఎదుగుతున్నా కొద్దీ ఇక్కడ కక్షలు పెరుగుతూ వచ్చాయి. పాతతరం కక్షలతో జీవితాన్ని పాడుచేసుకున్నది. గ్రామంలో కొత్త తరం ఎదిగి వచ్చింది. దీన్ని గుర్తించింది. ఊరందర్నీ ఏక తాటిపైకి తెచ్చింది. ప్రయత్నం ఫలించింది. 2009లో గ్రామంలో లోక్ అదాలత్ ఏర్పాటు చేసింది ప్రభుత్వం. వర్గాలుగా విడిపోయిన గ్రామస్తులు తమ కేసులను అక్కడే పరిష్కరించుకున్నారు. ఆ తర్వాత ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాల పంచాయతీకి అవకాశం లేకుండా చేసుకున్నారు. కిందటి సర్పంచ్ ఎన్నికల్లో ఉన్నత విద్యావంతుడు సర్పంచ్ కావడంతో గ్రామ దృశ్యమే మారింది. గతంలో ఊరి రోడ్లన్నీ బురదే. మురికి నీరు ఇళ్ల ముందు నుండి పారేది. నాలుగేళ్ల కాలంలో గ్రామంలో మురుగునీటి కాల్వలు నిర్మించారు. ఇంటింటికీ నల్లా ఏర్పాటు చేసి, ప్రతీ ఒక్కరి పేరిట బ్యాంక్ అకౌంట్ తెరిచారు. ప్రభుత్వం నుండి వస్తున్న నిధుల లెక్కలను గ్రామస్తులకు ఎప్పటికప్పుడు వివరించే కొత్త సంస్కృతిని కొత్తసర్పంచ్ శ్రీనివాస్ అలవాటు చేశారు. గ్రామస్తులంతా చందా లేసుకుని కొత్త పంచాయతీ భవనాన్ని కట్టుకున్నారు. స్వచ్ఛందంగా ఇంటి పన్నులు కడుతున్నారు. ఒకప్పుడు రోజూ పోలీసులు గస్తీ తిరిగే గ్రామం నుండి పదేళ్ల కాలంలో ఒక్క పోలీసు కేసూ నమోదు కాలేదు. ఇదీ ఈ గ్రామం మారిన తీరు.



సీసీ రోడ్లు, పచ్చని మొక్కలతో గ్రామం



కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామస్తులు సాధించింది మరో విజయం. ఊరుమ్మడి శ్రమతో భూమిలోకి ఇంకిన నీటిని ఒడిసి పట్టుకున్నారు. గ్రామానికి రవీందర్ రెడ్డి సర్పంచ్ అయిన తర్వాత గ్రామ స్వరూపం మారింది. గ్రామస్తులూ మారారు. ఇంటింటికీ ఇంకుడు గుంతలు తీశారు. ప్రతీ ఇంటికీ నల్లా. ప్రతీ ఇంటి వద్ద ఒక మొక్క. గ్రామంలో సీసీ కెమెరాలు. సీసీరోడ్లు. గ్రామస్తులంతా కల్సి గ్రామంలో కాంప్లెక్స్ కట్టుకునేందు 25 గుంటల భూమి కొన్నారు. దోమలు లేని గ్రామంగా చేసుకున్నారు. ఎన్నికల సందర్భంలో తప్ప రాజకీయాల ముచ్చటే లేదని గొర్రెల కాపరి వజ్రమ్మ చెప్తున్నారు. కులాలకు అతీతంగా వేడుకలు జరుపుకుంటారు. ప్రతిదీ గ్రామ పంచాయతీలో చర్చించిన తర్వాతనే తుది నిర్ణయం తీసుకుంటారు. భూమిలేని తొమ్మిది దళిత కుటుంబాలకు మూడెకరాల చొప్పున భూమిని గ్రామస్తులంతా కలిసి ఇప్పించారు. ప్రభుత్వ సాయానికి తోడు మరి కొంత గ్రామస్తులు వేసుకున్నారు. కేవలం 13 వందల మంది నివసించే ఈ గ్రామం కరీంనగర్ జిల్లాకే ఆదర్శంగా నిలబడింది.

మహబూబ్ నగర్ జిల్లా మూసాపేట మండలం నిజాలాపూర్ గ్రామం అరుదైన విజయాన్ని సొంతం చేసుకున్నది. ఈ గ్రామం హైదరాబాద్ బెంగుళూరు జాతీయ రహదారికి దగ్గరగా ఉంటుంది. గ్రామ జనాభా మూడు వేల లోపు. నాలుగేళ్లలో గ్రామ చిత్రమే మారింది. ఇంద్రయ్యసాగర్ సర్పంచ్ అయిన తర్వాత ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి నిర్మించేలా చేశారు. వీటి నిర్మాణానికి ఆదర్శ మహిళా సంఘ సభ్యులు ఇటుకలు తక్కువ ధరకు సేకరించారు. గ్రామంలో సీసీ రోడ్లు వేసుకున్నారు. చందాలేసుకుని కొత్త గ్రామ పంచాయతీ భవనం కట్టుకున్నారు. మహిళా సంఘం సభ్యులే పది రోజులకోసారి ఊరంతా శుభ్రం చేసుకుంటారు. శుభ్రత కమిటీ, గ్రామ నిర్వాహణ కమిటీ, మొక్కల సంరక్షణ కమిటీ, ఆర్థిక నిర్వాహణ కమిటీ ఇలా పలు కమిటీ ఏర్పాటుచేసుకున్నారు. వీటి ద్వారానే గ్రామ అభివృద్ధికి పునాదులేసుకుంటున్నారు. గ్రామంలో ఏదైనా శుభకార్యం జరిగితే చుట్టాలకు తమ ఇండ్లల్లో ఉన్న మరుగుదొడ్లు ఇవ్వాలనే తీర్మానం చేసుకున్నారు. మరుగు దొడ్లనూ గ్రామంలోనే మేస్త్రీలే ఉచితంగా కట్టారు. ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్ రూం ఇండ్లను గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ క్వాలిటీతో నిర్మించారని, మేస్త్రీలు ఉచితంగా పని చేశారని గ్రామానికి చెందిన చంద్రకళ చెప్పారు. గ్రామాభివృద్ధి మహిళల పాత్ర చాలా ఉందని సర్పంచ్ ఇంద్రయ్యసాగర్ చెప్పారు. ఊరంతా కల్సి సాధించుకున్న విజయంతోనే తమ గ్రామం ఉత్తమ పంచాయతీ అయిందని అంటున్నారు గ్రామస్తులు. ఇదీ తెలంగాణలోని ఉత్తమ గ్రామ పంచాయతీల విజయం.



గుర్తుల సైజు కొంపముంచుతుందా

సర్పంచ్, వార్డు మెంబర్ క్యాండిడేట్ల ఆందోళన

మెదక్, వెలుగు: మొదటి విడత గ్రామ పంచాయతీ ఎలక్షన్లకు అంతా రెడీ అయ్యింది. సోమవారం పోలింగ్ జరగనుంది. అదే రోజు క్యాండిడేట్ల భవితవ్యం తేలిపోనుంది. అయితే బ్యాలెట్ పేపర్ మీద ఉండే గుర్తుల సైజు విషయంలో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు పోటీ చేస్తున్న క్యాండిడేట్ల లో టెన్షన్ పట్టుకుంది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ పంచాయతీ ఎలక్షన్లలో సర్పంచ్ క్యాండిడేట్లకు 30 గుర్తులు, వార్డు మెంబర్ క్యాండిడేట్లకు 20 గుర్తులను కేటాయించింది. సర్పంచ్ క్యాండిడేట్లకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లపై ఉంగరం గుర్తు సైజ్‌లో పెద్దగా ఉండి క్లియర్‌గా కనిపిస్తుండగా, కత్తెర, బ్యాట్, కప్పుసాసర్ వంటి గుర్తులు చిన్నగా ఉండి క్లియర్‌గా కనిపించడం లేదని తెలిసిందని క్యాండిడేట్లు ఆరోపిస్తున్నారు. బ్యాలెట్ పేపర్ మీద కేటాయించిన గుర్తు మాత్రమే ఉంటుంది. వారి పేరు ఉండదు. దీనివల్ల ఓటర్లు క్లియర్‌గా కనిపించే గుర్తుపై ఓటేసే అవకాశం ఉందని, అలా జరిగితే తాము నష్టపోతామని మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చదువుకున్నవారి విషయంలో ఇబ్బంది లేదని, నిరక్షరాస్యులు, వృద్ధులు క్లియర్‌గా కనిపించే గుర్తు మీద ఓటేస్తే అది తమకు నష్టం కలుగజేస్తుందంటున్నారు. ఎంతో కాలంగా సర్పంచ్ పదవిపై ఆశ పెట్టుకున్నాం, ఎలక్షన్లలో గెలుపొందాలని ఎంతో కష్టపడ్డాం. కానీ బ్యాలెట్ పేపర్‌లో గుర్తుల సైజు మా కొంప ముంచేటట్టుంది అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పానపట్టం మీద పాదముద్రలు

○ మెదక్ దగ్గర అరుదైన రాతి విగ్రహం

మెదక్, వెలుగు: మెదక్ పట్టణంలో అరుదైన పానపట్టాన్ని గుర్తించినట్టు తెలంగాణ చరిత్ర పరిశోధకులు బొగ్గులు శంకర్‌రెడ్డి తెలిపారు. పిల్లికొట్టాల దగ్గర హనుమాన్‌గుడి సమీపంలో పానపట్టం మీద లింగానికి బదులు పాద ముద్రలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా పాదముద్రలున్న పానపట్టాలు లేవన్నారు. ఈ పానపట్టం మధ్యయుగానికి చెందినది కావచ్చన్నారు.

ఫిల్మ్ ఫెస్టివల్‌కు పైడి జైరాజ్ చిత్రం

కరీంనగర్ కల్చరల్, వెలుగు: కరీంనగర్‌కు చెందిన బాలీవుడ్ నటుడు పైడి జయరాజ్ మీద నిర్మించిన డాక్యుమెంటరీ నోయిడాలో జరుగనున్న 6వ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యింది. కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు పొన్నం రవిచంద్ర, చేతన్ "ఇన్విన్సిబుల్ హీరో' పేరుతో జైరాజ్ మీద డాక్యుమెంటరీ తీశారు. ఫిల్మ్ మేకర్ శ్యాం బెనగల్, బాలీవుడ్ నటుడు రాజా మురాద్, ప్రముఖ సినీ దర్శకుడు బి. నరసింగరావు, విజయేంద్రప్రసాద్, జయరాజ్ కూతురు దీపా షాహీ, మనవడు రాజన్ షాహీ, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అభిప్రాయాలతో పైడి జైరాజ్ జీవితాన్ని ఈ డాక్యుమెంటరీలో సమగ్రంగా చిత్రించారు. జనవరి 27న నోయిడాలో చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శనకు రావాలని దర్శకులను ఆహ్వానించారు. డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్ కు ఎంపిక వడం పట్ల ఫిల్మ్ క్రిటిక్ వారాల ఆనంద్, లోక్ సత్తా బాధ్యులు నరెడ్ల శ్రీనివాస్, కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి సయ్యద్ ముజఫర్ తదితరులు అభినందించారు.

పట్నం వారం..జన సంద్రం



సిద్దిపేట, వెలుగు : కొమురవెల్లి మల్లికార్జునస్వామి జాతర ప్రధాన ఘట్టమైన పట్నం వారం సందర్భంగా ఆదివారం భక్తులు పోటెత్తారు. కొమురవెల్లిలో ఎటు చూసిన జనమే కనిపించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాల మధ్య మల్లన్న గుట్టలు హోరెత్తాయి. ఆదివారం ఒక్కరోజే దాదాపు లక్ష మంది జనం వచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు తమ మొక్కులను తీర్చుకోవడానికి బారులు కట్టారు. బోనాలు, ఒడి బియ్యాలతో స్వామిని దర్శించుకోవడానికి దాదాపు ఐదు గంటలకు పైగా క్యూలైన్లలో నిలబడ్డారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు కిక్కిరిసిపోవడమే కాకుండా ఆలయం వెలుపల చెక్‌పోస్టు వరకు బారులు తీరారు. ఉచిత దర్శనాలు, శ్రీఘ్ర, వీఐపీ దర్శనాలు రాత్రి వరకు కొనసాగాయి. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. కొమురవెల్లి క్షేత్రం మల్లన్న నామస్మరణతో మారుమోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాలక మండలి చైర్మన్ సంపత్, ఈవో వెంకటేష్ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు ఇచ్చారు. అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి, ఏసీపీ మహేందర్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

○ మల్లన్న నామస్మరణతో హోరెత్తిన కొమురవెల్లి
○ దర్శనానికి ఐదు గంటల సమయం

తప్పని ఇక్కట్లు

కొమురవెల్లికి దారి తీసే మూడు ప్రధాన రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోవడంతో వాటిని క్రమబద్ధీకరించడానికి పోలీసులు నానా పాట్లు పడ్డారు. వాహనాలను నిలిపివేసిన స్థలం నుంచి ఆలయం వరకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పిస్తామని చెప్పినా ప్రత్యేక వాహనాలు ఎక్కడా కనిపించలేదు. దాదాపు కిలోమీటరుకు పైగా భక్తులు నడవాల్సి వచ్చింది. భక్తుల రద్దీకి అనుగుణంగా వసతి సౌకర్యం లేకపోవడం, స్నానాలకు, తాగు నీటికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. భారీగా అద్దెలు చెల్లించలేని భక్తులు కొమురవెల్లి పరిసరాల్లో ఖాళీ స్థలాలు కనిపించిన చోట గుడారాలు వేసుకుని విడిది చేశారు.

నేడు పెద్దపట్నం, అగ్నిగుండాలు

హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొమురవెల్లి తోటబావి వద్ద పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు.



బోనమెత్తిన మహిళ



భక్తులతో కిక్కిరిసిన కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిసరాలు



బండారి చల్లుతున్న భక్తులు

రామయ్యకు రూ.20 లక్షల విరాళం

భద్రాచలం, వెలుగు: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం ఓ భక్తుడు రూ.20 లక్షల విరాళాన్ని అందజేశారు. కృష్ణా జిల్లా బాపులపాడు గ్రామానికి చెందిన యార్లగడ్డ వెంకటేశ్వరరావు సీతారామచంద్రస్వామి నిత్యాన్నదాన పథకానికి రూ.6 లక్షలు, గోశాల నిర్మాణానికి రూ.6 లక్షలు, 100 గదుల సత్రంలో ఒక గది నిర్మాణానికి రూ.8 లక్షలు ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ ప్రధానార్చకులు అమరవాది విజయరాఘవన్, ఆలయ సూపరింటెండెంట్ నిరంజన్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకటేశ్వరరావుకి స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.



కాలేజీ ఎదుట ధర్నా చేస్తున్న స్టూడెంట్స్

కోదాడలో ఆర్‌పీఎఫ్ పరీక్ష రద్దు

○ ఆందోళనకు దిగిన స్టూడెంట్స్

కోదాడ, వెలుగు: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్ల నియామకం కోసం ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. కోదాడ పట్టణంలోని కిట్స్‌ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మూడు షిఫ్ట్‌లలో పరీక్ష రాసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి స్టూడెంట్స్ హాజరయ్యారు. అయితే సాంకేతిక లోపంతో సర్వర్ స్లోగా ఉండడంతో ఉదయం షిఫ్ట్‌లోనే పరీక్ష గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఆ తరువాత సెకండ్ షిఫ్ట్‌లోను ఇదే పరిస్థితి నెలకొనడంతో పరీక్ష సజావుగా జరగలేదు. దీంతో రెండు, మూడు షిఫ్ట్‌లలో జరిగే పరీక్షను నిర్వాహకులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా స్టూడెంట్స్ ఆందోళనకు దిగారు. ఇన్విజిలేటర్లు, కాలేజీ యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. పరీక్ష నిర్వహించాల్సిందేనని డిమాండ్ చేస్తూ కాలేజీ ఎదుట ఉన్న కుర్చీలు, పూల కుండీలను పగలగొట్టారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శ్రీనివాసరెడ్డి కాలేజీ దగ్గరకు చేరుకుని స్టూడెంట్స్‌తో మాట్లాడారు. పరీక్షను మరోసారి నిర్వహిస్తామని నిర్వాహకులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



‘పంచాయతీ’కి భారీ బందోబస్తు

- కమిషనర్ కార్తికేయ

నిజామాబాద్, వెలుగు: జిల్లాలోని ఆర్మూర్ రెవెన్యూ డివిజన్‌లో సోమవారం నిర్వహించే గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నిజామాబాద్ పోలీసు కమిషనర్ కార్తికేయ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డివిజన్‌లోని 11 మండలాల పరిధిలోని 177 గ్రామాల్లో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించినట్లు తెలిపారు. అదనపు డీసీపీ (ఎల్ అండ్ ఓ), ఎనిమిది మంది ఏసీపీలు, 25 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 80 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 300 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 600 మంది కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, 390 మంది హోం గార్డులు, మహిళా హోం గార్డులను బందోబస్తుకు నియమించినట్లు తెలిపారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

రంగంలోకి దిగిన ధర్మాధికారి కమిషన్

- విద్యుత్ ఉద్యోగుల సమస్యపై ఏపీ, తెలంగాణ ఉన్నతాధికారులతో భేటీ
- ఇరు పక్షాల వాదనలు విన్న జస్టిస్ ధర్మాధికారి

హైదరాబాద్, వెలుగు: విద్యుత్ ఉద్యోగుల విభజనపై సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ ధర్మాధికారి నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ రంగంలోకి దిగింది. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఏపీ, తెలంగాణ విద్యుత్ అధికారులతో కమిషన్ భేటీ అయింది. రాష్ట్రం తరఫున ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు అశోక్‌కుమార్, పర్వతం, నాలుగు డిస్కంల డైరెక్టర్లు, ఏపీ నుంచి ఏజీతోపాటు ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ విజయానంద్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీలు, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఇరుపక్షాలు జస్టిస్ ధర్మాధికారి వద్ద వాదనలు వినిపించాయి. సమస్య పరిష్కరించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. మార్గదర్శకాల విషయంలో ఇరు పక్షాలు ఒకే తాటిపైకి రావాల్సి ఉంది. విద్యుత్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, విద్యుత్ సంస్థల అధికారులు కమిషన్‌కు ఈ సందర్భంగా వినతిపత్రాలు సమర్పించారు. 239 మంది ఏపీ ఉద్యోగులు తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పని చేయడానికి సుముఖత వ్యక్తం చేస్తూ వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిసింది.

ఆప్షన్ల పేరుతో చొరబడే కుట్ర: టీఈఈఏ

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్(టీఈఈఏ) నేతలు శివాజీ ఆధ్వర్యంలో కమిషన్‌ను కలిసి వాదనలు వినిపించి వినతిపత్రం సమర్పించారు. రిలీవ్ చేసిన ఉద్యోగులపైనే సుప్రీంకోర్టు కమిషన్ వేసిందని, వారిని అడ్డుపెట్టుకుని ఆప్షన్ల పేరుతో ఏపీ ఉద్యోగులు తెలంగాణలో చొరబడేందుకు కుట్ర పన్నుతున్నారని శివాజీ ఆరోపించారు. సీనియార్టీ పేరుతో ఏపీ ఉద్యోగులందరికీ తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేసే వీలు కల్పించాలన్న ఆంధ్రా ఇంజనీర్ల వాదనను ఖండించారు. టీఎస్ఎస్‌పీడీసీఎల్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ సంస్థల్లో సూపర్ న్యూమరరీ పోస్టుల పేరుతో తిష్టవేసిన ఏపీఎస్ఈబీకి చెందిన ఏపీ ఉద్యోగులు తమ రాష్ట్రం వెళ్లాల్సిందేనని ఆధారాలను సమర్పించామన్నారు. ఏపీ విద్యుత్ సంస్థల్లో వంద శాతం అక్కడి వారే ఉన్నారని, తెలంగాణలో మాత్రం 40 శాతం ఏపీవారే ఉన్నారని ఆరోపించారు. ఎక్కడి ఉద్యోగులు అక్కడే పని చేయాలనే ముల్కీ నిబంధనలు తుంగలో తొక్కారని, ఒక్క ఏపీ ఉద్యోగి తెలంగాణకు వచ్చినా మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. గవర్నర్ చొరవ తీసుకుని ఇద్దరు సీఎంలతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు.



2,73,782 మందికి ‘టాస్క్’

హైదరాబాద్, వెలుగు:

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)లో శిక్షణ పొందడానికి యువత ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువ కోర్సుల్లో తక్కువ డబ్బుకే ట్రైనింగ్ ఇస్తుండటంతో టాస్క్‌లో చేరే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. 2015 నుంచి ఇప్పటి వరకు 2,73,782 మంది ట్రైనింగ్ తీసుకున్నారు. శిక్షణ తర్వాత 60 శాతం మంది అభ్యర్థులు వివిధ సంస్థల్లో ఉపాధి పొందారు. 4,563 మంది ఫ్యాకల్టీ కూడా శిక్షణ పొందారు. 588 కాలేజీలు టాస్క్‌లో రిజిస్టరయ్యాయి. దాదాపు 34 పైగా ప్రముఖ కంపెనీలు టాస్క్‌తో భాగస్వామ్యమయ్యాయి.

గ్రాడ్యుయేట్లు, ఫ్యాకల్టీకి ట్రైనింగ్

విద్యార్థులకు ఐటీ రంగంలో ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా దేశంలోనే తొలిసారిగా టాస్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాలేజీల నుంచి బయటికి వచ్చే గ్రాడ్యుయేట్లకు సాంకేతిక, సాంకేతికేతర పారిశ్రామిక అవసరాలకు సరిపోయే నైపుణ్య శిక్షణ ఇప్పిస్తోంది. ఫ్యాకల్టీ సభ్యులకు కూడా ఇందులో నైపుణ్య తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్, డిగ్రీ,




- 60 శాతం మందికి ఉద్యోగాలు
- చాలా తక్కువ ధరలకే ఎన్నో కోర్సులు
- 34కు పైగా ప్రముఖ కంపెనీలతో టాస్క్ భాగస్వామ్యం

ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ, పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం టాస్క్ దాదాపు 85 పైగా టెక్నికల్, సాఫ్ట్ స్కిల్ కోర్సుల్లో శిక్షణ ఇస్తోంది. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఒకరోజు నుంచి నాలుగు నెలల వ్యవధితో 45 రకాల కోర్సులను అందిస్తోంది. డిగ్రీ విద్యార్థులకు ఒకరోజు నుంచి ఆరు నెలల వ్యవధి గల 17 కోర్సులు, ఫార్మసీ విద్యార్థులకు ఒకటి నుంచి రెండు రోజుల వ్యవధితో 6 రకాల కోర్సులు, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు 2 రోజుల నుంచి 200 గంటల వ్యవధి గల 7 కోర్సులు, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఒకరోజు నుంచి 5 రోజుల వ్యవధి గల 9 రకాల కోర్సులను అందిస్తోంది. ప్రైవేటు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లతో పోలిస్తే టాస్క్ ఫీజు చాలా తక్కువ. ప్రైవేటు కోచింగ్ సంస్థలు శాప్ సాఫ్ట్‌వేర్ కోర్సు శిక్షణ కోసం రూ.3.5 లక్షల తీసుకుంటుండగా టాస్క్ కేవలం రూ.12 వేలకే అందిస్తోంది.

సోలార్ రంగంలోనూ శిక్షణ

పలు వేదికలు, అనుబంధ కాలేజీల ద్వారా శిక్షణ అందించిన టాస్క్.. 2018 జూన్ నుంచి నేరుగా విద్యార్థులకు వద్దకే వెళ్లి ట్రైనింగ్ ఇస్తోంది. సోలార్ విద్యుత్ రంగంలో క్షేత్రస్థాయిలో శిక్షణ అందిస్తోంది. విద్యార్థుల వద్దకే వెళ్లి ట్రైనింగ్ ఇచ్చేందుకు ‘స్కిల్ ఆన్ వీల్స్’ పేరుతో కొత్త కార్యక్రమం చేపట్టింది. జిల్లాల్లో విద్యార్థులకు సోలార్ ఇన్‌స్టాలేషన్, మెయింటెనెన్స్, సర్వీసింగ్‌పై శిక్షణ ఇస్తోంది. ఈ కోర్సుకు వాస్తవానికి రూ.10 వేల ఖర్చు అవుతుంది. కానీ రూ.500కే శిక్షణ ఇస్తున్నారు.



మైనింగ్‌లో కార్మికుల భద్రతే ముఖ్యం

- కంపెనీలన్నీ కార్మికుల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి
- మైనింగ్ సేఫ్టీ సదస్సులో కేంద్ర, రాష్ట్ర అధికారులు

హైదరాబాద్, వెలుగు: చిన్న, మధ్య, భారీ తరహా ప్రైవేటు గనుల్లో కార్మికులకు భద్రత లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మైనింగ్ శాఖ అధికారులు, వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల భద్రతపై కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్ తప్పనిసరిగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఖనిజ సంపద వెన్నెముక లాంటిదని అన్నారు. కేంద్ర కార్మిక శాఖ(మైన్స్ సేఫ్టీ) డైరెక్టరేట్ జనరల్, మైనింగ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ‘మైన్స్ సేఫ్టీ డెవలప్ మెంట్, సస్టెనబుల్ మినరల్ డెవలప్ మెంట్’ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న మైన్స్ లలో కార్మికులకు కల్పిస్తున్న రక్షణ ఏర్పాట్లపై చర్చించారు. యాజమాన్యం అమలు చేస్తున్న భద్రత ఏర్పాట్లను సింగరేణి కాలరీస్ అధికారులు వక్తలకు వివరించారు. గనుల్లో కార్మికుల రక్షణకు సంబంధించి 13 పేపర్లను సెమినార్‌లో ప్రవేశపెట్టారు. ప్రతి కంపెనీ భద్రత చర్యలపై ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. దీనికి రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, కేంద్ర మైనింగ్ శాఖ డైరెక్టర్ ప్రితుల్ కుమార్, టీఎస్ ఎండీసీ ఎండీ మల్సూర్, ఎన్ఎండీసీ నుంచి సాహు, గనుల శాఖ మాజీ డైరెక్టర్ రాజగోపాల్ హాజరయ్యారు.

100 లక్షల టన్నులు

- బొగ్గు ఉత్పత్తిలో రికార్డు దిశగా కొత్తగూడెం ఏరియా

భద్రాద్రికొత్తగూడెం : సింగరేణి కాలరీస్ కంపెనీ చరిత్రలోనే తొలిసారిగా 100 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి రికార్డు సృష్టించేందుకు కొత్తగూడెం ఏరియా సన్నద్ధమవుతోంది. 130 ఏళ్ల చరిత్రలో ఇప్పటి వరకూ ఒక ఏరియా 100లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తిని సాధించిన దాఖలాలు లేవు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో కొత్తగూడెం ఏరియా పది మిలియన్ టన్నుల బొగ్గును మరో నెలరోజుల్లో ఉత్పత్తి చేసేలా ఏరియా అధికారులు చర్యలు చేపట్టారు. సింగరేణిలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియాలోని జీకే ఓపెన్‌కాస్టు గని 76 రోజుల ముందుగానే ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి రికార్డు సృష్టించింది. 35.92లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఈ నెల 14వ తేదీన సాధించింది. ఇదే క్రమంలో ఏరియాలోని సత్తుపల్లి జేవీఆర్ ఓపెన్‌కాస్టు ప్రాజెక్ట్ 41 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని శనివారం సాధించింది. 70 రోజుల ముందుగానే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని జేవీఆర్ ఓపెన్‌కాస్టు సాధించడం విశేషం. కొత్తగూడెం ఏరియా ఈ ఆర్థిక సంవత్సరంలో 109.25లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేలా నిర్దేశించుకుంది. ఇప్పటి వరకు దాదాపు 95 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. మరో 15 రోజుల్లో 100 లక్షల టన్నుల బొగ్గును, నెల రోజుల్లో వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించి సింగరేణి చరిత్రలో కొత్తగూడెం ఏరియా రికార్డు సృష్టించనుంది. సింగరేణిలోని 11 ఏరియాల్లో కొత్తగూడెం ఏరియా ప్రతీ నెల నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ ముందుకు సాగుతోంది. ఉత్పత్తితో పాటు రవాణా విషయంలోనూ ఏరియా అద్భుతమైన ప్రగతిలో ఉంది. సింగరేణి చరిత్రలోనే 2,600 రేకు(వ్యాగన్లు)ల బొగ్గు రవాణా చేసి ఏరియా శభాష్ అనిపించుకుంది. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 91 లక్షల టన్నుల బొగ్గును కంపెనీ రవాణా చేసింది. ఉత్పత్తి లక్ష్యాల సాధనపై ఏరియా సీజీఎం కేవీ రమణమూర్తి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఉత్పత్తి లక్ష్యాలపై కంపెనీ చైర్మన్ ఎన్ శ్రీధర్ పర్యవేక్షణ చేస్తుండడంతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతోందని సీజీఎం తెలిపారు.



కొత్తగూడెం ఏరియా సీజీఎం కార్యాలయం

కరెంటు, నీటి బిల్లులకు 1.29 కోట్లు విడుదల

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని 16 జిల్లాలకు చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎలక్ట్రిసిటీ, వాటర్ బిల్లుల కోసం పాఠశాల విద్యా శాఖ నిధులు మంజూరు చేసింది. 2018-19 విద్యాసంవత్సరానికి రూ.1.29 కోట్లు విడుదల చేస్తూ కమిషనర్ విజయ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్, హైదరాబాద్, మెదక్, కామారెడ్డి, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఈ నిధులు విడుదల చేశారు.

‘పల్లె’ వరించేదెవరినో

- విజేతలెవరో.. పరాజితులెవరో తేలేది నేడే

నిజామాబాద్,వెలుగు:

నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ డివిజన్ లోని 11 మండలాల్లోని 177 గ్రామపంచాయతీల్లో మొదటి విడతలో ఎన్నికలు జరగనున్నాయి. వీటికి ఈనెల 7 నుంచి 9 వరకు నామినేషన్ల ప్రక్రియను నిర్వహించారు. మూడు రోజుల్లో 177 గ్రామ పంచాయతీ స్థానాలకు 1155 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 610 నామినేషన్లు ఉపసంహరించుకోగా, 36 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ప్రస్తుతం 141 స్థానాలకు 545 మంది అభ్యర్థులు,1746 వార్డు స్థానాలకు 3,857 మంది అభ్యర్థులుపోటీలో ఉన్నారు.

ఎలాగైనా గెలవాలె..

పోటీలో ఉన్న అభ్యర్థులు ఎలాగైనా గెలవాలని ప్రత్యర్థిని చిత్తుగా ఓడించాలనే కసితో చేయాల్సిందంతా చేస్తున్నారు. శనివారం మధ్యరాత్రి నుంచి వారి ప్రయత్నాలు, ప్రణాళికలు ఎక్కువయ్యాయి. సంఘాల వారీగా ఓట్ల లెక్క చూసుకుని ఒక్కో కుటుంబానికి ఎంతివ్వాలనేది లెక్కలేసుకున్నారు. కొందరు ఓటర్ లిస్టు చేతిలో పట్టుకొని ఓటరుకు రూ. 500 నుంచి రూ. 1000 చొప్పున పంచినట్లు తెలిసింది.

పబ్లిక్‌గా పంపిణీ పోగ్రాం..

సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం, డబ్బుల పంపిణీ రహస్యంగా జరుగుతుంది. ప్రత్యర్థి పార్టీవారు డబ్బులు పంపిణీ చేస్తున్న వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు ప్రయత్నించేవారు. కానీ ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న పల్లెపోరులో ఎవరికి వారు ప్రత్యర్థులకు తెలిసేలా పబ్లిక్‌గానే కానిస్తున్నారు. పైగా ప్రత్యర్థి కన్నా తాను ఎక్కువగా ఇవ్వాలని కనుక్కొని మరీ పంచినట్లు తెలుస్తోంది. ఎక్కడ చూసినా నగదు, చికెన్ ప్యాకెట్లు, మద్యం బాటిళ్లు పంపిణీ చేస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని గానీ, అధికారులు చర్యలు తీసుకుంటారని గానీ ఎవరూ భయపడుతున్నట్లుగా కనిపించడం లేదు.



బహుజన సాహిత్య అకాడమి అధ్యక్షుడు ప్రకాశ్ రాథోడ్ కు బహుమతి ప్రదానం

కంగ్టి యువకుడికి అవార్డు

నారాయణఖేడ్, వెలుగు : ఖేడ్ నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతమైన కంగ్టి మండలం ముకుంద్ నాయక్ తండాకు చెందిన ప్రకాష్ రాథోడ్‌కు బహుజన సాహిత్య అకాడమి అవార్డు దక్కింది. ఆదివారం అకాడమి అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవార్డును ప్రదానం చేశారు.

ఖమ్మం, వైరా రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు



నీళ్లివ్వండి..

సాగు నీటి కోసం రోడ్డెక్కిన ఖమ్మ రైతులు

ఖమ్మం, వెలుగు: నాగార్జున సాగర్ నీటిని విడుదల చేయాలంటూ రైతులు రోడ్డెక్కారు. కొణిజెర్ల దగ్గర బోనకల్ బ్రాంచి కెనాల్ కు సాగునీటిని ఇవ్వాలంటూ చింతకాని, కొణిజెర్ల మండలాలకు చెందిన రైతులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఖమ్మం, వైరా మెయిన్‌రోడ్డుపై రెండు వైపులా ట్రాఫిక్ భారీగా స్తంభించింది. సాగర్ నీటిని మొదటి జోన్ వరకు మాత్రమే విడుదల చేయడంతో రెండో జోన్ పరిధిలోని మండలాల్లో రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఆరుతడి పంటలకైనా విడతల వారీగా నీళ్లివ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం నిర్వహించిన రాస్తారోకోతో రోడ్డుపై ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతుండడంతో పోలీసులు రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. అంతకు ముందు కొణిజర్లకు చెందిన ఓ రైతు ఆందోళన సందర్భంగా సొమ్మసిల్లి పడిపోయారు.



ఆందోళన చేస్తున్న రైతులు



సర్పంచ్ ‘రియల్’ దందా

- రియల్ ఎస్టేట్ భూములతో ఫుల్ ఆదాయం
- హైవేల దగ్గరున్న పంచాయతీలే టార్గెట్

నాగర్‌కర్నూల్, వెలుగు:

గ్రామ పంచాయతీ సర్పంచ్ అంటే ఊళ్లో లైట్లు, మంచి నీళ్లు, సీసీ రోడ్లు, మురుగు కాల్వల పనులే ఉంటాయని, పన్నుల వల్ల సర్పంచ్‌కి లాభం ఉంటుందని చాలామంది అనుకుంటుంటారు. కానీ ఆ పదవితో లక్షలు వెనకేసుకునే పంచాయతీలు చాలా ఉన్నాయి. అదెలా అనుకుంటున్నారా..? హైవే రోడ్ల పక్కన ఉన్న గ్రామాల్లో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ దందా అంతా సర్పంచ్‌లే నడిపిస్తుండడంతో ఆ ప్రాంతాల్లో పదవి దక్కించుకుంటే లక్షలు సంపాదించొచ్చని నాయకుల ఆలోచన. పంచాయతీ ఎన్నికల్లో రెండు, మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్న గ్రామాల్లోనే ఎక్కువగా రియల్ ఎస్టేట్ భూములు ఉన్నాయి. హైదరాబాద్-కల్వకుర్తి శ్రీశైలం హైవే, జడ్చర్ల-నాగర్ కర్నూల్ రహదారి, నాగర్‌కర్నూల్-కొల్లాపూర్-అచ్చంపేట రహదారి, కల్వకుర్తి -దేవరకొండ రహదారి, కల్వకుర్తి-జడ్చర్ల రహదారి, కల్వకుర్తి - నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారుల పక్కనున్న గ్రామాలు బంగారు గుడ్లు పెట్టే బాతులుగా మారాయి. ఈ హైవేల పక్కనున్న వ్యవసాయ పొలాలను ప్లాట్లుగా మార్చి జోరుగా వ్యాపారం చేస్తున్నారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర వినియోగానికై ముందుగా రెవెన్యూ శాఖ అనుమతి పొందాల్సి ఉంటుంది. అనంతరం వాణిజ్య అవసరాలకు వీలుగా డీటీసీపీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) అనుమతి పొందిన తర్వాత ప్లాట్లుగా విక్రయించడానికి అవకాశం ఉంటుంది. గ్రామ పంచాయతీలకు వెంచర్లకు లేఅవుట్ ఇచ్చే అధికారం లేకపోయినా నిన్న మొన్నటి దాకా అధికారంలో ఉన్న సర్పంచులు గ్రామ పంచాయతీ తీర్మానాలు కూడా లేకుండా విచ్చలవిడిగా ప్లాట్లకు అనుమతి ఇచ్చినట్టు ఆరోపణలున్నాయి. దాంతో లక్షలు వెనకేసుకున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో ప్రధాన రహదారుల పక్కన పదుల సంఖ్యలో గ్రామాలు ఉంటాయి. సమీప పట్టణాలు మున్సిపాలిటీలుగా మారడం, ప్లాట్ల లేఅవుట్ వెంచర్లకు డీటీసీపీ దరఖాస్తు చేస్తే 10 శాతం భూమి, 40 ఫీట్ల అంతర్గత రహదారులు, మురుగుకాల్వలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందులో ప్రధానంగా విలువైన భూమిని కోల్పోతామని డీటీసీపీకి వెళ్లకుండా గ్రామపంచాయతీలతో అనుమతితో పని కానిచేస్తున్నారు.

ఎకరాకు లక్ష...

వ్యవసాయ భూములను వ్యవసాయేతర వినియోగానికి అవసరమైన నిబంధనలు పాటించకుండానే గ్రామ పంచాయతీ తీర్మానాలతో (వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా) వెంచర్, లేఅవుట్‌లకు అనుమతి ఇచ్చిన ఘటనలున్నాయి. ఇందులో 10 శాతం బెటర్‌మెంట్ చార్జీలు చలాన్ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నా చదరపు అడుగుకు నామమాత్రంగా చెల్లించి 25 అడుగుల అంతర్గత రహదారులతో సరిపెట్టిన వెంచర్లున్నాయి. పాలమూరు పరిధిలోని కల్వకుర్తి, ఆమనగల్లు, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట వంటి మున్సిపాలిటీల పరిసర గ్రామ పంచాయతీల్లో ఈ దందా ఎక్కువగా ఉన్నట్టు సమాచారం. అక్రమ వెంచర్లు వేసిన వారి నుంచి ఎకరాకు రూ. లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. మండల కేంద్రాలకు సమీపంగా ఉండే గ్రామాల్లోనూ ఇదే దందా కొనసాగింది. ఈ తతంగం తెలిసిన సీనియర్ నేతలు ప్రస్తుత ఎన్నికల్లో పాత పాచికలు ప్రయోగిస్తున్నారు. లక్షల్లో వచ్చే ఆదాయం పోగొట్టుకోవడానికి ఇష్టం లేక వారే నేరుగా లేకపోతే తమ అనుచరులను సర్పంచ్ అభ్యర్థులుగా రంగంలో నిలబెట్టారు.



భక్తులతో యాదాద్రి కిటకిట

యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఒక్కరోజే 30 వేల మందికి పైగా స్వామివారిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. స్వామివారి దర్శనానికి సుమారు ఆరు గంటలు పట్టిందని భక్తులు తెలిపారు. నిత్య కల్యాణాల్లో ఎక్కువసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. - యాదాద్రి, వెలుగు



రోహింగ్యాలు పోతున్నరు

రోహింగ్యా ముస్లింలు ఆలోచనలో పడ్డారు. ఈరోజు కాకపోయినా రేపైనా తమ స్వదేశం మయన్మార్‌కు వెళ్లక తప్పదని గ్రహించారు. ఇప్పటికే వందల సంఖ్యలో బంగ్లాదేశ్ మీదుగా ఇంటిబాట పట్టారు. మరింత మంది మూట, ముల్లె సర్దుకుంటున్నారు. ఇండియన్ గవర్నమెంట్ రోహింగ్యాలను అక్రమ వలసదారులుగా భావిస్తోంది. వాళ్ల వల్ల దేశ భద్రతకు ప్రమాదం పొంచి ఉందని చెబుతోన్న నేపథ్యంలో తిరుగుపయనం అనివార్యమైంది. గతేడాది అక్టోబర్‌లో మన హోం మంత్రిత్వ శాఖ తొలిసారిగా ఏడుగురు రోహింగ్యాలను మణిపూర్ సరిహద్దుగుండా మయన్మార్‌కు పంపేసింది.

మురికివాడల్లో, రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో తాత్కాలిక గుడారాలను ఏర్పాటుచేసుకొని చిన్నగా ఇక్కడే సెటిలైపోవాలని చూస్తున్న రోహింగ్యాలను గుర్తించి, స్వదేశానికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని గవర్నమెంట్ స్థానిక అధికారులకు ఆర్డర్ వేసింది. దీంతో తమకు ఇక్కడ ఆశ్రయం దొరకటం కష్టమని రోహింగ్యాలకు అర్థమైంది. తాజాగా జనవరిలో ఐదుగురు సభ్యులు ఉన్న ఓ కుటుంబం ఇండియా నుంచి మయన్మార్‌కి చేరుకుంది. రోహింగ్యాలు మన దేశాన్ని వీడటం గత మూడు నెలల్లో ఇది రెండోసారి.
మయన్మార్‌లో కొన్నేళ్లుగా హింసకు గురైన ఈ ముస్లిం తెగ ప్రజలు తమ ప్రాణాలను దక్కించుకోవటానికి ప్రపంచంలోని వివిధ దేశాలకు పయనమయ్యారు. వాళ్లల్లో కొంత మంది మార్గ మధ్యంలో, సముద్రాల్లో, తలదాచుకునే చోటు కరువై, తినటానికి తిండిలేక ఆకలి చావులకు గురయ్యారు. వాళ్ల దుస్థితిపై ఐక్యరాజ్య సమితి (యూఎన్ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. రోహింగ్యాలు వేరే దేశాల్లో ఉండటానికి (లేదా) తిరిగి మయన్మార్‌కి రావటానికి అనువైన పరిస్థితులు లేకపోవటం పట్ల తీవ్ర ఆవేదన వెలిబుచ్చింది.
ఇండియాలో చాలా మంది తమను చంపటానికి కుట్రలు చేశారని రోహింగ్యా యూత్ లీడర్ మహ్మద్ అర్ఫాత్ ఆరోపించాడు. తమపై ఏకంగా 'కిల్ మూమెంట్'కే తెర తీయబోతున్నట్లు స్టేట్‌మెంట్లు ఇచ్చారని చెప్పుకొచ్చాడు. జమ్మూలో ఆరేళ్లపాటు భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివసించిన ఇతను గత అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌కి వెళ్లిపోయాడు. 'రోహింగ్యాలను గుర్తించండి, హతమార్చండి' అంటూ జమ్మూ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ పిలుపునిచ్చిందని తెలిపాడు.





'మేము మా దేశంలో ఇప్పటికే ఎన్నో కష్టాలు, నష్టాలు చూశాం. అందుకే, వేరే దేశంలో బతికేందుకు మాకు స్వేచ్ఛ కావాలి. అది ఎక్కడా దొరకట్లేదు. మయన్మార్‌లో మాదిరిగానే ఇతర దేశాల్లోనూ భయం భయంగానే గడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అలాంటప్పుడు ఇండియాలో ఉండటం దేనికి?' అని అర్ఫాత్ అసహనం వ్యక్తం చేశాడు. గత కొన్ని నెలలుగా తమలాంటివాళ్లు దాదాపు రెండు వేల మంది బంగ్లాదేశ్‌కి చేరుకున్నారని అతనితోపాటు మరో యువ నాయకుడు చెప్పాడు.
ఇండియా నుంచి ఇక్కడికి చేరుకుంటున్న రోహింగ్యాలంతా క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారని, వారికి సాయం అందుతోందని బంగ్లాదేశ్‌లోని ఐక్యరాజ్య సమితి హైకమిషనర్ ఫర్ రెఫ్యూజీ (యూఎన్‌హెచ్‌సీఆర్) తెలిపారు. ప్రస్తుతం మయన్మార్ నుంచి కూడా కొద్ది మంది బంగ్లాదేశ్‌కి చేరుకుంటున్నారని, ఈ నెలలో ఎక్కువ మంది ఇండియా నుంచే వచ్చారని చెప్పారు. ఇండియాలోని రోహింగ్యాలకు యూఎన్‌హెచ్‌సీఆర్ ఇచ్చిన గుర్తింపు పత్రాలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు.
రోహింగ్యాలను రిఫౌల్‌మెంట్ నిబంధనలకు విరుద్ధంగా వెనక్కి పంపారన్న సమితి వాదనను ఇండియా ఖండించింది (శరణార్థులను ప్రమాదకర పరిస్థితులున్న దేశానికి పంపటాన్ని రిఫౌల్‌మెంట్ అంటారు). అయితే, ఇండియాలోని కొందరు రోహింగ్యాలు మాత్రం మయన్మార్ వెళ్లటానికి ఇష్టపడట్లేదు. 'మావాళ్లు చాలా మంది అక్కడికి వెళ్లిపోయి ఉండొచ్చు. బహుశా మా బంధువులను కూడా భవిష్యత్‌లో ఇండియా నుంచి బహిష్కరించొచ్చు. కానీ, మేము మా దేశంలోకి ప్రవేశించటం ఇప్పటికీ సేఫ్ కాదు' అంటున్నారు.
'నేను నాకు అవసరం ఉన్నంత కాలం ఇక్కడే ఉంటా' అని జమ్మూలోని ఓ ఆటో షోరూంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న సహిదుల్లా తేల్చిచెప్పాడు. జాతి విధ్వంసం ఉద్దేశంతో మయన్మార్ ఆర్మీ 2017లో రోహింగ్యాలపై సామూహిక హత్యలకు పాల్పడినట్లు సమితి 2018 ఆగస్టులో తెలిపింది. ఆ దేశ సైన్యం ఈ మేరకు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. 7 లక్షల మందికి పైగా రోహింగ్యాలు బంగ్లాదేశ్ చుట్టుపక్కల దేశాలకు ప్రాణభయంతో పారిపోయారని ఆరోపించింది.
సమితి రిపోర్ట్‌ని మయన్మార్ ఖండించింది. ముస్లిం మిలిటెంట్లు సెక్యూరిటీ పోస్టులపై ఎటాక్‌లకు దిగటంతో చొరబాట్లను అడ్డుకోవటానికే మిలటరీ ఆపరేషన్ ప్రారంభించామని స్పష్టం చేసింది.

– కృష్ణా ఎన్.దాస్ ('ది వైర్' సౌజన్యంతో)

ఇండియాలోని రోహింగ్యాల డేటా

మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటుచేసుకున్న క్యాంపుల్లో సుమారు 40 వేల మంది రోహింగ్యాలు ఉన్నట్లు ప్రభుత్వం అంచనా వేస్తోంది. ముఖ్యంగా జాతీయ రాజధాని ఢిల్లీ, జమ్మూ, హైదరాబాద్‌లలో ఈ శిబిరాలు ఉన్నాయి. ఇందులో కేవలం 16,500 మంది మాత్రమే యూఎన్‌హెచ్‌సీఆర్ గుర్తింపు పత్రాలను కలిగి ఉన్నారు. ఈ ఐడెంటిటీ కార్డులు ఉండటం వల్ల వేధింపులు, అరెస్టులు, నిర్బంధం, బహిష్కరణ వంటివి ఎదురుకావు.



ఆపరేషన్ మతలబు ఎంపీ సీట్లేనా?

కర్నాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకొని సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోయాలన్న బీజేపీ ఆపరేషన్ కమల బెడిసికొట్టినట్లుంది. కాంగ్రెస్ నుంచి దాదాపు 16 మంది ఎమ్మెల్యేలను తమ బుట్టలో వేసుకోవాలన్న బీజేపీ ప్రయత్నం విఫలమైంది. ఆపరేషన్ కమల భయంతో అప్రమత్తమైన కాంగ్రెస్ పార్టీ తన ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు వారిని రిసార్ట్‌లకు తరలించింది.

ఆపరేషన్ కమల ఇప్పుడే ఎందుకు?

వచ్చే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్ కూటమిగా పోటీ చేస్తే బీజేపీ ఉన్న సీట్లు కాపాడుకోలేని పరిస్థితి వస్తుందని, మైసూరు ప్రాంతంలో మరీ కష్టమని యడ్యూరప్ప బీజేపీ అధిష్ఠానానికి చెప్పినట్లు సమాచారం. లోక్ సభ ఎన్నికలు వచ్చేలోగా కాంగ్రెస్, జేడీఎస్ సర్కారును పడగొడితే తప్ప తమకు మనుగడ లేదని వారిని సముదాయించారు. అయితే కాస్తా రెండుకు పడిపోవడంతో, రమేశ్ జారకిహొళి కాంగ్రెస్ హైకమాండ్‌తో రాజీపడటంతో ఆపరేషన్ కమల బెడిసికొట్టింది.

కాంగ్రెస్ రివర్స్ గేమ్

బీజేపీ ఆపరేషన్ కమలకు ప్రతిగా ఆపరేషన్ హస్తం చేపట్టాలని కాంగ్రెస్ నేతలు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఐదుగురు బీజేపీ ఎమ్మెల్యేలను తమవైపు లాక్కునేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. బెంగళూరుకు చెందిన ఎమ్మెల్యే, ఓల్డ్ మైసూర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు, చిత్రదుర్గకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకునేందుకు, వారికి మంత్రి పదవులు, ఇతర హామీలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ బాధ్యతను మంత్రి డీకే శివకుమార్‌కు అప్పగించారు.

పార్టీల బలాబలాలు

224 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ శాసనసభలో జేడీఎస్, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వానికి 118 (కాంగ్రెస్ 80, జేడీఎస్ 37, బీఎస్పీ 1), బీజేపీకి 104 మంది సభ్యులు ఉన్నారు. ఇద్దరు ఇండిపెండెంట్లు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నారు. ప్రభుత్వానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 113. ఏడు నెలల జేడీఎస్ , కాంగ్రెస్ సంకీర్ణ సర్కారు పరిస్థితి చేయిదాటిపోకుండా చూసుకోవాల్సిన అవసరమైతే ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.







ఎన్నికల ముందు ఇలా చేస్తే పార్టీకే నష్టమని బీజేపీలోని కొందరు వ్యతిరేకించారు. మొదట యడ్యూరప్ప ఆత్మవిశ్వాసం చూసి ఓకే చెప్పిన బీజేపీ హైకమాండ్ తర్వాత పరిణామాలను గుర్తించి ఆపరేషన్ కమలకు గుడ్ బై చెప్పాలని సూచించారు. బీజేపీ తలుపు తట్టిన కాంగ్రెస్ అసమ్మతి ఎమ్మెల్యేల్లో బలమైన నాయకుడు రమేశ్ జారకిహొళి ఒక్కరే, మిగతా వారు మళ్లీ పోటీ చేస్తే గెలిచే అవకాశాలు కూడా తక్కువే. దాదాపు 20 మందికిపైగా ఉన్న అసమ్మతి ఎమ్మెల్యేల సంఖ్య

– సాగర్. గార్లదిన్నె


ఏమన్నారంటే



బీజేపీ కాదు మేమే కడతాం

కుంభమేళా ముగిసిన వెంటనే సంత్, సాధువులంతా అయోధ్య వెళ్లి ఆలయ నిర్మాణం మొదలుపెడతాం. బీజేపీ గుడి కట్టదు కాబట్టి మేమే కడతాం.

– నరేంద్రగిరి, అఖాడా పరిషత్ అధ్యక్షుడు.



అప్పట్లో అదే నా హాబీ

టెన్ ఇయర్స్ చాలెంజ్‌లో భాగంగా మీకో గమ్మత్తైన ముచ్చట చెబుతా. అమ్మకు తెలియకుండా ఆమె చీరలు కట్టుకుని ఫొటోలు దిగేదాన్ని. అప్పట్లో అదే నా హాబీ.

– అనుపమ పరమేశ్వరన్, నటి.



ఏది మాట్లాడినా ఇబ్బందే!

రాహులే పీఎం కావాలన్నది తమిళుల కోరిక. బెంగాలీలు ఏమనుకుంటున్నారో తెలీదు కాబట్టి నిన్నటి కోల్‌కతా మీటింగ్‌లో ఆ మాట చెప్పలేదు.

– స్టాలిన్, డీఎంకే ప్రెసిడెంట్.

మనది వ్యవసాయ ప్రధాన దేశం. ఎక్కువమంది జీవికకు అదే ఆధారం. దాని గురించిన ఎరుక చాలా ముఖ్యం. గ్రామీణ, వ్యవసాయ రంగంలో క్రైసిస్ ఎందుకుంది, దానికి పరిష్కారమేంది అన్న విషయం తెల్వాలంటే, చిన్నప్పటి నుంచి దానికి సంబంధించిన సోయి పిల్లల్ల ఉండాలె. ఆ సోయి ఉండాలంటే అగ్రికల్చర్‌కు సంబంధించిన ఇష్యూస్ పాఠాల్లో ఉండాలె.



సాగుబడి పాఠాలు కావాలె

రైతుల మీద లీడర్లకు మస్తు ప్రేమ పెరుగుతున్నది. రీజన్ ఏమన్నగాని, ఇదైతే మంచి డెవలప్‌మెంటే. దేశానికి తిండివెట్టే సెక్టార్ మీద పొలిటికల్ లీడర్ల ఫోకస్ లేకనే రైతుల సమస్యలు ఎక్కువైనయి. అట్లని పురాగ పట్టించుకుంటలేరని కూడా అనలేం. రుణాల మాఫీ, సబ్సిడీలు, ఉచిత విద్యుత్, గిట్టుబాటు ధరలు, మద్దతు ధరలు... ఏండ్ల నుంచి అధికారంలో ఉన్నోళ్లు ఏదో ఒకటి జేస్తున్నరు. వీటితోని రైతుల ప్రాబ్లమ్స్ సాల్వ్ అయితలేవ్. బాధలు అట్లనే ఉన్నయి. ఏండ్ల సంది ఆత్మహత్యలు పెరుగుతనే ఉన్నయి. అగ్రికల్చర్ సెక్టార్‌ల సంక్షోభం నడుస్తనే ఉంది. ఈ స్కీమ్‌లు వస్తనే ఉన్నయ్. రైతులకు హిమ్మత్ ఇచ్చే లాంగ్‌టర్మ్ ప్లానే లేదు.
మన దేశంలో ఇప్పటిగ్గూడ 70 శాతం మంది అగ్రికల్చర్‌మీదనే బతుకుతున్నరు. లాల్‌బహదూర్ శాస్త్రి పీఎం అయిన కొత్తల మనకు పాకిస్తాన్‌తో వార్ అయింది. అప్పట్లో దేశంలో ఆహారం కొరత కూడా ఉంది. దేశం మంచిగుండాలంటే జవాన్, కిసాన్ చానా ఇంపార్టెంట్ అని వాళ్లను మోటివేట్ చేసేందుకు శాస్త్రిజీ 'జై జవాన్, జై కిసాన్' అనే స్లోగన్ ఇచ్చిండు . 1991 నుంచి మన ఎకనామీ మోడల్ మారింది. వ్యవసాయం మీద ఫోకస్ తగ్గింది. రైతుల పరేషాన్ ఎక్కువైంది.
ఈ మధ్యనే తెలంగాణ సిఎం కేసిఆర్ కొంచెం కొత్త ఆలోచనజేసి అప్పులు మాఫీ చేసే బదలు రైతుబంధు స్కీమ్ తెచ్చిండు. ఈ స్కీమ్ వచ్చినంక అందరి నజర్ దానిమీద వడ్డది. వేరే రాష్ట్రాల్ల కూడా ఇటువంటి స్కీమ్స్ తెచ్చే ప్రయత్నం జేస్తున్నరు. పీఎం మోడీ సుత ఇటువంటి స్కీమే ఒకటి రెండు రోజుల్ల అనౌన్స్ జేసే చాన్స్ ఉన్నదని అంటున్నరు. దేశంల పాలిటిక్స్ రైతు సెంట్రిక్‌గా మారడం మంచిదే. అయితే ఓట్ల కోసమే రైతులను, పల్లెల్ను పట్టించుకోవాలన్న ఆలోచనే మంచిగ లేదు. రైతుబంధు కూడా ఇంకా మెరుగుపడాలె. దున్నెటోనికి పైసలియ్యాల్నా లేక భూమి ఉన్నోనికా అన్నది తేలాలె. వ్యవసాయం జేయకున్నా భూమి ఉన్నోళ్లకు సాయం దొరుకుతున్నది. కౌలుకుదీసుకొని వ్యవసాయం జేసెటోళ్లకు పైసా సాయం అందుతలేదు.
మెజార్టీ ప్రజల జీవితం వ్యవసాయం చుట్టూ అల్లుకొని ఉంటుంది. మనం తినే తిండికి, పండించే పంటకు, చేసుకునే పండుగలకు, జీవించే పద్ధతికి మధ్య సంబంధం ఉంటుంది. ఇదే జీవితం. దాని గురించిన ఎరుక చాలా ముఖ్యం. చిన్నప్పటి నుంచి దానికి సంబంధించిన సోయి పిల్లల్ల ఉండాలె. ఆ సోయి ఉండాలంటే అగ్రికల్చర్‌కు సంబంధించిన ఇష్యూస్ పాఠాల్లో ఉండాలె. మన చదువుల ఎక్కడా అగ్రికల్చర్‌కు సంబంధించిన జోలి ఉండదు. పెద్ద తరగతుల్ల స్పెషల్‌గా అగ్రికల్చర్ కోర్స్ చదువుకోవాలె తప్ప ప్రైమరీ ఎడ్యుకేషన్, హయ్యర్ ఎడ్యుకేషన్‌ల ఒక్క లెసన్ కూడా ఉండదు. ఈ చదువులతోనే రియల్ లైఫ్ ప్రాబ్లమ్స్ పిల్లలకు ఎర్కయితలేవు. ఎడ్యుకేషన్‌లో మన లైఫే ఉండదు. మరి లైఫ్‌లో వచ్చే ప్రాబ్లమ్స్‌ను ఎడ్యుకేషన్ ఎట్ల సాల్వ్ చేస్తది ? వ్యవసాయానికి సంబంధించిన అంశాలు కరికులంలో భాగం కావాలె. సొసైటీలో ఉన్న తిండి అలవాట్లు, జమానా నుంచి ఉన్న సాగు పద్ధతులు, పండించే పంటలు, వాటిని మార్కెట్ చేసే విధానం, సాగుమీద చేసే ఖర్చులు, వచ్చే లాభం, వందల ఏళ్ల నుంచి అగ్రికల్చర్ బేస్డ్ గ్రామీణ వ్యవస్థ ఎట్ల నిలబడింది.. ఈ విషయాలపై పాఠాలుండాలె. ఇంటర్‌మీడియెట్ లెవల్‌కు వచ్చే సరికే రూరల్ ఎకనామీ గురించి బేసిక్ విషయాలు పిల్లలకు తెల్వాలె. ఏ కోర్స్ చదివినా రైతుల జీవితాల మీద బేసిక్ ఐడియా ఉండాలె. అగ్రికల్చర్, రూరల్ ఎకనామీ వల్లనే గత ఇరువై అయిదేళ్లల్ల వచ్చిన అనేక గ్లోబల్ ఫైనాన్షియల్ సంక్షోభాల నుంచి ఇండియా సేఫ్‌గా బయటవడ్డది. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి వల్ల చిన్నచిన్న కంపెనీలు మూతవడ్డా లేబర్ మళ్లీ ఊళ్లకుపోయి బతుకుతెరువు జూసుకున్నరు. పెద్ద పెద్ద ఫైనాన్షియల్ షాక్‌లను దిగమింగే ఇన్‌బిల్ట్ మెకానిజం మన రూరల్ ఇండియా. దాన్ని నాశనం జేస్తే రైతులకు బతుకుదెరువు లేకుండా పోవుడు గాదు, మన బతుకులే ఆగమైతయ్. ఆ విషయం మన పాఠాలల్లనే ఉండాలె.



– మల్యాల మారుతిరావు, జర్నలిస్ట్

మమతా బెనర్జీ గురి ఢిల్లీనే!



మమతా బెనర్జీ అనుకున్న పని చేశారు. 'యునైటెడ్ ఇండియా' పేరుతో కోల్‌కతాలో పెద్ద బహిరంగ సభ నిర్వహించి సత్తా చాటారు. తాను పశ్చిమబెంగాల్‌కే పరిమితమైపోనని, ప్రధాని పదవి రేసులో ఉన్నానని సంకేతాలు పంపారు. ఇంతకు ముందు కూడా బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఒక వేదికపైకొచ్చాయి. ఈ దఫా మీటింగ్‌కు కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ రాకపోవడం, బీఎస్పీ చీఫ్ మాయవతి తన ప్రతినిధిని పంపడంతో వేదికపై మమతా బెనర్జీ ఒక్కరే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అయ్యారు. బీజేపీ, కాంగ్రెస్‌కు సమాన దూరం మెయింటైన్ చేస్తున్న ఒకరిద్దరు మినహా దాదాపు నాయకులంతా సభ కు హాజరయ్యారు. ఎన్నికలు తద్వారా కాబోయే ప్రధాని రాహుల్ గాంధీనే అంటూ కరుణానిధి విగ్రహావిష్కరణ సభలో డీఎంకే చీఫ్ స్టాలిన్ చేసిన ప్రతిపాదనపై

ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రధాని ఎవరన్నది ఆలోచిద్దామని, ముందు బీజేపీ ని అధికారం నుంచి దించేయడమే మన ముందున్న టార్గెట్అని మమత క్లియర్‌గా ప్రసంగించారు

నీళ్లు చల్లారు. ప్రధాని కావడానికి లోక్ సభ లో సంఖ్యాబలంతోపాటు మిగతా మిత్రపక్షాల ఆమోదం కూడా తప్పనిసరి అని చెప్పీ చెప్పకుండా చెప్పారు. మమత దక్షతకు నిదర్శనంగా యునైటెడ్ ఇండియా ర్యాలీ నిలుస్తుందనడలో ఎలాంటి సందేహం లేదు.

ఈసారి మిషన్ 42

కేవలం పోరాటాలు, ఆందోళనలే కాదు, ప్రభుత్వాలు ఏర్పాటు చేయడానికి అవసరమైన సీట్లు సాధించడం లో కూడా మమతా బెనర్జీ దిట్ట. 2014 లోక్ సభ ఎన్నికల్లో మొత్తం 42 సీట్లలో 34 చోట్ల తృణమూల్ కాంగ్రెస్ ను గెలిపించారు. ఈసారి మొత్తం 42 సీట్లను టార్గెట్‌గా పెట్టుకున్నారు. మిషన్ 42కు ప్లాన్ రెడీ చేశారు. మమతా బెనర్జీ ఎత్తుగడలు ఫలిస్తే 42 సీట్లు టీఎంసీ ఖాతాలో పడటం పెద్ద కష్టం కాదంటున్నారు రాజకీయ విశ్లేషకులు. మమతా బెనర్జీ చాలా కాలం పాటు కాంగ్రెస్ కు దగ్గరగా ఉన్నారు. కాంగ్రెస్ కూటమిలో ఉన్నా అంశాల వారీగానే మద్దతు ఇచ్చేవారు. ఏ అంశంపైన అయినా విభేదిస్తే అది స్పష్టం చేసేవారు. పశ్చిమ బెంగాల్ ప్రయోజనాలు ఆమెకు టాప్ ప్రయారిటీ. 'జీ హుజూర్' కల్చర్ కు ఆమె చాలా దూరం. దేశంలోని ప్రాంతీయ పార్టీల అధినేతలందరితో ఆమెకు మంచి దోస్తానా ఉంది. అందరూ ఆమెను ఎంతో గౌరవిస్తారు. ఫైర్ బ్రాండ్ అంటూ ప్రేమగా పిలుచుకుంటారు. ఎన్నికల తర్వాత సంభవించే అనేక పరిణామాల్లో ప్రధాని పదవికి మమత పేరు వస్తే మాయావతి లాంటి ఒకరిద్దరు మినహా ఆమెను వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీ లీడర్లు ఎవరూ ఉండొకపోవచ్చు. అందరికీ ఆమోదయోగ్యమైన నాయకురాలు ఆమె. ప్రధాని పదవికి నెహ్రూ - గాంధీ కుటుంబం నుంచి కాకుండా బయటి వ్యక్తులకు మద్దతు ఇవ్వాలన్న ఆలోచన కూడా చాలా మంది ప్రాంతీయపార్టీల నాయకులకు ఉంది. ఈ ఆలోచన వర్క్ అవుట్ అయితే మమత పేరు పరిశీలనకు రావడం ఖాయం. ఏమైనా కోల్ కతా ర్యాలీని సక్సెస్ చేసి ప్రధాని కుర్చీ మీద మమతా బెనర్జీ దస్తీ వేశారు.

– ఎస్. అబ్దుల్ ఖాలిక్

టాకీస్

ప్రభాత వెలుగు
సోమవారం | హైదరాబాద్
21.01.2019
www.v6velugu.com

Follow:
v6velugu



మండే ఎండల్లో మహేశ్?

స్టార్ హీరోల సినిమాలు ఎప్పుడెప్పుడు విడుదలవుతాయా అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. మహేశ్ ఫ్యాన్స్ కూడా అలాగే చూస్తున్నారు. సుమారు సంవత్సరం క్రితం వచ్చిన 'భరత్ అనే నేను' తర్వాత మహేశ్ సినిమాలేవీ విడుదల కాలేదు. అందుకే 'మహర్షి' మీదే అందరి దృష్టీ ఉంది. దాంతో వంశీ పైడిపల్లి కూడా చిత్రీకరణ వేగవంతం చేశాడట. వేసవిలో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేయాలనుకుంటున్నారని, ఏప్రిల్ 24 రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. సమ్మర్ హాలీడేస్ కాబట్టి, బుధవారం నాడు విడుదల చేస్తే లాంగ్ వీకెండ్ కలిసి వస్తుందని నిర్మాతల్లో ఒకరైన దిల్ రాజు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారికంగా ఇంకా ప్రకటించాల్సి ఉంది. గత ఏడాది ఇదే సమయంలో విడుదలయిన 'భరత్ అనే నేను' భారీ విజయాన్ని అందుకుంది. 'మహర్షి' ఆ టైమ్‌తో పాటు ఆ సక్సెస్‌ని కూడా రిపీట్ చేస్తాడేమో చూద్దాం.


ఫొటో ఫీస్ట్



దేవకన్యలు తెల్లటి దుస్తులు వేసుకుని, ఎక్కడో స్వర్గంలో ఉంటారని అంటారు. కానీ కృతీసనన్ పోస్ట్ చేసిన ఈ ఫొటో చూస్తే ఏమనిపిస్తోంది? నీలిరంగు దుస్తులు వేసుకున్న దేవకన్య నడి రోడ్డుపై నడయాడుతున్నట్టుగా లేదూ!

అందరి కళ్లూ ఆమె పైనే

ఓ పెద్ద స్టార్‌కి పిల్లలుగా పుట్టడం వల్ల ఇండస్ట్రీలోకి ఈజీగా ఎంట్రీ దొరుకుతుంది. కానీ అక్కడ్నుంచి నెట్టుకు రావడం మాత్రం కత్తిమీద సామే. ఆ విషయం జాన్వీ కపూర్‌ని చూస్తే అర్థమవుతుంది. ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు మీడియా కళ్లన్నీ జాన్వి మీదే ఉన్నాయి. ఆమె ఏం చేసినా అందరూ అబ్జర్వ్ చేస్తున్నారు. ప్రతి పనినీ శ్రీదేవితో పోల్చి చూస్తున్నారు. మొదటి సినిమాకే వాళ్లమ్మలో ఉండే గ్రేస్ లేదు, ఆమె చేసినదాంట్లో సగం కూడా చేయలేకపోయింది అంటూ చాలా కామెంట్లు వచ్చాయి. డ్రెస్సింగ్, మేకప్, నడక, నడత... అన్నింట్లోనూ అమ్మతో పోల్చడమే. ఇబ్బందిగా లేదా అని అడిగితే... 'అమ్మవల్లే ఇక్కడున్నాను. ఏం చేసినా అది అమ్మ నేర్పిందే. కాకపోతే ఇక్కడ్నుంచి నా దారి నేనే వేసుకోవాలి, నన్ను నేను మలచుకోవాలి' అంటూ కాన్ఫిడెంట్‌గా చెబుతోంది. దానికితోడు రీసెంట్‌గా ఎంట్రీ ఇచ్చిన సైఫ్ కూతురు సారాతో కూడా పోల్చి మాట్లాడుతున్నారు జాన్విని. దాన్ని కూడా జాగ్రత్తగానే డీల్ చేస్తోంది. అయితే 'శ్రీదేవి బంగ్లా' వివాదం గురించి ఒకరు అడిగినప్పుడు మాత్రం కాస్త డిస్టర్బ్ అయ్యింది. కోపంతోనో, బాధతోనో తెలియదు కానీ అక్కడ్నుంచి మౌనంగా వెళ్లిపోయింది. శ్రీదేవి జీవితం ఆధారంగా ఆ సినిమా తెరకెక్కుతోందంటూ ఆ టీమ్‌పై బోనీ కేసు పెట్టడం తెలిసిందే. కానీ ఆ విషయాన్ని జాన్విని అడగాల్సిన అవసరం లేదనే చెప్పాలి. ఇప్పుడే కెరీర్ స్టార్ట్ చేసింది. అమ్మని కోల్పోయిన బాధలో ఉంది. అలాంటి పిల్లని ఇన్ని విషయాల్లో టార్గెట్ చేసి విసిగించడం ఏంటి అంటూ కొందరు సోషల్ మీడియాలో గుస్సా అవుతున్నారు. నిజమేగా మరి.




అందుకే ఒప్పుకున్నా

ఆ చితూచి పాత్రలు ఎంచుకునే విద్యాబాలన్ ఏ సినిమాకీ ఓ పట్టాన ఓకే చెప్పదని అంటారు. ఒక్కసారి ఒప్పుకుందంటే మాత్రం ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేసేస్తుంది. రీసెంట్‌గా ఎన్టీయార్ బయోపిక్‌లో చేసిన బసవతారకం పాత్రే అందుకు ఒక ఉదాహరణ. ఈ సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన విద్య... 'పింక్' రీమేక్‌తో తమిళంలో కూడా అడుగు పెడుతోంది. అజిత్ హీరోగా వినోద్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో ఓ ముఖ్య పాత్రను పోషిస్తోందామె. నిజానికి హిందీలో అలాంటి పాత్ర లేకపోయినా తమిళంలో సృష్టించారు. దీనికి విద్య ఎస్ చెప్పడానికి కారణం బోనీ కపూరట. ఒక ముఖ్యమైన పాత్ర ఉంది, అది మీరే చేయాలని బోనీ రిక్వెస్ట్ చేయడం వల్లే ఒప్పుకున్నాను అంటోంది విద్య. అంతేకాదు... తనకు తగిన పాత్రలు వస్తే ఇక దక్షిణాదిన కూడా కంటిన్యూ అవుతానంటోంది. విద్యలాంటి నటి అంత ఆఫర్ ఇస్తే కాదంటారా మన దర్శకులు!




గప్‌చుప్

నాగార్జున కెరీర్‌లోని బెస్ట్ చిత్రాల్లో 'మన్మథుడు' ఒకటి. ఆ సినిమాకి సీక్వెల్ తీసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న వార్తలు కొద్ది రోజులుగా వినిపిస్తూనే ఉన్నాయి. రాహుల్ రవీంద్రన్ చెప్పిన కథ నాగ్‌కి నచ్చిందని, గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కూడా అన్నారు. అయితే ఆ తర్వాత నాగార్జున కాదు, నాగచైతన్య చేస్తాడు అంటూ మరో వార్త పుట్టుకొచ్చింది. కానీ ఇప్పుడేమో నాగ్ చేస్తున్నాడని, ఆల్రెడీ మొదటి షెడ్యూల్‌ను పోర్చుగల్‌లో ప్లాన్ చేశారని మరో కొత్త వార్త షికార్లు చేస్తోంది. ఇందులో ఏది నిజమో ఇప్పటికైనా ఎవరో ఒకరు కన్‌ఫర్మ్ చేస్తే కానీ ఈ కన్‌ఫ్యూజన్ తీరేలా లేదు.



మణికర్ణికకి మరో కష్టం



కంగనా రనౌత్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'మణికర్ణిక'. మొదటి నుంచి వివిధ రకాల వివాదాలతో పోరాడుతోన్న ఈ సినిమా మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఈ చిత్ర నిర్మాత కమల్ జైన్ గుండెపోటుతో ఆస్పత్రిలో చేరారని వార్త రావడంతో అందరూ షాకయ్యారు. ఈ నెల 25న సినిమా విడుదల కానుండటంతో ఆ పనుల్లో బిజీగా ఉన్నారు టీమ్. అంతలోనే కమల్ ఆస్పత్రి పాలవడంతో వాళ్లు కంగారు పడ్డారు. దాంతో ఆస్పత్రి నుంచి ఒక సందేశం పంపారు కమల్. "రెండేళ్ల పాటు మనమంతా ఎంతో శ్రమించి ఈ చిత్రాన్ని నిర్మించాం. ఈ సమయంలో నేనిలాంటి పరిస్థితిలో ఉండకూడదు. కానీ ఉన్నాను.. తప్పలేదు. తొందర్లోనే కోలుకుని వస్తాను కంగారు పడకండి. సక్సెస్‌ని ఎంజాయ్ చేయండి." అంటూ సోషల్ మీడియాలో సందేశాన్ని పోస్ట్ చేశారు కమల్. అయితే కాసేపటి తర్వాత కమల్‌కి ఎంతో సన్నిహితురాలైన కంగనా మీడియా ముందుకొచ్చింది. కమల్ హాస్పిటలైజ్ అయ్యింది గుండెపోటుతో కాదని, లంగ్ ఇన్ఫెక్షన్‌తోనని, ఇప్పుడు బానే ఉన్నారని క్లారిటీ ఇచ్చింది.

ఆన్ లొకేషన్



వరుణ్ ధావన్, ఆలియాభట్, సోనాక్షీ సిన్హా, ఆదిత్యరాయ్ కపూర్, సంజయ్ దత్, మాధురీ దీక్షిత్ తదితర భారీ తారాగణంతో తెరకెక్కుతోన్న హిందీ చిత్రం 'కళంక్'. అభిషేక్ వర్మన్ దర్శకుడు. ఆ మూవీ షూటింగ్ చివరి రోజు లొకేషన్లో అభిషేక్, ఆదిత్య రాయ్ కపూర్‌లతో ఆలియా.

అదిరింది అప్పూ


ఈ నెల 20న ప్రారంభమైన 8వ కోల్‌కతా అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలలో 'అప్పూ' చిత్రం ప్రదర్శనకు ఎంపికైంది. ఈ సందర్భంగా దర్శకుడు కె.మోహన్ మాట్లాడుతూ... "20 నుంచి 27వ తేదీ వరకూ తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఈ చిత్రోత్సవాల్లో 22న మా చిత్రం ప్రదర్శితం కానుంది. 2017లో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైన మా చిత్రం ఇప్పుడు మరో ప్రతిష్టాత్మక ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ముప్పై అయిదు దేశాల నుంచి రెండొందల చిత్రాలు వస్తే... అందులో 'అప్పూ' ఉండటం గర్వంగా ఉంది'' అన్నారు. ఎనిమిదేళ్ల బాలుడైన అప్పూకి ఏనుగుని చూడాలని కోరిక. కానీ తన కోరిక తీర్చేంత తీరిక తల్లిదండ్రులకి ఉండదు. దాంతో అప్పూ ఏం చేశాడు, ఎలాంటి ఇబ్బందుల్లో పడ్డాడు, చివరికి ఎలా ఇంటికి చేరుకున్నాడనే కథాంశంతో రూపొందిన చిత్రమిది. మాస్టర్ సాయి శ్రీవంత్ (యశస్వి) టైటిల్ రోల్ పోషించాడు. కె.లక్ష్మి సమర్పణలో



మోహన్ మూవీ మేకర్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందింది. జాకీ, లోహిత్ కుమార్, ప్రజ్ఞ, బిందు, బండ జ్యోతి, జె.వి.ఆర్, జ్వాలా చక్రవర్తి ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. మిగతా భాషలతో పోలిస్తే తెలుగులో బాలల చిత్రాలు అంతగా రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆ విమర్శలకు చెక్ పెట్టేలా ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలి.

ట్విటర్ టాక్

మొఘలులు వచ్చేవరకూ భారతదేశంలో శాకాహారం మాత్రమే ఉంది, బిర్యానీ విదేశీ వంటకం... ఇలా ఫుడ్ విషయంలో ఉన్న అపోహల్ని తొలగిస్తూ రాసిన ఒక ఆర్టికల్ చదివాక సిద్ధార్థ ఇలా స్పందించాడు.



"ప్రతి ఒక్కరూ అది తినండి, ఇది తినకండి, ఏం తింటే మంచిది, ఏం తింటే కాదు అంటూ తెగ సలహాలిచ్చేస్తున్నారు. ఇవేవీ పట్టించుకోవద్దు. అసలు భారతదేశం పలు రకాల ఆహారానికి పుట్టిల్లు. ఇక్కడ ఎన్నో రకాల రుచికరమైన ఆహారం ఉంది. ఆనందంగా తినండి. ఇది మన ఫుడ్ అని గర్వపడండి."

స్పీడ్ పెరిగింది



ఎప్పుడో 1995లో నటించడం మొదలుపెట్టాడు అరుణ్ విజయ్. కానీ బ్రేక్ రావడానికి చాలా కాలమే పట్టింది. హీరోగా ప్రయత్నాలు చేసినా అదృష్టం కలిసి రాలేదు. దాంతో ఇతర హీరోలతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నాడు. రకరకాల పాత్రలు చేశాడు. చివరికి విలన్‌గానూ ట్రై చేశాడు. ఎట్టకేలకి అతడి ప్రయత్నాలకు తగిన ఫలితం వచ్చింది. మెల్లగా అతని కెరీర్ స్పీడందుకుంది. ఎంతవాడు గాని, క్రైమ్ 23, జవాన్ వంటి కొన్ని డబ్బింగ్ సినిమాల ద్వారాను, 'బ్రూస్లీ'లో నెగిటివ్ రోల్‌తోను తెలుగువారికి దగ్గరయ్యాడు విజయ్. ప్రస్తుతం ఒకేసారి నాలుగైదు సినిమాలు చేస్తున్నాడు. వాటిలో 'సాహో' ఒకటి. ప్రభాస్ హీరోగా తెరకెక్కుతోన్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్లో నటిస్తున్నందుకు చాలా సంతోషపడుతున్నాడు అరుణ్. 'సాహో' షూటింగ్‌లో ఉన్నానంటూ రీసెంట్‌గా సోషల్ మీడియాలో ఆనందంగా పోస్ట్ చేశాడు.



కాల్షీట్లు ఖాళీ లేవు

దశాబ్ద కాలానికి పైగా తెలుగు సినిమా పరిశ్రమలో హీరోయిన్‌గా రాణిస్తోంది కాజల్ అగర్వాల్. 'లక్ష్మీ కళ్యాణం'తో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఆమె... మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పని లేకుండా తన కెరీర్ గ్రాఫ్‌ని డిజైన్ చేసుకుంది. తెలుగు, తమిళంతో పాటు హిందీలో కూడా అప్పుడప్పుడూ మెరుస్తోంది. అన్ని భాషల్లోనూ కలిపి సంవత్సరానికి కనీసం మూడు నాలుగన్నా సినిమాలు చేస్తూ వస్తోన్న కాజల్‌కి ఈ యేడు మరింత బాగుందనే చెప్పాలి. ఎందుకంటే ఇప్పటికే తమిళంలో ప్యారిస్ ప్యారిస్, కోమలి వంటి సినిమాలు చేస్తోంది. తాజాగా కమల్, శంకర్‌ల 'ఇండియన్ 2'లో కూడా హీరోయిన్‌గా సెలెక్టయ్యింది. ఇటు చూస్తే తెలుగులో కూడా బిజీబిజీగా ఉంది. ఇప్పటికే బెల్లంకొండ శ్రీనివాస్‌తో, తేజ దర్శకత్వంలో 'సీత'గా రానుంది. శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా రమేష్ వర్మ ప్రకటించిన సినిమాలో కూడా ఆమే హీరోయిన్‌గా చేస్తోంది. ఇవి మాత్రమే కాదు, మరో భారీ బడ్జెట్ ప్రాజెక్ట్ విషయంలో కూడా ఆమె పేరు వినిపిస్తోంది. 'సైరా' తర్వాత చిరంజీవి చేసే చిత్రంలో కాజల్‌నే తీసుకోవాలని దర్శకుడు కొరటాల ఆలోచిస్తున్నాడని తెలుస్తోంది. అదే కనుక ఫైనల్ అయితే కాజల్ చేతిలో మొత్తం ఆరు సినిమాలు ఉన్నట్టే. ఇవన్నీ ఒకెత్తయితే ... ఒక హీరో సినిమాల్లో వరుసగా మూడింటిలో నటించిన హీరోయిన్ కూడా కాజలే అవుతుంది. ఆల్రెడీ బెల్లంకొండ శ్రీనివాస్‌తో 'కవచం'లో కనడడిన ఆమె, ఇప్పుడు అతనితో మరో రెండు సినిమాలు చేస్తోందిగా మరి!

ఫిబ్రవరిలో ఫియర్

'ప్రేమ కథా చిత్రమ్' అందించిన వినోదాన్ని ఇంకా మర్చిపోకముందే 'ప్రేమకథా చిత్రమ్ 2' రెడీ అయ్యింది. సుమంత్ అశ్విన్, నందితాశ్వేత, సిద్ధి ఇద్నాని ముఖ్య పాత్రలు పోషిస్తోన్న ఈ చిత్రానికి హరి కిషన్ దర్శకుడు. ఈ హారర్ మూవీ శాటిలైట్, హిందీ డబ్బింగ్ రైట్స్ ద్వారా కోటీ నలభై మూడు లక్షలు దక్కించుకుంది. ఫిబ్రవరి 22న విడుదల చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని నిర్మాత ఆర్.సుదర్శన్ రెడ్డి తెలిపారు. ''మొదటి పార్ట్ లాగే ఈ చిత్రాన్ని కూడా ఆసక్తికరంగా రూపొందించాం. రావు రమేష్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. దానివల్ల ప్రేక్షకులు కథలోకి లీనమవుతారు. విద్యుల్లేఖ, ప్రభాస్ శ్రీనుల మధ్య వచ్చే కామెడీ హిలేరియస్‌గా ఉంటుంది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 22న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నాం'' అన్నారు.



నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.405	రూ.4.65
వరంగల్	రూ.407	రూ.4.65



కియా కార్లొస్తున్నయ్

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా వాహన సంస్థ కియా మోటార్స్ ఇండియాలో తన తొలికారు 'ఎస్పీ 2ఐ' తయారీని ఈ నెలలోనే ఆంధ్రప్రదేశ్ ప్లాంటులో ప్రారంభించనుంది. మరికొన్ని నెలల్లో ప్రయోగాత్మక పరీక్షలు పూర్తయ్యాక మార్కెట్లోకి విడుదల చేయనుంది. ఏపీ కార్ల ప్లాంట పనులు పూర్తి కావొస్తున్నాయని, ఇది ఏటా మూడు లక్షల యూనిట్లను తయారు చేయగలుగుతుందని కంపెనీ వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా అమ్మకాల కోసం డీలర్ల నెట్‌వర్క్‌ను కూడా విస్తరిస్తున్నామని పేర్కొన్నాయి. ఎస్పీ 2ఐ కారును కంపెనీ తొలిసారిగా గత ఏడాది నిర్వహించిన ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించింది. ఈ ఏడాది నుంచి ప్రతి ఆరు నెలలకు ఒక కొత్త మోడల్‌ను విడుదల చేయాలని కియా భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలోని ప్లాంటు నిర్మాణం కోసం రూ.7,100 కోట్లు ఖర్చు చేసింది. కస్టమర్ల అవసరాలు తీర్చడానికి దేశవ్యాప్తంగా నాలుగు రీజనల్ ఆఫీసులను ఏర్పాటు చేస్తోంది.

ఎకానమీలో బ్రిటన్‌ను దాటేయనున్న ఇండియా

న్యూఢిల్లీ: అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ర్యాంకింగ్స్‌లో ఈ ఏడాది ఇండియా బ్రిటన్‌ను అధిగమించే అవకాశం ఉందని గ్లోబల్ కన్సల్టెన్సీ ప్రైస్ వాటర్ కూపర్స్ (పీడబ్ల్యూసీ) నివేదిక తెలిపింది. ఈ విషయంలో బ్రిటన్, ఫ్రాన్స్ ర్యాంకులు అటుఇటు అవుతుంటాయని, ఈసారి ఇండియా వీటిని శాశ్వతంగా వెనక్కి నెట్టేస్తుందని పేర్కొంది. దీని ప్రకారం.. ఈసారి బ్రిటన్ వాస్తవిక జీడీపీ వృద్ధి 1.6 శాతం, ఫ్రాన్స్ వృద్ధి 1.7 శాతం, ఇండియా వాస్తవిక జీడీపీ వృద్ధి 7.6 శాతం నమోదవుతుంది. ప్రస్తుతం ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న బ్రిటన్ స్థానం ఏడుకు చేరుతుంది. 2017లో ఇండియా ఫ్రాన్స్‌ను వెనక్కి నెట్టి ఆరో ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. ఈసారి బ్రిటన్‌ను అధిగమిస్తే ఐదో ర్యాంకు దక్కుతుంది. జీఎస్టీ వసూళ్ల వల్ల ఇండియా జీడీపీ వృద్ధిరేటు బాగా పెరుగుతుందని పీడబ్ల్యూసీ అంచనా వేసింది. బ్రెగ్జిట్ ఇబ్బందుల వల్ల ఈసారి బ్రిటన్ జీడీపీ తగ్గుతుందని విశ్లేషించింది. 2017లో ఇండియా జీడీపీ 2.59 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. 2.58 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో ఫ్రాన్స్ ఏడో స్థానానికి పడిపోయింది. 2.62 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో బ్రిటన్ అప్పుడు ఐదో ర్యాంకులో ఉంది. అమెరికా, చైనా, జపాన్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.

గ్రోఫర్స్ నుంచి ఆరెంజ్ క్యాష్ బ్యాక్

న్యూఢిల్లీ : గ్రాండ్ ఆరంజ్ బ్యాగ్ డేస్ (జీఓబీడీ) సేల్ ద్వారా రూ. 200 కోట్ల గ్రాస్ మెర్చండైజ్ వ్యాల్యూ (జీఎంవీ) అందుకోవాలని గ్రోఫర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. జనవరి 19 న ప్రారంభమైన జీఓబీడీ 27 దాకా కొనసాగుతుందని, మొదటి రోజునే రూ. 60 కోట్ల అమ్మకాలు సాధించామని గ్రోఫర్స్ వెల్లడించింది. నిర్ధారిత కాలానికి నిర్వహించే అమ్మకాల విలువను ఆన్‌లైన్ రిటైలింగ్‌లో జీఎంవీగా వ్యవహరిస్తున్నారు. మొదటి రోజే రూ. 60 కోట్ల విలువైన 76 లక్షల యూనిట్ల విక్రయాలను జరిపామని గ్రోఫర్స్ సీఈఓ అల్బిందర్ ధిండ్సా చెప్పారు. ఈ సేల్ సందర్భంగా కొత్తగా ఆరంజ్ క్యాష్ పేరిట క్యాష్ బ్యాక్ స్కీమును అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. కస్టమర్లను రివార్డులతో ప్రోత్సహించాలనుకుంటున్నామని, మరిన్ని కొనుగోళ్లకు వారు ఇష్టపడేలా చేయాలనేదే లక్ష్యమన్నారు. వినియోగదారుల కొనుగోలు అలవాట్లను, అభిరుచులను అధ్యయనం చేశాకే ఆరంజ్ క్యాష్‌ను ప్రవేశపెట్టామని తెలిపారు. దీంతో కస్టమర్లు రెగ్యులర్‌గా కొనుగోలు చేసే బ్రాండ్ల పట్ల లాయల్టీ పెరుగుతుందని పేర్కొన్నారు. స్కీములో వచ్చిన క్యాష్ బ్యాక్ ఆఫర్స్‌ను ఈ ఏడాది చివర్లోగా గ్రోఫర్స్‌లో కొనుగోళ్లకు కస్టమర్లు ఉపయోగించుకునే వీలుంటుందని చెప్పారు. 2020 నాటకి రూ. 17,500 కోట్ల అమ్మకాల ఆదాయాన్ని ధ్యేయంగా పెట్టుకున్నట్లు గ్రోఫర్స్ గతంలోనే ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఆదాయం రూ. 2,500 కోట్లుగా ఉంది.

విదేశాల నుంచి..

అప్పులిక ఈజీ



కొన్ని ముఖ్యాంశాలు

- ఈసీబీల మెచ్యూరిటీ కాలపరిమితిని తగ్గించి రుణ పరిమితులను పెంచారు
- విదేశీ నిధులను సేకరించే కంపెనీలకు ఉండాల్సిన అర్హతలను సడలించారు
- ఒక్కో ఆర్థిక సంవత్సరంలో ఆటోమేటిక్ రూట్ విధానం ద్వారా 750 మిలియన్ డాలర్ల (రూ.5330 కోట్లు) వరకు ఈసీబీలు స్వీకరించవచ్చు.
- అన్ని రకాల ఈసీబీలకు మినిమమ్ ఏవరేజ్ మెచ్యూరిటీ పీరియడ్ (ఎంఏఎంపీ) యథాతథంగా మూడేళ్లే ఉంటుంది.
- ఫారిన్ ఈక్విటీ హోల్డర్లు అయిన వ్యక్తులు మాత్రమే ఈసీబీలు ఇవ్వడానికి అర్హులు.
- ఫారిన్ ఈక్విటీ హోల్డర్ల నుంచి ఈసీబీ తీసుకొని వర్కింగ్ క్యాపిటల్‌కు, కార్పొరేట్ అవసరాల కోసం, రూపాయల్లోని అప్పులకు వాడుకుంటే ఎంఏఎంపీ ఐదేళ్లు ఉంటుంది.
- రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు, క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్లు, ఈక్విటీ ఇన్వెస్టమెంట్లకు మాత్రం ఈసీబీలను ఉపయోగించడంపై నిషేధం కొనసాగుతుంది.

న్యూఢిల్లీ: ఇక నుంచి మనదేశ కంపెనీలు ఇతర దేశాల సంస్థల నుంచి సులువుగా నిధులు సేకరించవచ్చు. ఈ మేరకు ఆర్‌బీఐ విదేశీ వాణిజ్య రుణాల (ఈసీబీ) నిబంధనలను సరళీకరించింది. ఈసీబీల మెచ్యూరిటీ కాలపరిమితిని తగ్గించింది. అప్పుల పరిమితులను పెంచింది. విదేశీ నిధుల కోసం ప్రయత్నించే కంపెనీల అర్హతలకు విధించిన ఆంక్షలనూ సడలించింది. ఫలితంగా ఇక మీదట పోర్టు ట్రస్టులు, స్పెషల్ ఎకనమిక్ జోన్లు (సెజ్‌లు), మైక్రోఫైనాన్స్ కంపెనీలు ఎగ్జిమ్ బ్యాంక్, సిడ్బి వంటివి సులువుగా ఈసీబీలను పొందవచ్చు. ఇండియాలో గత కొన్నేళ్లుగా ఫిన్‌టెక్ కంపెనీలు పెద్ద ఎత్తున వెలిశాయి. గత ఏడాది లిక్విడిటీ సంక్షోభం మొదలయ్యాక తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఈసీబీ రూల్స్‌ను సడలిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. మాన్యుఫ్యాక్చరింగ్ ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్లు (ఎఫ్‌డీఐలు) పొందడానికి అర్హులైన కంపెనీలకు ఈ నిర్ణయం వరం వంటిదని కోషెంట్ డిజిటల్ సొల్యూషన్స్ సీఈఓ సౌస్థవ్ చక్రవర్తి అన్నారు. ''ఏంజెల్ ట్యాక్స్ వల్ల సమస్యలు వచ్చిన నేపథ్యంలో ఈసీబీ నిబంధనలను సరళీకరించింది. ఫలితంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకును పెంచుకోవడానికి కట్టుబడి ఉన్నానని ఈ ప్రభుత్వం చెప్పినట్టయింది'' అని ఆయన అన్నారు.

కొత్త నిబంధనల ప్రకారం దేశీయ కంపెనీలు ఒక్కో ఆర్థిక సంవత్సరంలో ఆటోమేటిక్ రూట్ విధానం ద్వారా 750 మిలియన్ డాలర్ల (రూ.5,330 కోట్లు) వరకు ఈసీబీలు స్వీకరించవచ్చు. అన్ని రకాల ఈసీబీలకు మినిమమ్ ఏవరేజ్ మెచ్యూరిటీ పీరియడ్ (ఎంఏఎంపీ)ని యథాతథంగా మూడేళ్లుగానే ఉంచుతున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలోని కంపెనీలు మాత్రం ఒక్కో ఆర్థిక సంవత్సరంలో ఏడాది ఎంఏఎంపీతో 50 మిలియన్ డాలర్ల వరకు (రూ.355 కోట్లు) ఈసీబీలు తీసుకోవచ్చు. ఈసీబీ ఇచ్చే సంస్థ ఎఫ్‌ఏటీఎఫ్ లేదా ఐఓఎస్‌సీఓ ప్రమాణాలు ఉన్న దేశానికి చెందినదై ఉండాలి. ఇండియాకు సభ్యత్వం ఉన్న ప్రాంతీయ ఆర్థిక సంస్థలు గల దేశాల నుంచి కూడా తీసుకోవచ్చు. ఫారిన్ ఈక్విటీ హోల్డర్లు అయిన వ్యక్తులు మాత్రమే ఈసీబీలు ఇవ్వడానికి అర్హులు. వీరి నుంచి ఈసీబీ తీసుకొని వర్కింగ్ క్యాపిటల్‌కు, కార్పొరేట్ అవసరాల కోసం, రూపాయల్లోని అప్పులకు వాడుకుంటే ఐదేళ్ల ఎంఏఎంపీ ఉంటుంది. ఈసీబీఐ కొత్త నిబంధనలు తక్షణం అమల్లోకి వస్తాయి. రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు, క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్లు, ఈక్విటీ ఇన్వెస్టమెంట్లకు మాత్రం ఈసీబీలను ఉపయోగించడంపై నిషేధం కొనసాగుతుంది.

క్యూ3 ఫలితాలే తేల్చేస్తాయ్..



న్యూఢిల్లీ: కార్పొరేట్ కంపెనీల క్యూ3 ఫలితాలు, రూపాయి విలువ, అంతర్జాతీయ మార్కెట్ల పరిస్థితులు ఈవారం దేశీయ ఈక్విటీ మార్కెట్లకు కీలకమని నిపుణులు తెలిపారు. కంపెనీల ఫలితాలతోపాటు యాజమాన్యాల వ్యాఖ్యలనూ మార్కెట్ జాగ్రత్తగా గమనిస్తుందని ఎపిక్ రీసెర్చ్ సీఈఓ ముస్తఫా నదీమ్ అన్నారు. గత వారాంతంలో వెల్లడయిన కంపెనీల ఫలితాలపై సూచీలు ఈవారం స్పందించే అవకాశాలు ఉన్నాయి. శుక్రవారం మార్కెట్ ముగిసిన తరువాత విప్రో ఫలితాలను ప్రకటించింది. హెచ్‌డీఎఫ్‌సీ శనివారం ఫలితాలను వెల్లడించింది. ఈ క్వార్టర్‌లో లాభం 20 శాతం రూ.5,589 కోట్లకు చేరుకుంది. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యెస్ బ్యాంక్, మారుతీ సుజుకీ వంటి కంపెనీలు ఈవారమే ఫలితాలను ప్రకటిస్తాయి. ''చాలా ఐటీ కంపెనీలు క్యూ3 అంచనాలను అందుకున్నాయి. వీటి యాజమాన్యాల ప్రకటనలు సానుకూలంగానే ఉన్నాయి. ఇతర కంపెనీల ఫలితాలపై నిపుణులు వ్యతిరేకంగా ఏమీ స్పందించలేదు. మొత్తానికి పరిస్థితి బాగానే ఉంది'' అని ఎస్సెల్ మ్యూచువల్‌ఫండ్ సీఐఓ విరల్ బేరవాలా అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లలోని పరిస్థితులు సైతం మార్కెట్లను కదిలించే అవకాశాలు ఉన్నాయి. సమీప భవిష్యత్‌లో మార్కెట్‌లో 'రేంజ్ బౌండ్ మూవ్‌మెంట్' ఉంటుందని భావిస్తున్నారు. చమురు ధరలు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల విధానం ట్రేడింగ్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపవచ్చు. గత సెన్సెక్స్ ఒకశాతం పెరిగి 36,386 పాయింట్ల వద్ద ముగిసింది.

ముందుకు కదలని మన ప్రాజెక్టులు
విదేశీ బొగ్గే దిక్కు



న్యూఢిల్లీ : బొగ్గు గనుల ప్రాజెక్టులలో ఎందుకు జాప్యం అవుతోందో తెలుసుకోమని కోల్ ఇండియా, ఎన్‌ఎల్‌సీ ఇండియాలను కేంద్ర ప్రభుత్వం కోరింది. కారణాలతో నివేదికను సమర్పించమని కూడా ఆ కంపెనీలను అడిగినట్లు ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. రూ. 11 వేల కోట్ల విలువైన కోల్ ప్రాజెక్టులలో జాప్యం జరుగుతోంది. మొత్తం రూ. 35 వేల కోట్ల విలువైన బొగ్గు ప్రాజెక్టుల అమలు వివిధ దశలలో ఉంది. మరోవైపు బొగ్గు అవసరాల కోసం దిగుమతుల మీదే ఎక్కువగా ఇండియా ఆధారపడవలసి వస్తోంది. రూ. 500 కోట్లు, 30 లక్షల టన్నుల సామర్థ్యం పైబడిన కోల్ ప్రాజెక్టులను ఇటీవల రివ్యూ చేశారు. ప్రాజెక్టుల జాప్యం మీద సీఐఎల్, ఎన్‌ఎల్‌సీ నుంచి నివేదికను కోల్ సెక్రటరీ సుమంత చౌదరి కోరినట్లు బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారి చెప్పారు. ఈ రివ్యూ మీటింగ్‌లో సీఐఎల్ చేతిలోని 51 ప్రాజెక్టులు (దేశీయ బొగ్గు ఉత్పత్తిలో సీఐఎల్ వాటా 80 శాతం), ఎన్‌ఎల్‌సీ చేతిలోని 9 ప్రాజెక్టులు, సిగరేణి కాలరీస్ చేతిలోని 2 ప్రాజెక్టులు చర్చకు వచ్చాయి. వాటిలో 21 ప్రాజెక్టులలు గణనీయమైన ఆలస్యంతో నడుస్తున్నాయని ఆ అధికారి వెల్లడించారు. కోల్ ఇండియాకు చెందిన మగధ్, కారో, ఉత్తర ఉరిమరి, రాజ్‌రప్ప ఆర్‌సీఈ ప్రాజెక్టులలో జాప్యం జరుగుతోంది. అలాగే, ఎన్‌ఎల్‌సీ ప్రాజెక్టులలో పచ్‌వార సౌత్ కోల్ బ్లాక్, తాలబిర 2, 3 కోల్ బ్లాకులు, రాజస్థాన్ పవర్ ప్రాజెక్టులు ఆలస్యంతో నడుస్తున్నాయి. బొగ్గు దేశీయ ఉత్పత్తి కంటె డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. ఇటీవలి కాలంలో ఏటా 20 కోట్ల టన్నుల బొగ్గును ఇండియా దిగుమతి చేసుకుంది. ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో దేశీయ బొగ్గు ఉత్పత్తి 7.4 శాతం పెరిగిందని, బొగ్గు కొరత ఏర్పడదని గత నెలలో బొగ్గు శాఖ మంత్రి పీయూష్ గోయెల్ వెల్లడించారు. పర్యావరణపరమైన అనుమతులు, భూసేకరణ, కొన్ని ఇతర సమస్యల వల్ల బొగ్గు ఉత్పత్తి ఇటీవల కాలంలో పెరగలేదని ఆయన అంగీకరించారు. 2014-15 నుంచి 2017-18 మధ్య నాలుగేళ్లలో కోల్ ఇండియా ఉత్పత్తి 10.4 కోట్ల టన్నుల మేర పెరిగిందని కూడా మంత్రి చెప్పారు.

ఓటీటీలకు సంకెళ్లు వద్దే వద్దు..
ట్రాయ్‌కు తేల్చి చెప్పిన టీవీ చానెల్ కంపెనీలు

న్యూఢిల్లీ : ఓవర్ ది టాప్(ఓటీటీ) కమ్యూనికేషన్ సర్వీసులకు మరిన్ని నియంత్రణలు అవసరం లేదని దేశంలోనే అతిపెద్ద బ్రాడ్‌కాస్టర్లు స్టార్ ఇండియా, సోని పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా, టైమ్ నెట్‌వర్క్‌లు అభిప్రాయం వ్యక్తం చేశాయి. ట్రాయ్ కన్సల్టేషన్ పేపర్‌లో ఈ మేరకు ఫీడ్‌బ్యాక్ ఇచ్చాయి. మరిన్ని నియంత్రణలు తీసుకొస్తే, ఆ సర్వీసులు దెబ్బతింటాయని తెలిపాయి. అంతేకాక తాము ఓటీటీ సర్వీసులను, టెలికాం సర్వీసు ప్రొవైడర్లలో(టీఎస్‌పీల్లో) భాగంగా చూడటం లేదని స్పష్టం చేశాయి. కొన్ని ఓటీటీ సర్వీసులు అచ్చం టీఎస్‌పీల మాదిరి ఉన్నా.. వాటి టెక్నాలజీ, రెవెన్యూ వంటి చాలా విషయాల్లో టెలికాం సర్వీసు ప్రొవైడర్లకు భిన్నంగానే ఉంటున్నాయని చెప్పాయి. ఓటీటీ సర్వీసులు, ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ 1885 సెక్షన్ 4 కిందకు వస్తాయని స్టార్ ఇండియా చెప్పింది. ఈ కారణం చేత, వీటిని నియంత్రించే అధికారం రెగ్యులేటర్‌కు లేదని పేర్కొంది. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000 కింద ఇప్పటికే ప్రొవిజన్లు ఉన్నాయని, దీంతో వీటి కోసం ప్రత్యేకంగా నియంత్రణలు తీసుకురావాల్సిన పని లేదని బ్రాడ్‌కాస్టర్ వెల్లడించింది. డ్రాఫ్ట్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, 2018 కింద ప్రొవిజన్లను పటిష్టపరిచేందుకు జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ కమిటీ పని చేస్తోన్న సంగతి తెలిసిందే. అయితే ఓటీటీ సర్వీసులకు మరిన్ని నియంత్రణలు తీసుకొస్తే మాత్రం ఇంటర్నెట్ అప్లికేషన్స్, ప్లాట్‌ఫామ్స్ వృద్ధి దెబ్బతింటుందని సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా తెలిపింది. ఓటీటీ సర్వీసులను నియంత్రించాల్సిన అవసరం లేదని సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా ట్రాయ్‌కు సమర్పించిన ఫీడ్‌బ్యాక్‌లో అభిప్రాయపడింది. ఫెయిర్ మార్కెట్ ప్రైసింగ్ అందుబాటులో ఉండేలా టెల్కోలు అనుమతించాలని బ్రాడ్‌కాస్టర్లు కోరాయి. ఓటీటీలు, టెలికాం సర్వీసు ప్రొవైడర్లకు మధ్యనున్న తేడాను టైమ్స్ నెట్‌వర్క్ వివరించింది. కాగా, టెలికం సంస్థల మాదిరే మెసేజ్‌లు, కాల్స్‌కు అవకాశం కల్పిస్తున్న



వాట్సాప్, స్కైప్, ఫేస్‌బుక్, గూగుల్ డుయో తదితర ఓవర్ దది టాప్ (ఓటీటీ) సేవలను నియంత్రణ పరిధిలోకి తీసుకురావాలన్న అంశంపై ప్రస్తుతం చర్చ జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఓటీటీ సర్వీసులను కూడా టెల్కోల సేవలకు సమానంగా పరిగణించి, నియంత్రణ, లైసెన్సింగ్ నిబంధనలను తీసుకురావాలా? అనే విషయంపై ట్రాయ్, పలు పరిశ్రమల అభిప్రాయాలను కోరుతోంది.

లెదర్ ఎగుమతులు పెంచుతాం
సీఎల్‌ఈ ఛైర్మన్ అకీల్ అహ్మద్

న్యూఢిల్లీ : రాబోయే రెండేళ్లలో తోలు ఎగుమతులు 8 నుంచి 10 శాతం పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కౌన్సిల్ ఫర్ లెదర్ ఎక్స్‌పోర్ట్స్ (సీఎల్‌ఈ) వెల్లడించింది. దేశానికి అత్యంత విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తున్న ఈ రంగం మీద ప్రత్యే క శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపింది. వివిధ దేశాలలో కొనుగోలుదారులుఅమ్మకందారుల మీట్స్ నిర్వహించడంతోపాటు, గ్లోబల్ ట్రేడ్ ఫెయిర్స్‌లో పాల్గొనాలనుకుంటున్నట్లు సీఎల్‌ఈ ఛైర్మన్ పీ ఆర్ అకీల్ అహ్మద్ వెల్లడించారు. విదేశీ మారక ద్రవ్యం తెచ్చిపెట్టడంతోపాటు ఎక్కువ మందికి ఉపాధి కల్పించే సామర్థ్యం కూడా ఈ రంగానికి ఉందని తెలిపారు. ప్రస్తుతం ఇండియా నుంచి తోలు ఎగుమతులు రూ. 600 కోట్ల డాలర్లు. రాబోయే రెండేళ్లలో 810 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని అకీల్ అహ్మద్ చెప్పారు. ఇందుకోసం పలు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యుఎస్, జపాన్, లాటిన్ అమెరికా, రష్యాలలో పది బయ్యర్‌సెల్లర్ మీట్స్ తలపెడుతున్నట్లు పేర్కొన్నారు. ఇటలీ, జర్మనీ, ఆస్ట్రేలియా, అమెరికాలలో జరిగే ప్రధాన ట్రేడ్ ఫెయిర్స్ అన్నింటిలోనూ తమ సభ్యులు పాల్గొంటారని చెప్పారు. తోలు ఉత్పత్తుల రంగానికి ఇటీవలే వాణిజ్య శాఖ మంత్రి రూ. 2,600 కోట్ల ప్యాకేజ్ ప్రకటించారు. ప్రధానంగా ఎగుమతులు పెంచే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాని అహ్మద్ వెల్లడించారు. మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకు, ఉత్పత్తి పెంచేందుకు, ఉపాధి కల్పనకూ ఈ ఇన్సెంటివ్స్ దోహదపడతాయని తెలిపారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి కొత్త మార్కెట్లను వెతికి పట్టుకునేందుకూ కౌన్సిల్ ప్రయత్నిస్తోందన్నారు. పెరూ, చిలీ దేశాలలో మంచి అవకాశాలున్నాయని ఛైర్మన్ తెలిపారు. సరైన సమయంలో రుణ సదుపాయం దొరకడం అనేది తోలు పరిశ్రమకు ప్రధానమైన వనరని, ఈ విషయంలో ప్రభుత్వ సహకారం అవసరమని అన్నారు. అంతేకాకుండా, కొత్త టెక్నాలజీల రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు, విదేశీ పెట్టుబడులు ఆకర్షించడానికి కూడా సహాయం కావాలని చెప్పారు. ఇండియా నుంచి జరుగుతున్న తోలు ఎగుమతులలో 70 శాతం యూరప్‌కే జరుగుతున్నాయి. దేశంలో ఈ రంగం 42 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది.

కుంభమేళాతో యూపీకి రాబడి
లక్షా 20 వేల కోట్లు

ప్రయాగ్‌రాజ్ : ఈ నెల 15న ప్రతిష్టాత్మకంగా ప్రారంభమై మార్చి 4 దాకా జరగనున్న మెగా కుంభ్ మేళా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి రూ. 1.2 లక్షల కోట్ల ఆదాయం తెచ్చిపెడుతుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) అంచనా వేస్తోంది. కుంభ్ మేళా అనేది మతపరమైన వేడుక అయినప్పటికీ, సంబంధిత కార్యకలాపాలు వివిధ విభాగాలలో

- పొరుగు రాష్ట్రాలకూ ఆదాయం
- రాజస్థాన్, ఉత్తరాఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌లకూ సందర్శకుల వెల్లువ

మొత్తంఆరు లక్షల మందికి ఉపాధి కల్పించనున్నట్లు వెల్లడించింది. 50 రోజులపాటు సాగే ఈ కుంభ్ మేళా కోసం ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం రూ. 4,200 కోట్లు కేటాయించింది. 2013 లోని మహా కుంభ్‌కు కేటాయించిన దానికన్నా ఇది మూడు రెట్లు ఎక్కువ. దీంతో ఇప్పటిదాకా ఇదే అత్యంత ఖరీదైన తీర్థయాత్రగా అవతరిస్తోంది. ఒక్క హాస్పిటీలిటీ రంగమే 2.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుండగా, ఎయిర్‌లైన్స్, ఎయిర్‌పోర్టులు 1.5 లక్షల మందికి, టూర్ ఆపరేటర్లు మరో 45 వేల మందికి, ఎకో, మెడికల్ టూరిజం రంగాలు ఇంకో 85 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు సీఐఐ తెలిపింది. ఇవి కాకుండా అసంఘటిత రంగంలో టూర్ గైడ్స్, ట్యాక్సి డ్రైవర్లు, దుబాసీలు, స్వచ్ఛంద కార్యకర్తల రూపంలో మరో 85 వేల మందికీ ఉపాధి దొరకుతోందని పేర్కొంది. ఫలితంగా ప్రభుత్వ ఏజన్సీలతోపాటు, వ్యక్తిగత వ్యాపారస్తులకూ ఆదాయం గణనీయంగా పెరగనుందని వివరించింది. ఆస్ట్రేలియా, యుకె, కెనడా, మలేషియా, సింగపూర్, సౌతాఫ్రికా, న్యూజిలాండ్, మారిషస్, జింబాబ్వే, శ్రీలంక దేశాల నుంచి భారీ సంఖ్యలో కుంభ్ మేళాకు హాజరు కానున్నరాని తెలిపింది. కుంభ్ మేళా నిర్వహిస్తున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి 1.2 లక్షల కోట్ల ఆదాయం రానుండగా, పొరుగునే ఉన్న రాజస్థాన్, ఉత్తరాఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకూ ఈ కుంభ్ మేళాతో అదనపు ఆదాయం సమకూరుతుందని సీఐఐ నివేదిక చెబుతోంది. ఎందుకంటే ఇక్కడకు వచ్చే వారు పొరుగు రాష్ట్రాలను పర్యటించేందుకూ ఇష్టపడతారని వివరించింది. అంతకు మునుపుతో పోలిస్తే ఈ సారి రెట్టింపు విస్తీర్ణం 3,200 హెక్టార్లలో ఈ కుంభ్ మేళా జరుగుతోంది. దేశం నలుమూలల నుంచీ ఈ కుంభ్ మేళాకు జనం తరలి వస్తున్నారు. ఇలా వచ్చే కోట్లాది మంది కోసం 4 వేల టెంట్లతో ఒక మినీ సిటీనే అధికారులు నిర్మించారు. ఇక్కడ 40 వేల ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.




మొత్తం ఎన్ని రోజులు: 50 రోజులు
రానున్న సందర్శకులు: 12 కోట్లు
మొత్తం ఉపాధి కల్పన: 06 లక్షలు

ప్రధాన ఉపాధి కల్పన

హాస్పిటీలిటీ: 2.5 లక్షలు
ఎయిర్‌లైన్స్, ఎయిర్‌పోర్టు: 1.5 లక్షలు
టూర్ ఆపరేటర్లు: 45 వేలు
ఎకో, మెడికల్ టూరిజం: 85 వేలు
గైడ్‌లు, డ్రైవర్లు, ఇంటర్‌ప్రెటర్లు: 55 వేలు
ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ కేటాయింపు: 4,200 కోట్లు

మినీ సిటీ విస్తీర్ణం: 3,200 హెక్టార్లు
రోడ్లు: 250 కి.మీ.
ఎల్ఈడీ లైట్లు: 40,000
టెంపొరరీ టెంట్లు: 4,000



ప్లే PLAY
ప్రభాత వెలుగు
సోమవారం | హైదరాబాద్
www.v6velugu.com 21.01.2019

Follow:
v6velugu

ఖేలో ఇండియా చాంపియన్ మహారాష్ట్ర



పుణె: ఖేలో ఇండియా యూత్‌గేమ్స్ టైటిల్‌ను మహారాష్ట్ర గెలుచుకుంది. మహారాష్ట్ర మొత్తం 228 పతకాలు గెలుచుకుని ఫస్ట్‌ప్లేస్‌లో నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ కూడా సాధించింది. మహారాష్ట్ర సాధించిన 228 పతకాల్లో 85 స్వర్ణ, 62 రజత, 81 కాంస్య పతకాలున్నాయి. ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో విజేతలకు కేంద్ర మంత్రి జవదేకర్, మహారాష్ట్ర మంత్రులు పతకాలు అందించారు. మహారాష్ట్ర తర్వాత 2018 చాంపియన్ హర్యానా 178 పతకాలతో రెండోస్థానంలో నిలిచింది. హర్యానా సాధించిన పతకాల్లో 62 స్వర్ణ, 56 రజత,60 కాంస్యం ఉన్నాయి. కాగా,48 స్వర్ణం, 37రజత, 51 కాంస్యాలతో (మొత్తం 136) ఢిల్లీ మూడో స్థానం దక్కించుకుంది. చివరి రోజు 15 స్వర్ణ పతకాల కోసం జరిగిన పోటీల్లో మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానాలు రెండేసి గెలుచుకోగా, ఢిల్లీ, పంజాబ్ ఒక్కో గోల్డ్ మెడల్ కొట్టాయి.

కివీస్‌లో టీమిండియా

ఆక్లాండ్: టెస్టులు, వన్డేల్లో ఆస్ట్రేలియాను చిత్తు చేసి చరిత్ర సృష్టించిన టీమిండియా న్యూజిలాండ్‌లో అడుగుపెట్టింది. 20 రోజుల న్యూజిలాండ్ పర్యటనలో కోహ్లీ సేన ఐదు వన్డేలు, మూడు టీ20లు ఆడుతుంది. తొలి వన్డే 23న జరుగుతుంది. చివరిసారిగా 2008-09లో న్యూజిలాండ్‌లో సిరీస్ ఆడిన ఇండియా 1-4 తేడాతో ఓడిపోయింది. ఇప్పటి వరకూ న్యూజిలాండ్‌లో ఏడు వన్డే సిరీస్‌లు ఆడిన ఇండియా ఒక్క సారి మాత్రమే సిరీస్ గెలిచింది. ఒక సిరీస్ డ్రా అయితే న్యూజిలాండ్ నాలుగు వన్డే సిరీస్‌లు గెలిచింది.

ఇండియా వన్డే టీమ్: కోహ్లీ (కెప్టెన్), రోహిత్, ధవన్, ధోనీ, రాయుడు, జాదవ్, కార్తీక్, జడేజా, విజయ్ శంకర్, కుల్దీప్, భువనేశ్వర్ కుమార్, షమీ, సిరాజ్, చాహల్, ఖలీల్ అహ్మద్, శుబ్‌మన్ గిల్.

వన్డే షెడ్యూల్

జనవరి 23	ఫస్ట్ వన్డే	నేపియర్
జనవరి 26	సెకండ్ వన్డే	మౌంగనీ
జనవరి 28	థర్డ్ వన్డే	మౌంగనీ
జనవరి 31	ఫోర్త్ వన్డే	హామిల్టన్
ఫిబ్రవరి 3	ఫిఫ్త్ వన్డే	వెల్లింగ్టన్


మ్యాచ్‌లు ఇండియా టైమ్సింగ్స్ ప్రకారం ఉదయం 7.30కి మొదలవుతాయి





ధోనీ బెస్ట్ ఫినిషర్


న్యూఢిల్లీ: ప్రస్తుత వన్డే క్రికెట్‌లో మహేంద్ర సింగ్ ధోనీని మించిన ఫినిషర్ లేడని... అతనే అత్యుత్తమ ఫినిషర్ అని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ కితాబిచ్చాడు. ఇటీవల కంగారూల గడ్డపై టీమిండియా తొలిసారి రెండు దేశాల వన్డే సిరీస్ నెగ్గడంలో కీలక పాత్ర పోషించిన ధోనీపై అన్ని వైపుల నుంచి ప్రశంసల వర్షం కురుస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో చాపెల్ మాట్లాడుతూ... 'ఛేజింగ్‌లో ప్రతి సారి ధోనీ లేట్ చేస్తున్నాడని అనుకుంటూ ఉంటాను. త్వరగా గేర్ మార్చకుండా ఆలస్యం చేశాడు అనుకుంటుండగానే... భారీ షాట్లతో నా నిర్ణయం తప్పని నిరూపిస్తాడు. టార్గెట్ ఛేజింగ్‌లో అతనెప్పుడు తడబడడు. కూల్‌గా ఫినిష్ చేస్తాడు. అతని బ్రెయిన్ ఎప్పుడు అలసిపోదు. ఆలోచిస్తూనే ఉంటుంది' అని చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు, వన్డే స్పెషలిస్ట్ మైకేల్ బేవాన్‌తో పోల్చాల్సి వస్తే తన ఓటు ధోనీకేనని చెప్పాడు. 'బెవాన్ మ్యాచ్‌లను బౌండరీలతో ముగించేవాడు. ధోనీ మాత్రం ఆ పని సిక్స్‌లతో చేస్తాడు. అంతే కాదు ఇంకా చాలా విషయాల్లో బెవాన్ కంటే ధోనీనే ఉత్తమం. వికెట్ల మధ్య పరుగు విషయంలో ధోనీని మించిన వారు లేరు. టీ20లతో ధోనీ తన ఫినిషింగ్ టాలెంట్‌ను మరింత పెంచుకుంటూ వస్తున్నాడు' అని పేర్కొన్నాడు.



కోహ్లీ రికార్డు బ్రేక్

పోర్ట్‌ఎలిజబెత్: సౌతాఫ్రికా వెటరన్ బ్యాట్స్‌మన్ హషీమ్ ఆమ్లా టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ రికార్డును బ్రేక్ చేశాడు. వన్డేల్లో వేగంగా 27 సెంచరీలు చేసిన ఆటగాడిగా రికార్డులకెక్కాడు. పాకిస్తాన్‌తో శనివారం జరిగిన తొలి వన్డేలో సెంచరీ చేసిన ఆమ్లా.. కోహ్లీ రికార్డ్ బ్రేక్ చేశాడు. పోర్ట్ ఎలిజబెత్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో.. ఆమ్లా 120 బంతుల్లో 108 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆమ్లా 167 ఇన్నింగ్స్‌ల్లో 27 సెంచరీలు సాధించగా.. కోహ్లీ 169వ ఇన్నింగ్స్‌లో 27వ సెంచరీ చేశాడు. 2017 జనవరి 15న పుణే వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డేలో విరాట్ ఈ ఫీట్ సాధించాడు. గత కొంత కాలంగా హషీమ్ ఆమ్లా ఫామ్ లేమితో సతమతం అవుతున్నాడు. 2017 అక్టోబర్ తర్వాత అతడికి వన్డేల్లో ఇదే తొలి సెంచరీ.

ఫెడరర్ ఔట్



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ 2019లో పెను సంచలనం నమోదైంది. మూడో సారి ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ గెలుచుకుని హ్యాట్రిక్ కొట్టాలన్న స్విస్ లెజెండ్, డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్‌కు ప్రీ క్వార్టర్ ఫైనల్లో షాక్ తగిలింది. గ్రీక్ ప్లేయర్ 20 ఏళ్ల సిట్సిపాస్ 6-7 (11/13), 7-6 (7/3), 7-5, 7-6 (7/5) స్కోరుతో ఫెడరర్‌ను చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టాడు. ఫెడరర్‌పై విజయంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్ చేరుకున్న తొలి గ్రీక్ ప్లేయర్‌గా సిట్సిపాస్ రికార్డుల్లోకెక్కాడు. తొలి సెట్ నుంచి హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో సిట్సిపాస్ అద్భుతమైన షాట్లతో ఫెడరర్‌కు చెమటలు పట్టించాడు. దాదాపు నాలుగు గంటల పాటు ప్రత్యర్థులిద్దరూ హోరాహోరీగా గెలుపు కోసం కొదమ సింహాల్లా పోటీపడ్డారు. ఫెడరర్‌ను చిత్తు చేసిన ఉత్సాహంలో ఉన్న సిట్సిపాస్ క్వార్టర్ ఫైనల్లో రాబెర్టో బటిస్టా (స్పెయిన్)తో పోటీపడతాడు. సిట్సిపాస్ దూకుడు ముందు ఫెడరర్ తలవంచక తప్పలేదు. నువ్వానేనా అన్నట్టు ఫెడరర్‌తో ఢీ కొట్టిన సిట్సిపాస్ ధాటికి కీలకమైన సమయాల్లో బలహీనమైన షాట్లు ఆడిన ఫెడరర్ చేతులారా మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు.



సిట్సిపాస్

షరపోవాకి షాక్

విమెన్స్ ప్రీక్వార్టర్స్ ఫైనల్లో రష్యా టెన్నిస్ స్టార్ మరియా షరపోవా అనూహ్యంగా ఓడిపోయింది. షరపోవాపై 4-6, 6-1, 6-4 తేడాతో ఆస్ట్రేలియాకు చెందిన 22 ఏళ్ల ఆష్‌బార్టీ సంచలన విజయం సాధించింది. మెల్‌బోర్న్ పార్క్ లో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన బార్టీ తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఈ దశాబ్దంలోనే ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరిన తొలి ఆస్ట్రేలియన్ ప్లేయర్‌గానూ బార్టీ రికార్డుల్లోకెక్కింది. క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టిన బార్టీ రెండు సార్లు వింబుల్డన్ చాంపియన్ క్విటోవాతో పోటీకి రెడీ అయింది. 15వ సీడ్‌గా బరిలోకి దిగిన బార్టీ తొలి సెట్‌లో ఓడినప్పటికీ రెండో సెట్‌లో దూకుడు మొదలుపెట్టి వరుసగా రెండు సెట్లలో షరపోవాను ఓడించి మ్యాచ్‌ను గెలిచింది. ఐదు గ్రాండ్‌స్లామ్‌లు గెలుచుకున్న షరపోవాకు 2017 తర్వాత ఎదురైన అతి పెద్ద పరాజయం ఇదే. డ్రగ్స్ ఆరోపణలతో 15 నెలల నిషేధం తర్వాత మళ్లీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అడుగుపెట్టి మూడో రౌండ్‌లో నంబర్ వన్ వోజ్నియాకిని ఓడించిన షరపోవాకు నిరాశే మిగిలింది. ఈ ఏడాది ఆడిన 8 ఇంటర్నేషనల్ మ్యాచ్‌ల్లో ఏడు మ్యాచ్‌లు గెలిచిన బార్టీ టైటిల్ రేస్‌లో ఉంది. 2014-16 మధ్యలో టెన్నిస్‌కు దూరంగా ఉన్న బార్టీ, ఆ సమయంలో బిగ్‌బాష్ లీగ్‌లో బ్రిస్బేన్ హీట్స్ తరపున బరిలోకి దిగింది. ఇక జర్మనీకి చెందిన వరల్డ్ నెంబర్ టూ ఏంజెలా కెర్బర్‌కు నాలుగో రౌండ్ మ్యాచ్‌లో ఊహించని షాక్ ఎదురైంది. అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ ప్లేయర్ కొలిన్స్ 6-0, 6-2 స్కోరుతో కెర్బర్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. మరో మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ క్విటోవా 6-2, 6-1 స్కోరుతో అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ ప్లేయర్ అనిసిమోవాను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.

క్వార్టర్ ఫైనల్లో నడాల్

మెన్స్ విభాగంలో స్పెయిన్ సూపర్ స్టార్ నడాల్ జోరు కొనసాగుతోంది. ప్రి క్వార్టర్ ఫైనల్‌లో నడాల్ 6-0, 6-1, 7 -6 (7/4) స్కోరుతో వరల్డ్ నంబర్ ఫోర్ థామస్ బెర్డిచ్‌ను ఓడించాడు. ఈ విజయంతో నడాల్ క్వార్టర్ ఫైనల్ బెర్త్ సంపాదించాడు. మాజీ నంబర్ వన్ బెర్డిచ్‌తో రెండు గంటలుపైగా పోరాడి విజయం సాధించిన నడాల్ తర్వాతి మ్యాచ్‌లో అమెరికా ప్లేయర్ ఫ్రాన్సెస్ తియాఫోతో పోటీపడతాడు. ఆదివారం జరిగిన ప్రి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఫ్రాన్సెస్ 20వ సీడ్ గ్రిగోర్ దిమిత్రోవ్‌ను చిత్తు చేసి 21వ బర్త్‌డే సెలబ్రేషన్స్ జరుపుకున్నాడు.



ఆష్‌బార్టీ



గాయత్రికి మరో టైటిల్

హైదరాబాద్, వెలుగు: ఇండియా బ్యాడ్మింటన్ టీమ్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రి జూనియర్ విభాగంలో అదరగొడుతుంది. బెంగళూరు వేదికగా జరిగిన ఆలిండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అండర్-19 మహిళల సింగిల్స్ ఫైనల్లో గాయత్రి విజేతగా నిలిచింది. ఉన్నతి బిస్త్‌తో ఆదివారం జరిగిన ఫైనల్‌లో గాయత్రి 21-12, 21-13తో వరుస గేముల్లో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. 32 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో గాయత్రినే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. అంతకముందు శనివారం జరిగిన సెమీస్‌లో తాన్యా హేమంత్‌పై 22-20, 21-17తో విజయం సాధించిన గాయత్రి ఫైనల్ పోరుకు చేరింది.



ప్రేమ జంట.. కొత్త అకౌంట్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ సందర్భంగా తమ మధ్య బంధాన్ని అంగీకరించిన టెన్నిస్ కొత్త జంట గైల్ మోన్‌ఫీల్స్ (ఫ్రాన్స్), ఎలీనా స్వితోలినా (ఉక్రెయిన్) మరో అడుగు ముందుకు వేసి ఇన్‌స్టాగ్రామ్‌లో తమ ఇద్దరి పేరుతో అకౌంట్ తెరిచింది. 'గేమ్స్ లైఫ్' (జీఈఎమ్ఎస్-గైల్ ఎలీనా మోన్‌ఫీల్స్ స్వితోలినా) పేరుతో ఖాతా ఓపెన్ చేసింది. 'నా కోసం అతను, అతని కోసం నేను. ఒకరినొకరం బాగా అర్థం చేసుకున్నాం. మేం ఎటువైపు అడుగులు వేస్తున్నాం అనే అవగాహన మాకు ఉంది' అని స్వితోలినా గతవారమే ఇద్దరి మధ్య బంధాన్ని అంగీకరించిన విషయం తెలిసిందే. అయితే అకౌంట్ ఓపెన్ చేసిన క్షణాల్లోనే వేలల్లో లైకులు వచ్చాయి. తొలిసారిగా ఈ జంట కలిసి ఉన్న వీడియోను పోస్ట్ చేసింది. మీ ఇద్దరిలో మొదట ఎవరు ప్రపోజ్ చేశారు అనే ప్రశ్నకు బదులుగా ఒకరినొకరు చూయించుకుంటున్న ఫొటోను అప్‌లోడ్ చేసింది. దీనిపై స్పందించిన ఆస్ట్రేలియన్ టెన్నిస్ ప్లేయర్ దారియా గావ్రిలోవా మరిన్ని టెన్నిస్ జంటలు కూడా ఇలా కలిసి అకౌంట్ తీస్తే అభిమానులకు కన్నులపండువగా ఉంటుందని అభిప్రాయపడింది. వావ్రింకా, థీమ్ జోడీలు కూడా జాయింట్ అకౌంట్ తీస్తే బాగుంటుంది అని ఆమె పేర్కొంది.

మారథాన్ విజేత లగట్

ముంబై: టాటా ముంబై మారథాన్‌లో కాస్మస్ లగట్ (కెన్యా), వర్క్‌నెష్ అలేము (ఇథియోపియా) విజేతలుగా నిలిచారు. ఆదివారం జరిగిన మారథాన్ (42.195 కిలో మీటర్ల) రేసును 2 గంటల 9 నిమిషాల 15 సెకన్లలో పూర్తి చేసిన కెన్యా రన్నర్ స్వర్ణ పతకం గెలిచాడు. బన్‌టై (ఇథియోపియా; 2:10:05), షూమెట్ (ఇథియోపియా; 2:10:14) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో అలేము (2:25:45). గొబేనా (ఇథియోపియా 2:26:09), బైర్క్ డెబెలె (ఇథియోపియా 2:26:39) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఇండియా మారథాన్ రన్నర్ సుధా సింగ్ (2:34:56) ఎనిమిదో స్థానంతో రేసును ముగించి.. దోహా ప్రపంచ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది.

పాక్ జట్టుపై ఎంక్వైరీ

కరాచి: టెస్టుల్లో పాకిస్తాన్ ఆట తీరుపై ఆ దేశ బోర్డుకు కోపం తెప్పించింది. సౌతాఫ్రికా చేతిలో పాక్ జట్టు 0–3తో వైట్‌వాష్‌కు గురవడంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ ఎహెసాన్ మనీ అగ్రహం వ్యక్తం చేశారు. పాక్ జట్టు స్వదేశానికి వచ్చాక టెస్టు పెర్ఫార్మెన్స్‌పై ఎంక్వైరీ వేయనున్నట్లు ఆయన తెలిపారు. 'టెస్టుల్లో మా జట్టు ఆట నిరుత్సాహపరిచింది. ఫ్యాన్స్ అప్‌సెట్ అయ్యారు. టూర్ అనంతరం లోపాలెక్కడ ఉన్నాయో తేల్చడం కోసం ఎంక్వైరీ వేయనున్నాం' అని ఎహెసాన్ అన్నారు.

ఫ్యామిలీ ఫస్ట్..

ముంబై: లైఫ్‌లో క్రికెట్టే ముఖ్యం కాదంటున్నాడు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ . క్రికెట్ మానేశాక ఫ్యామిలీకి ప్రాధాన్యత ఇస్తానని కోహ్లీ చెబుతున్నాడు. రిటైరయ్యాక బ్యాట్ ముట్టుకోనని ఇంతకు ముందే చెప్పిన విరాట్ తాజాగా తన ఫ్యూచర్ ప్లాన్స్ గురించి మరింత వివరించాడు. 'క్రికెట్ మానేశాక కుటుంబానికి ప్రాధాన్యం ఇస్తా. నాకోసం కుటుంబం కోసం టైం కేటాయిస్తా. క్రికెట్ నా జీవితంలో భాగం. జీవితం కంటే ఏదీ పెద్దది కాదు' అని కోహ్లీ అన్నాడు. 'అన్నికంటే ముఖ్యమైంది జీవితం. జరిగేదేదో జరగనీయండి, ఎప్పుడూ మనం ఇంటికి తిరిగి రావాల్సిందే. కాబట్టి నా ప్రాధాన్యం తప్పకుండా కుటుంబమే. క్రికెట్ నా జీవితంలో ఎంతో ముఖ్యమైన భాగం క్రికెట్ ఆడగలగడం అదృష్టం' అని కోహ్లీ యాప్‌లో తెలిపాడు.

అర్జున్ విజయం

చెన్నై: తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ కుమార్ చెన్నై ఓపెన్ అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ నాలుగో రౌండ్‌లో గెలిచాడు. ఆదివారం నాలుగో రౌండ్‌లో ట్రిటాన్ మాగ్జిమ్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. వరుసగా తొలి రెండు రౌండ్‌లలో నెగ్గి మూడో రౌండ్‌లో రాసెట్ జియాత్‌దినోవ్ (అమెరికా) చేతిలో ఓడిన అర్జున్ తిరిగి పుంజుకున్నాడు. నాలుగు రౌండ్లు ముగిసే సరికి మొత్తం 3 పాయింట్లతో అర్జున్ 47 మందితో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాడు. ఇంటర్నేషనల్ మాస్టర్ జి. ఆకాశ్ (4 పాయింట్లు) మరో తొమ్మిది మందితో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.




'ఇప్పటి వరకు వన్డే క్రికెట్ ఆడిన వారిలో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అత్యుత్తమం. నా వరకైతే అతన్ని మించిన వారు ఇప్పటి వరకు రాలేదు. అతడు ఇండియా కోసం చేసిన దాన్ని చూస్తే ఈ విషయం ఎవరికైనా అర్థమవుతుంది. దేశం కోసం గెలవాలనే అతనిలోని కసికి ఎవరైనా రెస్పెక్ట్ ఇవ్వాల్సిందే. కోహ్లీ దూకుడుగా ఉంటాడనేది నిజమే కానీ.. టీమ్ పట్ల అతని కమిట్‌మెంట్‌ను ఎవరూ ప్రశ్నించలేరు.

- మైకేల్ క్లార్క్, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్



హాజిల్‌వుడ్‌కు గాయం

సిడ్నీ: ఆస్ట్రేలియా జట్టుకు షాక్ మీద షాక్ తగులుతోంది. సొంతగడ్డపై టీమిండియా చేతిలో ఓటమి మరిచిపోకముందే ఆ జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. పేసర్ జోష్ హాజిల్‌వుడ్ గాయంతో శ్రీలంకతో జరిగే రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు దూరమయ్యాడు. వెన్నునొప్పితో బాధపడుతున్న హాజిల్‌వుడ్ త్వరలో శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో పాల్గొనడం లేదని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. గతేడాది కూడా హాజిల్‌వుడ్ వెన్నునొప్పి తో ఆటకు దూరమయ్యాడు. రెండు జట్ల మధ్య డే నైట్ టెస్టుగా జరిగే తొలి మ్యాచ్ జనవరి 24న బ్రిస్బేన్ వేదికగా జరగనుంది. ఆ తర్వాత రెండో టెస్టు ఫిబ్రవరి 1 నుంచి మెల్‌బోర్న్ వేదికగా జరగనుంది. కాగా, ఇటీవలే టీమిండియాతో ముగిసిన నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా జట్టు 2-1తేడాతో చేజార్చుకున్న సంగతి తెలిసిందే.



దక్షిణ భారతదేశంలో ఆ 'గొయ్యి' ఏంది?

- భారీ ఉల్క ఢీ కొట్టడం వల్ల ఏర్పడిందట
- నీలగిరులు, కొడైకెనాల్ ఉల్క గొయ్యిలోనే ఉన్నాయట

భూమ్మీద డైనోసార్లను తుడిచిపెట్టేసిన దాని కంటే పేద్ద ఉల్క భారత ద్వీపకల్పాన్ని ఢీ కొట్టిందా? దీని వల్ల ఏర్పడిన గొయ్యిలోనే ప్రస్తుతం నీలగిరులు, కొడైకెనాల్ ఉన్నాయా? ఈ ప్రశ్నలకు ఇద్దరు ఎర్త్ సైంటిస్టులు అవుననే సమాధానం ఇస్తున్నారు. **'కావేరి క్రేటర్'** పేరుతో తెచ్చిన పేపర్‌లో దక్షిణ భారతదేశంపై భారీ ఉల్క పడిందని మైసూరు యూనివర్సిటీలో ఎర్త్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న కె.ఎన్. ప్రకాశ్ నరసింహా, మంగుళూరు యూనివర్సిటీలో మెరైన్ జియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పని చేసిన కె.ఆర్. సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నేటి వరకూ భూమిని తాకిన ఉల్కల సైజులో ఇదే నాలుగో అతి పెద్దదని సైంటిస్టులు వెల్లడించారు. మెగాస్కోపిక్, మైక్రోస్కోపిక్, కెమికల్ సిగ్నేచర్స్ టెస్టుల ద్వారా నీలగిరులు, కొడైకెనాల్ మధ్య ఉన్న రాతిని పరిశీలించినట్లు చెప్పారు. కేరళలోని పాల్‌ఘాట్ గ్యాప్(పర్వతాల మధ్య దారి), తమిళనాడులోని ధింబం ఘాట్స్ కావేరి గొయ్యి గుండానే వెళ్తున్నాయని, కర్ణాటకలోని బెలకావడి, శివ సముద్రం వరకూ గొయ్యి విస్తరించి వుందని వివరించారు. 10□20' నుంచి 11□30' ఉత్తర అక్షాంశాలు, 76°50' నుంచి 78° తూర్పు రేఖాంశాల మధ్య కావేరి క్రేటర్ ఉన్నట్లు పేర్కొన్నారు. దీని వ్యాసం 120 కిలోమీటర్లని తెలిపారు. 11° ఉత్తర అక్షాంశం నుంచి 77°30' తూర్పు రేఖాంశం మధ్య క్రేటర్ కేంద్రం ఉన్నట్లు వెల్లడించారు.

80 కోట్ల ఏళ్ల క్రితం

దాదాపు 80 కోట్ల ఏళ్ల నుంచి 55 కోట్ల ఏళ్ల క్రితం ఉల్క దక్షిణ భారతదేశాన్ని ఢీ కొట్టి ఉండొచ్చని సైంటిస్టులు అంచనా వేశారు. దాదాపు 6.5 కోట్ల ఏళ్ల క్రితం భూమిని భారీ ఉల్క ఢీ కొట్టడం వల్ల డైనోసార్లు అంతరించిపోయాయి. అంటే జీవం ఆవిర్భవిస్తున్న టైంలో దక్షిణ భారతదేశంపై ఉల్క పడిందన్నమాట. కావేరి క్రేటర్ సైజు, దాని ప్రభావాన్ని అంచనా వేసిన సైంటిస్టులు ఉల్క వ్యాసం దాదాపు ఐదు కిలో మీటర్లు ఉండొచ్చని చెబుతున్నారు. కేవలం శాటిలైట్ చిత్రాల ద్వారా మాత్రమే కావేరి క్రేటర్‌ను చూడగలమట. జియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జర్నల్‌లో ప్రకాశ్ నరసింహా, సుబ్రహ్మణ్యం రీసెర్చ్ ప్రచురితమైంది. దీన్ని 2018లో ఉత్తమ పేపర్‌గా గుర్తిస్తూ భారత ప్రభుత్వం 'రాధాకృష్ణ ప్రైజ్'ను అందజేసింది.

బ్యూటీ డాగ్ ఇక లేదు

ప్రపంచంలోనే అందమైన కుక్కపిల్ల 'బూ'. ఈ అందాల రాశికి 'బడ్డీ' అంటే ప్రాణం. ఇవి రెండూ ఎప్పుడూ కలిసిమెలిసి ఉండేవి. వాటి ఆటలను చూసి ఓనర్లు మురిసిపోయేవారు. బూ పేరుతో ఫేస్ బుక్ పేజీని క్రియేట్ చేసి, వాటి ఫొటోలను ఎప్పటికప్పుడు నెటిజన్లతో పంచుకునేవారు. అవి ఇంటర్నెట్ వైరల్ కావడం మామూలైపోయింది. 12 ఏళ్ల బూకు ఫేస్ బుక్‌లో 16 మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉన్నారంటే దాని క్రేజ్



ఎంతో ఊహించుకోవచ్చు. 2012లో వర్జిన్ అమెరికా ఎయిర్ లైన్స్ సంస్థ బూ ను 'పెట్ లైసన్'గా నియమించుకుంది. బూ పై 2011లో 'బూ: ద లైఫ్ ఆఫ్ ద వరల్డ్స్ క్యూటెస్ట్ డాగ్' అనే పుస్తకం కూడా పబ్లిష్ అయ్యింది. గత ఏడాది బడ్డీ చనిపోయింది. బడ్డీతో ఎప్పుడూ సంతోషంగా గడిపే బూ.. అది దూరం కావడంతో డీలా పడిపోయింది. శనివారం అది నిద్రలోనే చనిపోయింది. ఈ విషయాన్ని ఓనర్లు ఫేస్ బుక్‌లో పోస్టు చేస్తూ సంతాపం తెలిపారు. ప్రపంచంలో అందరికీ సంతోషాన్నిచ్చిన బూ బాధను చూడలేకపోయామన్నారు. ఇప్పటికి దాని బాధ తీరిందని, స్వర్గంలో బడ్డీని కలుసుకుని హ్యాపీగా ఉంటుందని వారు పోస్ట్‌లో పేర్కొన్నారు. చాలా మంది ఫాలోవర్స్ బూకు ఫేస్‌బుక్ లో సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులు అర్పించారు.



సైకిల్ అక్క లూనా

1972లో మార్కెట్‌లోకి తెచ్చిన కైనెటిక్ గ్రూప్

ఇప్పుడంటే ఇండియాలో పల్సర్లు, రాయల్ ఇన్‌ఫీల్డ్ లు, హార్లే డేవిడ్‌సన్‌లు ఉన్నాయి. మరి 1970–90ల్లో? అప్పట్లో ఒక్కటే వినిపించేది. 'చల్ మేరీ లూనా' అంటూ దేశం పాడుకునేది. మధ్య తరగతికి రెక్కలు తొడిగింది 'లూనా'. కొన్నేళ్లపాటు ఇండియా మార్కెట్‌ను ఏలింది. కానీ తర్వాత దాని ప్రాభవం కోల్పోయింది. పోటీకి తగినట్లు అప్‌డేట్ కాలేక కనుమరుగైపోయింది. 'కైనెటిక్' సంస్థ తయారు చేసిన లూనా ప్రస్థానమిదీ..

- 'చల్ మేరీ లూనా' అంటూ పాడుకున్న దేశం
- ఇండియాలో తొలి మోపెడ్‌గా రికార్డు
- పోటీకి తగ్గట్లు అప్‌డేట్ కాలేక కనుమరుగు

ప్రత్యేకతలివీ

- ఇండియాలో ఒకప్పుడు పాపులర్
- 50 కిలోల లోపు బరువు
- 50 సీసీ ఇంజిన్

అది లిబరలైజేషన్ (సరళీకరణ)కు ముందు కాలం. సైకిల్ దేశం, మోటార్ సైకిల్ దేశం అనే రెండు తరగతులుగా ఇండియా విడిపోయిన సమయమది. అప్పట్లో మోటార్ సైకిళ్లు ఓ మోస్తరు ధనికుల వద్ద మాత్రమే ఉండేవి. మధ్య తరగతి వారందరూ సైకిళ్ల మీదే ఆధారపడే వారు. 1972లో పూణెకు చెందిన కైనెటిక్ గ్రూప్ ఓ మోపెడ్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. సైకిల్‌ను, మోటార్ సైకిల్‌ను మిక్స్ చేసినట్లుగా ఉంటుంది. 50 కిలోల లోపు, 50 సీసీ ఇంజిన్ ఉన్న ఆ బండికి 'లూనా' అని పేరుపెట్టింది. దేశంలోనే తొలి మోపెడ్ అది. తర్వాత ప్రతి ఇంటికీ చేరింది. ఇండియాను తుఫానులా ముందుకు నడిపింది.

పెట్రోల్ అయిపోతే సైకిల్!

స్లిమ్ బాడీతో కూడిన లూనాను కైనెటిక్ గ్రూప్ చైర్మన్ అరుణ్ ఫిరోడియా తయారు చేశారు. మధ్య తరగతి వాళ్లను దృష్టిలో పెట్టుకుని రూపొందించారు. దేశంలో డేంజరస్ రోడ్లు ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ప్రత్యామ్నాయంలా, ప్రమాదాలు జరగకుండా నివారించేలా లూనాను సిద్ధం చేశారు. తర్వాతి కాలంలో కొత్త కొత్త టూ వీలర్లు వచ్చాక, లూన్ డిజైన్‌ను మార్పులు చేస్తూ వచ్చారు. "లూనా ఓ దృఢమైన సైకిల్. కాకపోతే దానికి మోటార్ అమర్చి ఉంటుంది. స్పీడు పెంచితే ఓ రేంజ్‌లో పరుగెడుతుంది. ఒకవేళ ఫ్యూయల్ అయిపోయినా, సైకిల్ మాదిరే పెడల్ తొక్కుకుంటూ వెళ్లిపోవచ్చు" అని బ్రాండ్ ఎక్స్‌పర్ట్ హరీశ్ బిజూర్ చెప్పారు.

ప్రతి ఇంటినీ చేరింది

లూనా కొద్ది రోజుల్లోనే ప్రతి ఇంటి బండిగా మారింది. మధ్య తరగతి కుటుంబంలో భాగమైంది. తొలుత బ్రాండ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు క్రికెట్ టోర్నమెంట్లలో ప్రమోట్ చేసింది కైనెటిక్ గ్రూప్. 'మాన్ ఆఫ్ ది మ్యాచ్'లు అందించింది. అలాగే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన స్టూడెంట్లకు బహుమతిగా అందజేసింది.

చల్ మేరీ లూనా..

లూనా బ్రాండ్ ప్రచారాన్ని అడ్వర్టైజింగ్ వెటరన్ పియూష్ పాండే చేపట్టారు. ఇదే ఆయన తొలి ప్రాజెక్టు కూడా. వినియోగదారుడిని దృష్టిలో ఉంచుకునే ప్రకటనలు రూపొందించారు. రాం మురారి ఓ ప్రభుత్వ ఉద్యోగి. పనితో సతమతమవుతూ ఉంటాడు.. దీపక్ సేథ్ తన ప్రేయసిని కలిసేందుకు పరిగెడుతూ ఉంటాడు.. మెడికల్ స్టూడెంట్ రాధ.. ఈ ముగ్గురి సమస్య ఒకటే. రోజూ లేట్‌గా వెళ్తుంటారు. ఇబ్బందులు పడుతుంటారు. అప్పుడే వీరికి కనిపిస్తుంది లూనా. సమస్యకు ముగింపు పలికేందుకు లూనా కొంటారు. తమ జీవితాలను మార్చుకుంటారు. అప్పట్లో టీవీల్లో మారుమోగిన యాడ్స్ ఇవి. 'చల్ మేరీ లూనా', 'సఫల్తా కీ సవారీ లూనా' వంటి ట్యాగ్ లైన్స్ నాటి యూత్ మెదళ్లలో ఇప్పటికీ గూడు కట్టుకుని ఉంటాయి. 'లూనా కర్తీ పక్కా వాదా, ఖర్చా కామ్, మజ్బూతీ జ్యాదా' అంటూ యాడ్‌లో వచ్చే వాయిస్ ఓవర్ చాలా ఫేమస్.

ఓడలు బండ్లు..

ప్రపంచీకరణ తర్వాత దేశంలో కొత్త బైకుల రాక మొదలైంది. కాంపిటీషన్ పెరిగింది. లూనా కంటే మంచి లుక్, స్పెషాలిటీస్‌తో స్కూటర్లు, బైకులు మార్కెట్‌లోకి వచ్చాయి. టీవీఎస్ 50 బండి గట్టి పోటీ ఇచ్చింది. లూనాకు మెల్లగా డిమాండ్, ప్రజాదరణ తగ్గింది. దీంతో మహిళా కస్టమర్లపై ఫోకస్ పెట్టింది. ఒక దశలో లూనా కస్టమర్లలో 90 శాతం మంది మహిళలే ఉండేవారు. తర్వాతి కాలంలో వాళ్లు కూడా స్కూటర్ల వైపు మళ్లిపోయారు. ఒక్క లూనా మాత్రమే కాదు. ప్రస్తుతం ఇండియా మార్కెట్ నుంచి మోపెడ్స్ చాలా వేగంగా కనుమరుగవుతున్నాయి.

> "50 కిలోలు మాత్రమే ఉండే టూ వీలర్‌ను తయారు చేయడం ఓ పెద్ద చాలెంజ్ నాకు. అది కూడా అప్పట్లో పూర్ క్వాలిటీ ఉన్న ఇండియా రోడ్లపై పరిగెత్తే సామర్థ్యం ఉన్న బండికి రూపమివ్వాలి. పెట్రోల్ కల్తీ, ఓవర్ లోడింగ్ వంటి ఎన్నో సమస్యలు. కొన్ని వందల సార్లు రోడ్డు ట్రయల్స్ నిర్వహించాం. అన్ని రకాలుగా పరీక్షించి చూశాం. మొత్తానికి లూనాను రెడీ చేశాం"
> ఓ ఇంటర్వ్యూలో కైనెటిక్ గ్రూప్ చైర్మన్ అరుణ్ ఫిరోడియా



రైల్వే స్టేషన్లలో మట్టి కప్పులు

వేడి వేడి చాయ్ ప్లాస్టిక్ కప్పులో పోస్తే? మెత్తబడతది. పేపర్ కప్పులో పోస్తే? అదీ దాదాపుగా అంతే. మరి మట్టి కప్పు అయితే? ఆరోగ్యానికి ఆరోగ్యం, పేదరికాన్ని పారద్రోలవచ్చు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి, రాయ్‌బరేలీ రైల్వే స్టేషన్లలో ప్లాస్టిక్, పేపర్ కప్పులకు బదులు మట్టి కప్పుల్లో చాయ్ అందించనున్నారు.

రైల్వేలో మట్టి కప్పుల చాయ్ కొత్త ఐడియా ఏమీ కాదు. 15 ఏళ్ల క్రితం నాటి రైల్వే మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ మట్టి కప్పుల చాయ్‌ను రైలు ప్రయాణికులకు రుచి చూపించారు. మళ్లీ నేడు ప్రస్తుత రైల్వే మంత్రి పీయూష్‌గోయల్ వారణాసి, రాయ్‌బరేలీ రైల్వే స్టేషన్ల కేటరర్లను మట్టి గ్లాసులు, మట్టి ప్లేట్లు వాడాలని ఆదేశించారు. లాలూ, పీయూష్ ఇద్దరి నిర్ణయాల వెనుక పేదల ఆకలి ఉంది. రాయ్‌బరేలీ, వారాణాసిలో కుమ్మరుల సంఖ్య ఎక్కువ. మట్టి పాత్రల తయారీయే వాళ్ల జీవనాధారం. నానాటీ కునారిల్లిపోతున్న వీరికి చేయుత అందించేందుకే మట్టి కప్పులు, ప్లేట్లను మాత్రమే రెండు రైల్లే స్టేషన్ల కేటరర్లు వాడాలని కేంద్రం ఆదేశించింది. ఈ నిర్ణయం వెనుక ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) చైర్మన్ కృషి ఉంది. ఆయనే మట్టి పాత్రల వాడకాన్ని ప్రోత్సహించాలంటూ రైల్వే మంత్రికి లేఖ రాశారు. ఆ తర్వాత 'కుమ్మరి స్వశక్తికరణ పథకం' కింద కుమ్మరులకు కరెంటు తిరిగే చక్రాలను కేవీఐసీ అందించింది.



మంచు సరస్సును ముంచుతున్నరు

కశ్మీర్.. చుట్టూ కొండలూ కోనలు, వాటికి పచ్చచీర కట్టినట్లు చెట్లు. ఆ అందాలను అలా చూస్తూ దాల్ సరస్సులో బోటింగ్ చేస్తే.. ఆ థ్రిల్లే వేరు. ఆ మజానే వేరు. దేశంలోనే ప్రముఖ టూరిజం స్పాట్‌గా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న దాల్ లేక్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. నానాటికీ సరస్సు విస్తీరణం తగ్గిపోతోంది. చుట్టూ వెలుస్తున్న ఇళ్లు, దుకాణ సముదాయాలు.. వాటికి తోడు మురికినీటి సరఫరా, చెత్తా చెదారం సవాల్‌గా మారాయి. అక్కడి ఆఫీసర్లు ఎన్ని చర్యలు చేపడుతున్నా ఫలితం కనిపించడం లేదు.

జమ్ముకశ్మీర్ వేసవి రాజధాని శ్రీనగర్‌ను ఆనుకొని ఉన్న దాల్ సరస్సు ఒకప్పుడు 25.86 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉండేది. ఇందులో 18.21 చదరపు కిలో మీటర్ల పరిధిలో నీటి ప్రవాహం, మిగతా 7.65 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో పచ్చని ఖాళీ ప్రదేశం ఉండేవి. ఈ సరస్సులో బోటింగ్ చేసేందుకు పర్యాటకులు ఇష్టపడుతుంటారు. కశ్మీర్‌కే అందంగా నిలుస్తున్న దాల్ సరస్సు బ్యాక్‌డ్రాప్‌లో ఎన్నో సినిమాలు రూపుదిద్దుకున్నాయి. ఇక్కడి ప్రధాన ఆకర్షణ 'షికారాలు'. అంటే గూటి పడవలు. అందంగా అలంకరించిన ఈ పడవల్లో ప్రయాణించడానికి పర్యాటకులు ఉవ్విళ్లూరుతుంటారు. కూరగాయలు, పండ్లు, పూలు అన్నింటినీ వ్యాపారులు పడవల్లోకెక్కించి, దాల్ సరస్సు నీటిపై తేలియాడుతూ అమ్ముతుంటారు. ఇవన్నీ దాల్ లేక్ పరిసర ప్రాంతాల్లో సాగు చేసినవే. చలికాలం మాత్రం ఇక్కడ బోటింగ్ ఉండదు. కనీసం ఇందులోని నీళ్లను కూడా టచ్ చేయలేం. మంచు కారణంగా సరస్సులోని నీళ్లన్నీ గట్టకట్టుకుపోతాయి.

కబ్జా కోరలు, మురికి నీళ్లు

దాల్ సరస్సు చుట్టూ వేలాది కుటుంబాలు నివసిస్తున్నాయి. సరస్సులో బోటింగ్ నిర్వహిస్తూ.. పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తు బతుకుతున్నాయి. పర్యాటకుల రద్దీని దృష్టిలో పెట్టుకొని కొన్నేళ్లుగా బడా నేతలు, బడా వ్యాపారులు సరస్సు పరీవాహక ప్రాంతాన్ని కబ్జా చేసి భవంతులు కట్టేశారు. ఫలితంగా దాల్ సరస్సు విస్తీర్ణం క్రమేణా తగ్గుతోంది. ప్రస్తుతం 22 చదరపు కిలోమీటర్లకే సరస్సు పరిమితమైంది. ఇక శ్రీనగర్‌లోని జనావాసాల నుంచి వచ్చే మురికి నీరు ఇటు దాల్ సరస్సులో, అటు జీలం నదిలో కలుస్తుంటుంది. పట్టణం నుంచి ప్రతి రోజు 201 మిలియన్ లీటర్ల మురుగు విడుదలవుతుంటుందని గత ఏడాది రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నివేదికలో తేలింది. ఇందులో 73 శాతం మురికి నీళ్లు దాల్ సరస్సులో, జీలం నదిలోకి వెళ్తుంటాయి. మురికినీటి కారణంగా సరస్సు విషతుల్యమవుతోందని ఎన్నో అధ్యయనాలు హెచ్చరించాయి. 1978లో ఈఎన్ఈఎక్స్ సంస్థ ఓ రిపోర్టును తయారు చేసింది. ఆక్రమణలు, మురికినీటి వల్ల దాల్ సరస్సుకు ముప్పు తప్పదని, సరస్సు రూపు రేఖలు లేకుండాపోవచ్చని హెచ్చరించింది. దురాక్రమణలు తొలగించాలంటూ 2002 నుంచి జమ్ముకశ్మీర్ హైకోర్టులో పిటిషన్లు దాఖలవుతూనే ఉన్నాయి. ఇటీవల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని కోర్టు ఆదేశించింది. ఆక్రమణలకు ఆఫీసర్లు అడ్డుకట్టవేస్తున్నప్పటికీ సరస్సుపై బతుకుతున్న వాళ్లకు పునరావాసం కల్పించడంలో మాత్రం విఫలమవుతున్నారు. ఫలితంగా స్థానికులు ఆ ప్రదేశాన్ని విడిచిపెట్టడం లేదు. 'నేను దాల్ సరస్సులో పడవను నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. పునరావాసం కల్పిస్తే వెళ్లడానికి సమస్య లేదు. కానీ అలా జరగడం లేదు' అని ఓ పడవ ఓనర్ అన్నారు. సరస్సులోని మురుగు శుద్ధి కోసం ప్రభుత్వం రూ. 759 కోట్లు కేటాయించగా.. అందులో సగానికిపైగా పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఆర్మీ ఏరేస్తోంది

దాల్ సరస్సులోని మురికినీటిని శుద్ధి చేసే పనులకు ఆర్మీ సైతం ముందుకు వచ్చింది. గత నెల 24వ తేదీ నుంచి 21రోజుల పాటు సాగిన క్లీనింగ్ డ్రైవ్‌లో సైనికులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. జనంలో అవగాహన కల్పిస్తున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయి. ప్రస్తుతం మంచు కురుస్తుండటంతో పనులకు ఆటంకం కలుగుతోందని ఆఫీసర్లు చెప్తున్నారు.





ఆరోగ్యాన్ని 'చెమట' చెప్పేస్తుంది

ఏదైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే.. రక్తం తీయడమో, పెద్ద పెద్ద యంత్రాలతో చెక్ చేసుకోవడమో తప్పదు. కానీ కేవలం మన చెమటను పరిశీలించడం ద్వారా శరీర ఆరోగ్య స్థితిని చెప్పేసే టెక్నాలజీ సిద్ధమవుతోంది. కేవలం ఒక చిన్న స్టిక్కర్‌లా ఉండే పరికరాన్ని (స్వెట్ ప్యాచ్‌ను) చేతిపై అతికించుకుంటే చాలు. డీ హైడ్రేషన్‌కు గురైనా, శరీరానికి కావాలసిన అత్యవసరమైన లవణాల శాతం తగ్గిపోయినా, రక్తంలో షుగర్ లెవల్స్ మారిపోయినా వెంటనే గుర్తించొచ్చు. అమెరికాలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ బయో మెడికల్ ఇంజనీర్ జాన్ రోజర్స్ నేతృత్వంలోని బృందం ఈ పరికరాన్ని అభివృద్ధి చేసింది.

కెమికల్ కాంపౌండ్స్‌ను పరిశీలించి..

చర్మంపై అతికించే ఈ పరికరం అడుగున సన్నని రంధ్రాలు ఉంటాయి. వాటి నుంచి చెమట లోపలికి వెళుతుంది. పరికరంలోని వేర్వేరు చోట్ల వేర్వేరు కెమికల్ కాంపౌండ్స్‌కు స్పందించే సెన్సర్లు ఉంటాయి. అవి చెమటలో ఉన్న గ్లూకోస్, లాక్టేస్, క్లోరైడ్ లెవల్స్‌ను, ఇతర లవణాల పరిస్థితికి తగినట్టుగా స్పందిస్తాయి. చెమట విడుదలయ్యే రేటు ఆధారంగా శరీరంలో నీటి శాతాన్ని అంచనా వేస్తాయి. ఈ సమాచారం మన స్మార్ట్‌ఫోన్‌లోకి అందుతుంది. చిన్న స్టిక్కర్‌లా అతికించుకునే వీలు ఉండటంతో చిన్నపిల్లల నుంచి పెద్దవయసు వాళ్ల వరకు ఎవరైనా వాడొచ్చు. చెమటలోని మరిన్ని రసాయనాలను విశ్లేషించే సెన్సర్లను అభివృద్ధి చేస్తున్నామని, కిడ్నీలు, కాలేయం వంటి వాటి పనితీరునూ గుర్తించేలా తయారు చేస్తామని పరిశోధకులు చెబుతున్నారు.

ప్రసవం వాయిదా వేసుకుని మరీ.. పార్లమెంటుకు రావాలా?

- బ్రిటన్‌లో కాలం చెల్లిన చట్టాలు
- ఎంపీలకు ప్రత్యక్ష ఓటింగ్‌కు మాత్రమే అనుమతి
- సిజేరియన్ వాయిదా వేసుకుని సభకు వచ్చిన ఎంపీ సిద్దిఖ్

రోజు.. జనవరి 16

స్థలం.. బ్రిటన్ పార్లమెంట్

విషయం.. ఇంగ్లండ్ ప్రధాని థెరిసా మే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరుగుతోంది. ఇందులో ఎంపీ తులిప్ సిద్దిఖ్ కూడా పాల్గొన్నారు. అయితే ఎంటి? అనుకుంటున్నారా? ఆమె నెలలు నిండిన గర్భవతి. నడవలేని స్థితిలో, వీల్‌చైర్‌లో కూర్చుని ఉన్నారు. ఓటింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. సిజేరియన్ ఆపరేషన్ వాయిదా వేసుకుని మరీ వెయిట్ చేస్తున్నారు. ఎందుకు?

కాలం చెల్లిన చట్టాలు

హాంప్‌స్టీడ్, కిల్‌బర్న్ నియోజకవర్గ ఎంపీగా తులిప్ సిద్దిఖ్ ఉన్నారు. ఆమెకు డయాబెటిస్ కూడా ఉంది. తన ప్రసవాన్ని వాయిదా వేసుకుని, ఓటింగ్‌లో పాల్గొనేందుకు సభకు వచ్చారు. ఇందుకు 19వ శతాబ్దపు, కాలం చెల్లిన చట్టాలే కారణం. బ్రిటన్ చట్టాల ప్రకారం పార్లమెంట్‌లో ఓటింగ్ జరుగుతున్న సమయంలో ఎంపీ ప్రత్యక్షంగానే ఓటు వేయాలి. ప్రతినిధి ద్వారా వేసేందుకు వీలు లేదు. ప్రాక్సీ ఓటింగ్ (తనకు బదులుగా ఇంకొకరి ద్వారా ఓటు వేసే వెసులుబాటు) నిబంధన బ్రిటన్ పార్లమెంటులో లేదు. సభకు రాకున్నా, ఓటింగ్‌లో పాల్గొనకున్నా 'గైర్హాజరు'గా లెక్కిస్తారు. దీంతో సిద్దిఖ్ తన గొంతు వినిపించేందుకు ప్రాణపాయ స్థితిలోనూ సభకు వచ్చారు. 19 శతాబ్దంలో పురుషులు ఎక్కువ ఉన్న సమయంలో తీసుకొచ్చిన నిబంధన ఇది. దీన్నే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. పాత చట్టాలను మార్చాలని, ప్రాక్సీ ఓటింగ్‌ను అమల్లోకి తీసుకురావాలని ఏళ్లుగా చర్చ నడుస్తున్నా, దాన్ని అమలు చేసే చర్యలు మాత్రం ముందుకు సాగడం లేదు.

ఐర్లాండ్‌లో ఇలానే..

2012 అక్టోబర్ 28న ఐర్లాండ్‌లో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న సవిత హాలప్పనవర్ అనే మహిళకు అబార్షన్ చేసేందుకు డాక్టర్ నిరాకరించారు. ఎందుకంటే ఐర్లాండ్‌లో అబార్షన్ చేయడం చట్ట విరుద్ధం. దీంతో చికిత్స అందక చివరికి ఆమె చనిపోయింది.



> "ఈ మధ్య జరిగిన ఘటన మరోసారి జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సిజేరియన్ ఆపరేషన్‌ను వాయిదా వేసుకుని, ఎంపీ సిద్దిఖ్ వీల్‌చైర్‌పై పార్లమెంట్‌కు వచ్చిన ఘటన నిజంగా మాకు సిగ్గుచేటు. పార్లమెంట్‌ను మోడ్రనైజ్ చేయాల్సిన సమయం వచ్చింది. ఓటు వేయలేని పరిస్థితిలో ఉన్న వారి కోసం కొత్త పద్ధతిని తీసుకురావాలి. ప్రాక్సీ ఓటింగ్ ద్వారానో, ఇంకో విధంగానో ఓటు వేసే వెసులుబాటు కల్పించాలి"
> - సౌతాల్, ఈలింగ్ ఎంపీ వీరేంద్ర శర్మ

> "సిద్దిఖ్‌కు ప్రాక్సీ ఓటింగ్ అవకాశం కల్పించాల్సింది. కానీ దానికి అనుమతించే అధికారం నాకు లేదు"
> - స్పీకర్ జాన్ బెర్కో

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.